డిజిటల్ ఇండియా ఇంటర్న్‌షిప్




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 17 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 101 | పేజీలు:12 | వెల రూ.5


పెళ్లికి సవర బంగారం, రైతులకు రుణ మాఫీ




9

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

## లోక్‌సభ ప్రత్యేక సమావేశం..

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై చర్చ

## డివిజన్ ఓటింగ్ ద్వారా సభలో వీటి ప్రవేశానికి అనుమతి

ఢిల్లీ, ఏప్రిల్ 16: ఉత్కంఠపూరితమైన.. ఆసక్తికర పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభమైనాయి. చట్టసభల్లో మహిళా రిజర్వేషన కల్పన.. డీలిమిటేషన్ అంశాలపై ఏర్పాటైన ఈ స్పెషల్ సెషన్ ఏర్పాటు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఉదయం 11 గంటలకు లోక్ సభ ప్రారంభమైన వెంటనే.. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, హోంమంత్రి అమిత్ షా.. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు సంబంధించిన మూడు బిల్లులను లోక్ సభలో ప్రతిపాదించారు. వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగుకు పట్టుబట్టడంతో స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు.



డివిజన్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు. మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్రం ఈ మూడు బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్ సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ అంశాలు రాజ్యాంగ సవరణతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. ఈ బిల్లులపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. నేడు (ఏప్రిల్ 17) సాయంత్రం 4 గంటలకు వీటిపై ఓటింగ్ నిర్వహించనున్నట్లు సభాపతి తెలిపారు.

**2011 ప్రకారమే డీలిమిటేషన్..**

లోక్ సభలో సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతోపాటు.. 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీలిమిటేషన్

...మిగతా 2లో

## రాజకీయ రిజర్వేషన్ మహిళల హక్కు

దాన్ని వ్యతిరేకించే వారిని దెబ్బ కొడతారు

మహిళా రిజర్వేషన్లపై మోడీ హెచ్చరిక



ఢిల్లీ, ఏప్రిల్ 16: మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ప్రధాని మోడీ అన్నారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు . చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు,

...మిగతా 2లో

## అమ్మలకు, ఆడబిడ్డలకు ఇచ్చే గౌరవమే.. దేశానికిచ్చే గౌరవం

ఢిల్లీ, ఏప్రిల్ 26: తల్లులు, సోదరీమణులకు ఇచ్చే గౌరవమే దేశానికి మనం ఇచ్చే గౌరవం అని ప్రధాని అన్నారు. నేటినుంచి మూడు రోజుల పాటు పార్లమెంట్లో జరగనున్న ప్రత్యేక

...మిగతా 2లో

## తెలంగాణలో 9 స్థానాలు పెరుగుతయ్

- 26 స్థానాలతో సీట్ల శాతం 3.18కి చేరుతుంది
- దక్షిణాదిలో మొత్తం ఎంపీ స్థానాలు 195 అవుతాయి
- డీలిమిటేషన్‌పై లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా



ఢిల్లీ, ఏప్రిల్ 16: డీలిమిటేషన్తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. తెలంగాణలో

...మిగతా 2లో



2

## లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు

దీనిలో ఎస్సీ, ఎస్టీలకు ఉప కోటా లభిస్తుంది

కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

## రిజర్వేషన్ల క్రెడిట్ మాదే

కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ

ఢిల్లీ, ఏప్రిల్ 16: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రసగించారు. అంతకముందు ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగాన్ని తప్పుపట్టిన ఆమె.. అందులో జవహర్లాల్ నెహ్రూ పేరు వినిపించకపోవడం



...మిగతా 2లో

**మొకాలికి... బోడిగుండుకు ముడి..!**

మహిళ బిల్లుకు, డీలిమిటేషన్‌కు లింకేంటి

డీలిమిటేషన్‌లో వాటా తగ్గితే ఊరుకోం

'తెలంగాణ' తరహాలో మరో ఉద్యమం ఖాయం

లోక్‌సభలో 3.13 శాతం సీట్ల ప్రాతినిధ్యం ఉండాల్సిందే

కేంద్రానికి జాగృతి అధ్యక్షురాలు కవిత అల్టిమేటం

2

## బీజేపీ ప్రతీసారి తెలంగాణను అవమానిస్తోంది



### ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోంది

లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వి వ్యాఖ్యలపై మంత్రుల ఫైర్

క్షమాపణ చెప్పాలని ఎంపీలు, ప్రజా సంఘాల నేతల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనం బ్యూరో): కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌ను బ్రిటిషర్లు భారత్, పాకిస్తాన్‌గా విభజించిన తీరు కంటే ఘోరంగా ఉందని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై మంత్రులు తీవ్రంగా స్పందించారు. బీజేపీకి ప్రతీసారి తెలంగాణను అవమానించడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. నియోజకవర్గాల

...మిగతా 2లో

**డీజీపీకి మంత్రి పొన్నం లేఖ**

## తెలంగాణపై బీజేపీ విషం

రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చడంపై ఆగ్రహం

తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్

తెలంగాణ ఎంపీలు ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టువెట్టిండ్రు?

త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడింది?: హరీశ్



2

## ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో హైదరాబాద్ నెం.1

ప్రపంచవ్యాప్తంగా బ్రాండింగ్ అవుతున్న మేడిన్ తెలంగాణ మార్క్

అత్యంత కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీగా రాజధాని

అమెరికా ఉన్నతస్థాయి అధికార ప్రతినిధి బృంద సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 16: ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. సెక్రెటేరియట్లో గురువారం అమెరికన్ నేషనల్ కాలేజ్ బృంద సభ్యులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి ఈ సందర్భంగా వివరించారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ

...మిగతా 2లో

## అనర్హత పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయండి

స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్,ఏప్రిల్ 16(మనం,ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలను గురువారం హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం, అరికెపూడి గాంధీ,

...మిగతా 2లో



2

## ఇంక మిగిలింది 15 రోజులే

- మంత్రి అజారుద్దీన్‌కు పదవీ గండం
- ఇంకా గవర్నర్ దగ్గరే పెండింగ్‌లో ఎమ్మెల్సీ ఫైలు
- ఆమోదించాలని మంత్రివర్గం మళ్లీ సిఫారసు చేస్తుందా?
- గడువుకు ముందే రాజీనామా చేయించి మళ్లీ అవకాశం ఇస్తారా ?

## సురక్షిత ప్రయాణాలతో..ప్రమాదాలకు చెక్

సీఎం ఆదేశాలతో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

ఆరైవ్ అలైవ్‌లో కదం తొక్కిన పోలీసులు

డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్ 16(మనం,ప్రత్యేక ప్రతినిధి): సురక్షిత ప్రయాణంతో ప్రమాదాలను అరికట్టాలని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా కార్యక్రమం అరైవ్ అలైవ్ లో భాగంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో

...మిగతా 2లో



## సుస్థిర శాంతి స్థాపనే లక్ష్యంగా సాగుదాం

ఆస్ట్రియన్ ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్‌తో మోడీ భేటీ

ద్వైపాక్షిక అంశాలు, యుద్ధాలపై చర్చలు

ఢిల్లీ, ఏప్రిల్ 16: పశ్చిమాసియా, ఉక్రెయిన్ ప్రాంతాల్లో సుస్థిర, సుదీర్ఘ శాంతి స్థాపనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఆస్ట్రియన్ ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్ తో కలిసి ప్రెస్ మీట్ లో పాల్గొన్న ప్రధాన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. 'కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచం మొత్తం ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆ ప్రభావం మనందరిపై పడుతోంది. ఈ సైనిక ఘర్షణలకు ఇంకా పరిష్కారం లభించలేదు. అది ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా శాశ్వత శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నాం. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి సంస్కరణలు చేపట్టాలి. ఇందుకోసం ఉగ్రవాదాన్ని పారదోలడం ఎంతైనా అవసరం'' అని మోదీ పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఆస్ట్రియా ఛాన్సెలర్ రాకతో భారత్లో వాణిజ్య, పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం



...మిగతా 2లో

## యుద్ధానికి త్వరలోనే ముగింపు

యుద్ధం ముగిశాక ధరలు తగ్గుతాయి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 16: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం త్వరలోనే ముగుస్తుందని.. అందుకు అత్యంత చేరువగా ఉన్నామని పేర్కొన్నారు. తమతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందనీ చెప్పారు. ఇక అమెరికా-ఇరాన్ మధ్య రెండో విడత చర్చల ఏర్పాటుకు మధ్యవర్తుల ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా తమ సైన్యాధిపతి ఫీల్ మార్షల్ అసీం మునీర్ నేతృత్వంలో ఓ బృందాన్ని టెహ్రాన్‌కు పాకిస్థాన్ బుధవారం పంపించింది. మరోవైపు- ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా కొనసాగిస్తోంది. దీంతో ఆగ్రహించిన టెహ్రాన్.. దిగ్బంధనాన్ని



...మిగతా 2లో

## మా తొలి దెబ్బకే.. మీ పని మటాష్

అమెరికాకు ఇరాన్ వార్నింగ్

టెహ్రాన్, ఏప్రిల్ 16: చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారుడు మొహ్సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే.. తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు.

'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్మూజ్‌కు రక్షక భటుడిగా మారాలనుకుంటున్నారు. ఇది నిజంగా మీ పనా?హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చూపాలని చూస్తే.. మా తొలి క్షిపణి దాడికే.. మీ నౌకలు మునిగిపోతాయి. మా క్షిపణుల దాడితో అవి ధ్వంసమవుతాయి' అని రెజాయి హెచ్చరించారు. తమ దాడుల్లో జలసంధి

...మిగతా 2లో

# డిజిటల్ ఇండియా ఇంటర్న్‌షిప్
## సమ్మర్ బ్యాచ్ అడ్మిషన్లు

**ఢిల్లీ, ఏప్రిల్ 16:** విద్యార్థులకు డిజిటల్ రంగంలో కొత్త నైపుణ్యాలను అందించేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ, ఎన్ఐసీ ఆధ్వర్యంలో ఈ వేసవిలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. క్లాస్‌లో నేర్చుకున్న జ్ఞానానికి నిపుణుల మార్గదర్శకత్వంలో ఆచరణాత్మకత అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన డిజిటల్ ఇండియా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

**కాలావధి:** నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రామ్ కనీసం రెండు నెలలు ఉంటుంది. ఇంటర్న్ల పెర్ఫామెన్స్, ఎన్ఐసీ అవసరాన్ని బట్టి పొడిగించే అవకాశం ఉండొచ్చు. ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ జూన్ 1 న మొదలై జులై 31వరకు ఉంటుంది. ఢిల్లీలోని ఎన్ఐసీ కేంద్ర కార్యాలయంతో పాటు పాటు రాష్ట్రాల్లోని ఎన్ఐసీ సెంటర్లోనూ అందిస్తారు.

**ఏయే విభాగాలు:** బీఈ/బీటెక్; బీఈ/బీటెక్ (లేటర్) మూడో సంవత్సరం విద్యార్థులతో పాటు ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ(సీఎస్)/ఎమ్మెస్సీ(ఐటీ) ప్రథమ సంవత్సరం; ఎంసీఏ- రెండో సంవత్సరం; డ్యుయల్ డిగ్రీ కోర్సులు (ఎంఈ/ఎంటెక్) నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరూ ఈ ఇంటర్న్‌షిప్పుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**స్టైపెండ్:** నెలకు రూ.10వేలు చొప్పున రెమ్యునరేషన్ అందిస్తారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు ఎన్ఐసీ వెబ్‌సైట్‌ను సంప్రదించండి.

# బీజేపీ ప్రతీసారి తెలంగాణను అవమానిస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

పునర్విభజనకు రాష్ట్ర జనాభాను, జీఎస్‌డీపీని అనుసంధానించాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన తెలివితక్కువదని, అది రాజ్యాంగ విరుద్ధమని తేజస్వి వ్యాఖ్యానించడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

**తేజస్వి వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలి: పొన్నం**

తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ నిరంతరం విషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విభజనను బ్రిటిష్ ఇండియా విభజనతో పోల్చడం అసత్యమని ఆక్షేపించారు. కోట్లాది మంది ప్రజలు ఒక్కటై ఆంధ్ర పాలకుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న తెలంగాణను కించపరిచేలా మాట్లాడటం ఖండనీయమని పేర్కొన్నారు. తెలంగాణ గౌరవాని కించపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజల ఆత్మ గౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తెలంగాణను అగౌరవపరుస్తుంటే రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

**తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే సహించేది లేదు : మంత్రి కోమటిరెడ్డి**

నాలుగు కోట్ల ప్రజల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా పార్లమెంటులో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడటం దుర్మార్గమని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పాటును ఇండియా-పాకిస్తాన్ విభజనతో పోల్చడం హేయనీయమన్నారు.

నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడటం దుర్మార్గమనీ, స్వరాష్ట్ర కాంక్ష కోసం అగ్నికి ఆహుతైన బిడ్డల త్యాగాలను పార్లమెంట్ వేదికగా అవమానిస్తారా ? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్ ప్రక్రియ ద్వారా ఏర్పాటైందనీ, బీజేపీ ఎంపీ అజ్ఞానపు మాటలపై లోక్‌సభ స్పీకర్ చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వందలాది మంది విద్యార్థులు, యువకుల ప్రాణ త్యాగాల ఫలితంగా పార్లమెంటులో ఆమోదించిన చట్టం ద్వారా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం తేజస్వి అజ్ఞానానికి పరాకాష్ట అనీ, ఇది అమరుల త్యాగాలను కించపరచడమేనని మండిపడ్డారు.

# సుస్థిర శాంతి స్థాపనే లక్ష్యంగా సాగుదాం

(మొదటి పేజీ తరువాయి)

మొదలైందని మోడీ తెలిపారు. భారత్- ఈయూ మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు నాలుగురోజుల పాటు భారత్లో పర్యటిస్తున్నారు.

# ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో హైదరాబాద్ నెం.1

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నదని చెప్పారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు.. అన్నింటిలోనూ మేడిన్ తెలంగాణ మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నదని తెలిపారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధి రేటును నమోదు చేస్తున్నదన్నారు.

**హైదరాబాద్ మొదటి స్థానం...**

అలాగే.. 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదైందన్నారు. లాక్ హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవే కాకుండా ప్రిసిషన్ ఇంజినీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండును విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం ప్రపంచంలోనే అత్యంత కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీగా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్ అవార్డును గెలుచుకుని గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్సు అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు తెలంగాణ సిద్ధంగా ఉన్నదని స్పష్టం చేశారు.

# సురక్షిత ప్రయాణాలతో.. ప్రమాదాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా ఎస్పీ డి. జానకి ఆధ్వర్యంలో జరిగిన భారీ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమానికి డిజిపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతోనే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని డీజీపీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాలానగర్ మండలం పెద్దాయపల్లి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై 'బ్లాక్ స్పాట్'గా గుర్తించిన కూడలి వద్ద ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనదారులకు డీజీపీ హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక చంద్ర గార్డెన్‌లో సుమారు 3000 మంది విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలతో జరిగిన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి బి శివధర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో ఒక్క క్షణం పాటు చేసే నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా, ఆ కుటుంబం మొత్తాన్ని రోడ్డున పడేస్తుందన్నారు. అతివేగం, నిర్లక్ష్యపు ఓవర్టేకింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ప్రజలు తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దేశ భవిష్యత్తుకు అవసరమైన యువకులు ఎందరో రోడ్డు ప్రమాదాల కారణంగా మరణిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు.

# మా తొలి దెబ్బకే.. మీ పని మటాష్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ఇక, ఇరాన్‌పై భూతల దాడులకు అమెరికా సిద్ధమైందంటూ ఇటీవల పెద్దఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిగురించి కూడా ఆయన మాట్లాడారు. భూతల దాడులకు వచ్చిన యూఎస్ సైనికులను బందీలుగా చేసుకుంటామని హెచ్చరించారు.

వారిని విడిపించుకోవాలంటే.. ఒక్కో బందీకి ఒక బిలియన్ డాలర్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

# ఇంక మిగిలింది 15 రోజులే

**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనం బ్యూరో):** రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్న ఏకైక మైనార్టీ మంత్రి అజారుద్దీన్‌కు పదవీ గండం తప్పదా ? ఆయనను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ ప్రభుత్వం పంపిన ఫైలును గవర్నర్ పదిహేను రోజుల్లో క్లియర్ చేస్తారా ? ప్రస్తుతం ఈ ప్రశ్నలు రాష్ట్ర రాజకీయ వర్గాలలో ఆసక్తిని రేపుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరైనా మంత్రిగా కొనసాగాలంటే ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లోగా ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. గతేడాది అక్టోబర్ 31న ఆజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీని ప్రకారం ఆయన ఈనెల 31లోగా ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలి. ప్రస్తుతానికి రాష్ట్రంలో ఏ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఎన్నికలు జరిగే అవకాశం లేదు. అంటే ఆయన్ని గవర్నర్ ఎమ్మెల్సీగా నియమించాలి. రాష్ట్ర శాసన మండలిలో గవర్నర్ కోటా కింద ప్రస్తుతానికి రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటిపై గత బీఆర్ఎస్ నుండి ప్రస్తుత కాంగ్రెస్ హయాం వరకూ వివాదాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీ ఖాన్ పేర్లను మంత్రివర్గం సిఫారసు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా సిఫారసు చేయబడ్డ వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కోదండరాం, అమీర్ అలీ ఎమ్మెల్సీ పదవులను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఆ తరువాత రాష్ట్ర మంత్రివర్గం అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ పేరును చేర్చి మళ్లీ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేసింది.

ఈ అంశం న్యాయస్థానంలో ఉండటంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయలేదు. దీంతో కోదండరాం, అజారుద్దీన్‌ల ఫైల్ గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉంది. ఈ ఫైల్‌కు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఇద్దరు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారానికి లైన్ క్లియర్ అవుతుంది. ఆ విధంగా కాని పక్షంలో మంత్రివర్గం ఆజారుద్దీన్ పేరును గవర్నర్ కోటాలో సిఫార్సు చేయాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, గవర్నర్ కోటా ఎంపికకు రాష్ట్ర క్యాబినెట్ మళ్లీ తీర్మానాన్ని చేస్తుందా లేక గతంలో కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఎంపిక చేస్తూ చేసిన తీర్మానాన్ని ఆమోదించమని గవర్నర్‌ను ప్రభుత్వం కోరుతుందా అన్నది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# డీజీపీకి మంత్రి పొన్నం లేఖ

**హైదరాబాద్,ఏప్రిల్ 16(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ విభజన పై భారత్ పాకిస్థాన్‌తో పోల్చుతూ పార్లమెంట్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డికి మంత్రి పొన్న ప్రభాకర్ లేఖ రాశారు.

తెలంగాణ ఏర్పాటు అనేది ఇక్కడి ప్రజల న్యాయమైన ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, ఒక ప్రజాస్వామ్య, రాజ్యాంగ బద్ధమైన ప్రక్రియ ఫలితంగా జరిగిందన్నారు.

దీనిని భారతదేశపు బాధాకరమైన, హింసాత్మక విభజనతో పోల్చడం ఆ ప్రక్రియ యొక్క పవిత్రతను తగ్గించడమే కాక, తెలంగాణ ప్రజల మనోభావాలను విస్మరించినట్లు అవుతుందన్నారు.

ఈ తరహా ప్రకటనలు ప్రజా సామరస్యాన్ని దెబ్బతీయడానికి, ప్రాంతీయ కలహాలను పెంచడానికి, చారిత్రక, రాజ్యాంగ వాస్తవాలను వక్రీకరించడానికి అవకాశం ఉందన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి, ప్రజా శాంతి, సామరస్యాలను కాపాడటానికి, ఈ విషయాన్ని పరిశీలించి, చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి లేఖలో కోరారు.

# యుద్ధానికి త్వరలోనే ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

ఉపసంహరించుకోకపోతే ప్రాంతీయంగా వాణిజ్య కార్యకలాపాలను అడ్డుకుంటామని తాజాగా హెచ్చరించింది. పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రం, ఎర్రసముద్రం వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు సాగనివ్వబోమని పేర్కొంది.

**ఇరాన్ అణ్వస్త్రాలను తయారుచేసుకునేది: ట్రంప్**

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే.. ఇరాన్‌తో యుద్ధం దాదాపు ముగిసినట్లే కనిపిస్తోందని ట్రంప్ బుధవారం ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో వ్యాఖ్యానించారు. అయితే పూర్తిస్థాయి పరిష్కార మార్గం కోసం చర్చలు ఇంకా జరగాలన్నారు. తాము ఇప్పుడు నిలువరించి ఉండకపోతే.. ఇరాన్ అణ్వస్త్రాలను తయారు చేసుకొని ఉండేదని ఆయన పేర్కొన్నారు. ఆ దేశంపై సైనిక చర్యను ఇంకా పూర్తిగా ఆపేయలేదని, పరిస్థితిని బట్టి ఆ విషయంలో ముందడుగు వేస్తామని చెప్పారు. కాల్పుల విరమణ గడువు పొడిగింపునకు కాకుండా, శాశ్వత శాంతి ఒప్పందంవైపే తాము మొగ్గుచూపుతున్నామని అన్నారు. యుద్ధం ముగిశాక చమురు ధరలు భారీగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఇరాన్కు ఆయుధాలు ఇవ్వకుండా ఉండేందుకు చైనా అంగీకరించిందని ట్రంప్ తెలిపారు.

**మరో రెండు వారాలపాటు కాల్పుల విరమణ?**

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గడువు ఈ నెల 22తో ముగియనుంది. దాన్ని కనీసం మరో రెండు వారాలపాటు పొడిగించాలని, తద్వారా శాశ్వత ఒప్పందం కుదిరే దిశగా దౌత్య ప్రయత్నాలు కొనసాగేలా చూడాలని మధ్యవర్తులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఇరాన్ అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధి, యుద్ధం కారణంగా కలిగిన నష్టానికి పరిహారం చెల్లింపు అంశాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడం వల్లే వాషింగ్టన్-టెహ్రాన్ తొలి దఫా చర్చలు విఫలమయ్యాయి. వీటిపై ఇరుపక్షాల మధ్య రాజీ కుదిర్చేందుకు మధ్యవర్తులు కృషిచేస్తున్నట్లు తెలుస్తోంది. తమ యురేనియం శుద్ధి ప్రణాళికలపై చర్చించేందుకు సిద్ధమేనని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తాజాగా తెలిపారు. అయితే అవసరాలకు అనుగుణంగా యురేనియం శుద్ధిని కొనసాగించేందుకు తమను అనుమతించాలని పేర్కొన్నారు.

హెజ్బొల్లా బెడదను తొలగించుకోవాలని లెబనాన్ ప్రభుత్వం భావిస్తోందని అమెరికాలో ఇజ్రాయెల్ రాయబారి యెకీల్ లెయిటర్ పేర్కొన్నారు. వాషింగ్టన్ వేదికగా మంగళవారం తమ మధ్య రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో లెబనాన్ రాయబారి నడా హమదే మోవాద్ ఈ విషయాన్ని స్పష్టం చేశారని చెప్పారు. ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య ఘర్షణకు సత్వరం తెరపడాల్సిన ఆవశ్యకతను మోవాద్ నొక్కిచెప్పారు. ఇరుపక్షాలూ కాల్పుల విరమణకు అంగీకరించాలని విన్నవించారు.

**యుద్ధ ప్రభావం నా పర్యటనపై ఉండదు**

వచ్చేనెలలో ట్రంప్ చైనా పర్యటనకు రానున్నారు. ఇరాన్ యుద్ధ ప్రభావం దీనిపై పడుతుందన్న అభిప్రాయాన్ని ఆయన తోసిపుచ్చారు. చైనాకు చమురు కావాలని, తమకు కాదని బుధవారం 'ఫాక్స్ బిజినెస్' ప్రసారం చేసిన ముఖాముఖిలో పేర్కొన్నారు. ఇరాన్‌కు ఆయుధ ఎగుమతులు చేయవద్దని తాను జిన్‌పింగ్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. అలాంటిదేమీ ఉండదని ఆయన ప్రత్యుత్తరం ఇచ్చారని తెలిపారు.

**ఆ విషయం పోప్‌నకు ఎవరైనా చెప్పండి**

పోప్ లియో-14పై ట్రంప్ మరోసారి విమర్శలు చేశారు. ఇరాన్ తమ దేశంలో గత రెండు నెలల్లో 42 వేల మంది నిరాయుధులైన నిరసనకారులను చంపింది. ఆ విషయాన్ని దయచేసి ఎవరైనా పోప్‌నకు చెప్పండి అని ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచానికి శాంతి, సామరస్యం అత్యవసరమని పోప్ అన్నారు. ఆఫ్రికా పర్యటనలో ఉన్న ఆయన బుధవారం తన విమానంలో విలేకర్లతో మాట్లాడారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న అల్జీరియాలోని ఓ ప్రఖ్యాత చర్చి, మసీదులను తన పర్యటనలో సందర్శించిన సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ''ముస్లింలు, క్రైస్తవుల విశ్వాసాలు, ప్రార్థనా విధానాలు, జీవన విధానాలు భిన్నంగా ఉన్నా, శాంతి, సామరస్యాలతో కలసి మెలిసి జీవిస్తున్నారు. ప్రపంచానికి ఈ సందేశం ఇప్పుడు అత్యవసరం'' అని పోప్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణపై బీజేపీ విషం

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మొదలు.. ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు.

కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

**తెలంగాణను.. రక్తపాత విభజనతో పోలుస్తారా? : హరీశ్** తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వీ సూర్య, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు.

# మోకాలికి... బోడిగుండుకు ముడి..!

**హైదరాబాద్,ఏప్రిల్ 16(మనం,ప్రత్యేక ప్రతినిధి):** నియోజకవర్గాల పునర్విభజనలో తెలంగాణకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పార్లమెంట్ లో తెలంగాణకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. మహిళా బిల్లు విషయంలో కేంద్రం కుట్రలు సాగనివ్వమని హెచ్చరిస్తూ గురువారం వీడియో సందేశం రిలీజ్ చేశారు. మహిళ బిల్లుకు, డీలిమిటేషన్ బిల్లుకు అసలు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మహిళ బిల్లును ఎప్పుడో ఆమోదించారని డీలిమిటేషన్, మహిళ బిల్లు వేర్వేరు అంశాలని చెప్పారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ అంశాన్ని కాల్చాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రాతినిధ్యం తగ్గొద్దు:** ప్రస్తుతం పార్లమెంట్ లో తెలంగాణకు రాజకీయ ప్రాతినిధ్యం 3.13 శాతంగా ఉందని, డీలిమిటేషన్ కు ఏ ప్రాతిపదికన తీసుకున్నా తెలంగాణ ప్రాతినిధ్యం ఏ మాత్రం తగ్గొద్దని కవిత తేల్చి చెప్పారు. మొత్తంగా 50 శాతం సీట్లు పెంచుతామంటూ ప్రతిపాదించటం కూడా సరైన పద్ధతి కాదని, బీహార్ తో పోల్చుకుంటే తెలంగాణలో పెరిగే సీట్లకు చాలా అంతరం ఉంటుందన్నారు. దీని కారణంగా తెలంగాణ రాజకీయ ప్రాధాన్యం భారీగా తగ్గుతుందన్నారు. కేంద్రం చెప్పే లెక్కల కారణంగా పెద్ద రాష్ట్రాలకు మాత్రమే ప్రయోజనం జరుగుతుందన్నారు. ఇప్పటికే నిధులు, జాతీయ ప్రాజెక్టులకు హోదా ఇచ్చే విషయంలో తీవ్ర అన్యాయం చేస్తున్నారని...తెలంగాణ ప్రాతినిధ్యం మరింత తగ్గితే ఇంకా అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిలుల్లు, లోక్ సభ- అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మరో బిల్లు ఉన్నాయి.

**దానిపైనే ఉత్కంఠ:** ఇందులో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు. మిగతా రెండూ చట్టపరమైన బిల్లులు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. మిగతా రెండింటికీ సాధారణ మెజారిటీ సరిపోతుంది.

ప్రస్తుతం లోక్సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మెజారిటీతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. అధికారిక ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. బిల్లు ఆమోదానికి మరో 68 మంది మద్దతు అవసరం. డీలిమిటేషన్ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న ఇండియా కూటమి ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని చెప్పడంతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంపై ఉత్కంఠ నెలకొన్నది.

# రిజర్వేషన్ల క్రెడిట్ మాదే

(మొదటి పేజీ తరువాయి)

గమనార్హం అని అన్నారు. మహిళల హక్కుల పట్ల బీజేపీ నేతలే ఛాంపియన్లుగా భావిస్తున్నారని ఆమె విమర్శించారు. ప్రధాని ప్రసంగంలో నెహ్రూ పేరు వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. రిజర్వేషన్లపై 2018లోనే ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ లేఖ రాశారు. 2019లోపే రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ కోరారు. మోదీ సగం సమాచారం మాత్రమే వెల్లడించారు. ఇవాళ ప్రధానంగా రిజర్వేషన్ల కోటాపై చర్చ కాదు.. లోక్సభ సీట్లను 850కి పెంచడంపైనే. మోదీ ప్రభుత్వం లోక్సభ సీట్ల పెంపుపైనే ఆసక్తి కనబరుస్తోంది. ఆ విషయంలో ప్రభుత్వానికి అంత తొందరెందుకు?' అని ప్రియాంక గాంధీ ప్రశ్నిం మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. 'మహిళా రిజర్వేషన్ బిల్లును ఎవరూ వ్యతిరేకించలేదు.

# అమ్మలకు, ఆడబిడ్డలకు ఇచ్చే గౌరవమే.. దేశానికిచ్చే గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఈరోజు నుంచి పార్లమెంటులో ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. మహిళా సాధికారత దిశగా మరో చారిత్రక అడుగు వేసేందుకు మన దేశం సిద్ధంగా ఉంది. సోదరీమణులు, తల్లులపై మనం చూపించే గౌరవమే.. దేశానికి మనమిచ్చే గౌరవం. ఇదే స్ఫూర్తితో, దృఢ నిశ్చయంతో మనమంతా ముందుకుసాగుదాం' అని మోడీ ఆయన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

# అనర్హత పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్గౌడ్, సంజయ్, తెల్లం వెంకట్రావుతో పాటు స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణ మే 6వ తేదీకి వాయిదా వేసింది.

**ఇది..జరిగింది:** బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, డా. సంజయ్ , దానం నాగేందర్ , కడియం శ్రీహరి కాంగ్రెస్ గూటికి చేరారని బీఆర్ఎస్, బీజేపీ ఆరోపించడంతో పాటు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

# తెలంగాణలో 9 స్థానాలు పెరుగుతయ్

(మొదటి పేజీ తరువాయి)

లోక్ సభ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. ఏపీలో 25 నుంచి 38కి.. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్ సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు.

'తెలంగాణలో ప్రస్తుత లోక్ సభ సీట్లు 3.13శాతంగా ఉన్నాయి. 26కు పెంచాక మొత్తం సీట్లలో తెలంగాణ శాతం 3.18కు పెరుగుతుంది. దక్షిణాదిలో మొత్తం ఎంపీ స్థానాలు 129 (23.76శాతం) నుంచి 195 (23.97శాతం)కు పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు దక్షిణాదికి అన్యాయం ఎలా జరుగుతుందో సభ్యులు చెప్పాలి. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. మొత్తం సీట్లలో 33 శాతం మహిళలకు రిజర్వ్ అవుతాయి. జనరల్ స్థానాల్లోనూ మహిళలకు అవకాశమిస్తే వారి ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది' అని అమిత్ షా తెలియజేశారు.

# రాజకీయ రిజర్వేషన్ మహిళల హక్కు

(మొదటి పేజీ తరువాయి)

పునర్విభజించేందుకు ఉద్దేశించిన ప్రవేశ పెట్టిన 3 కీలక బిల్లులపై చర్చలో భాగంగా ప్రధాని సభలో ప్రసంగించారు.

మహిళా రిజర్వేషన్ల ను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ రాజకీయ పార్టీలను ప్రధాని హెచ్చరించారు.

**రాజకీయ రిజర్వేషన్ మహిళల హక్కు..**

'దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది.

దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు.

ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు' అని మోదీ వ్యాఖ్యానించారు.

# లోక్ సభలో మహిళలకు 272 సీట్లు

**ఢిల్లీ, ఏప్రిల్ 16:** మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి గానీ, పురుషులకు గానీ ఎలాంటి నష్టం జరగదని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లుపై చర్చలో భాగంగా ప్రసంగించిన మేఘ్వాల్ ఈ బిల్లుతో లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని అన్నారు.

'పార్లమెంట్ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలను తీసుకునేందుకే ఈ మూడు కీలక బిల్లులను సభలో ప్రవేశపెట్టాం. లోక్ సభ స్థానాలను 50శాతానికి పెంచేందుకు వీటిని తీసుకొచ్చాం. ఈ బిల్లులతో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. లోక్సభ స్థానాలు 815కు పెరగడంతో మహిళలకు 272 సీట్లు లభిస్తాయి. దీనివల్ల ఎవరికీ నష్టం ఉండదు. ఈ మహిళల కోటాలో ఎస్సీ, ఎస్టీలకు ఉపకోటా కూడా లభిస్తుంది'' అని కేంద్ర మంత్రి వివరించారు.

# గాల్లో మేడలు...గల్లాలోకి నగదు

- రూ.200 కోట్ల మైక్రో ఫైనాన్స్ స్కాం
- కీలక నిందితుడు రమావత్ మధు అరెస్ట్
- మంగ్లీ పాత్రపై రహస్య విచారణ

**హైదరాబాద్,ఏప్రిల్ 16(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** గాల్లో మేడలు కట్టి మైక్రో ఫైనాన్స్ పేరిట గల్లా నింపిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈక్రమంలో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన రూ. 200 కోట్ల మైక్రో ఫైనాన్స్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రమావత్ మధును సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా పరారీలో ఉన్న మధును సాంకేతిక ఆధారాలతో పట్టుకున్న పోలీసులు, అతనిపై ఇప్పటికే నమోదైన పలు కేసుల ఆధారంగా విచారణను వేగవంతం చేశారు. అరెస్టుకు ముందు మధు ఒక వీడియోను విడుదల చేసి, ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు రహస్యాలను బయటపెట్టడం గమనార్హం. ఈ కేసులో తాను అప్రూవర్‌గా మారుతున్నట్లు ప్రకటించిన మధు, పలువురు ప్రముఖుల పేర్లను ప్రస్తావించారు. ఈ కేసులో ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ గాయని మంగ్లీకి (సత్యవతి రాథోడ్) మధు క్లీన్ చిట్ ఇచ్చారు. 'ఈ మైక్రో ఫైనాన్స్ వ్యవహారంతో సింగర్ మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదు. ఆమెను అనవసరంగా ఈ వివాదంలోకి లాగారని మధు ఆ వీడియోలో స్పష్టం చేశారు. ఆమె పేరు వాడుకుని కొందరు లబ్ధి పొందే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. కుంభకోణం వెనుక అసలు వ్యక్తులు హిమాకాంత్ రెడ్డి అని కుండబద్దలు కొట్టారు. హిమాకాంత్ రెడ్డి ఏకంగా రూ. 20 కోట్లు తీసుకున్నాడని మధు వెల్లడించారు. అడ్వకేట్ సుబ్బారావు, హిమాకాంత్ రెడ్డి మంచి స్నేహితులని.. హిమాకాంత్ నుంచి డబ్బులు ఇప్పిస్తానని సుబ్బారావు తనకు భరోసా ఇచ్చారని మధు ఆ వీడియోలో



పేర్కొన్నారు.కాగా ఈ కేసులో సింగర్ మంగ్లీ పాత్రపై రహస్యంగా విచారణ చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

**60 కేసులు :**

మైక్రో ఫైనాన్స్ కేసులో నిందితులపై తెలంగాణలోని పలు జిల్లాల్లో వీరిపై 60 పైగా కేసులు నమోదయ్యాయి. సీఐడీ విచారణ సాగుతున్న సమయంలో ఈడీ సైతం మధుపై కేసు నమోదు చేసింది. మైక్రో ఫైనాన్స్ కేసులో ప్రముఖ సింగర్ మంగ్లీ పేరు తెరపైకి వచ్చిన విషయం విదితమే. మంగ్లీ పై లాయర్ సుబ్బారావు తీవ్ర ఆరోపణలు చేశారు. డబ్బు వసూళ్ల వ్యవహారంలో మంగ్లీ ప్రమేయం ఉందనడంతో ఆయన ఆరోపణలను మంగ్లీ కొట్టిపడేశారు. మైక్రో ఫైనాన్స్ కేసుకు, తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తనను బద్నాం చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఈ కేసుతో తనకు సంబంధం ఉందని నిరూపిస్తే తాను ఏ శిక్షకైనా సిద్ధమే అని మంగ్లీ తేల్చి చెప్పారు. లాయర్ సుబ్బారావుపై మంగ్లీ, మంగ్లీపై సుబ్బారావు ఇరువురు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

**మంగ్లీకి మొత్తం తెలుసు :**

మైక్రో ఫైనాన్స్ కేసులో కీలక నిందితుడు రమావత్ మధు తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని హిమాకాంత్ రెడ్డి అన్నారు. ఈ కేసులో నిందితుడు రమావత్ మధు తాజాగా ఓ వీడియో రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ వీడియోపై హిమాకాంత్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'గోకులనంద ఇన్ఫ్రా పేరుతో అనేక మందికి ఆశ చూపించి మధు డబ్బులు వసూలు చేశాడని, తాను రూ. 10 కోట్ల రూపాయలు ఇవ్వాలని ఆరోపణలు చేస్తున్నాడన్నారు. రమావత్ మధు చేసిన ఈ స్కామ్ గురించి మంగ్లీకి మొత్తం తెలుసు. మంగ్లీ సొంత తమ్ముడు శివ చౌహాన్ స్వయంగా చెప్పడంతో చాలా మంది పెట్టుబడులు పెట్టారన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీలో పెట్టుబడి పెట్టండని శివ చౌహాన్ చెప్పాడని,ఈ స్కాంపై ఈడీకి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. మంగ్లీ చెల్లిని పెళ్లి చేసుకోబోతున్నానని.. స్వయంగా మంగ్లీ చెల్లి ముందే మధు చెప్పాడని హిమాకాంత్ రెడ్డి తెలిపారు. మైక్రో ఫైనాన్స్ వసూళ్ల గురించి మంగ్లీకి సమాచారం ఉందని, సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తున్నామని మంగ్లీ తమ్ముడు శివ స్వయంగా తమతో చెప్పాడని బాధితులు చెబుతున్నారన్నారు. మధు అండ్ గ్యాంగ్ సిమెంట్ కంపెనీలో పెట్టుబడులు, పబ్ పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు.




# అంతర్జాతీయ స్థాయిలో రాణించండి

## సహకారం అందిస్తామని తెలంగాణ క్రీడాకారులకు కేటీఆర్ హామీ

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడి క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని విభాగాల క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల విజేతలకు చెక్లు, ట్రోఫీలను హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో సమగ్ర క్రీడా పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ కప్ స్ఫూర్తితో వచ్చే ఏడాది కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ గులాబీ శ్రేణులను, కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులను అభినందించారు.

**ఓరుగల్లు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి : దాస్యం వినయ్ భాస్కర్**

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 8 ఏండ్లుగా కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పేద క్రీడాకారులకు చేయూతనందిస్తున్నామని పేర్కొన్నారు.

**విజేతలకు చెక్కులు, ట్రోఫీల అందజేత...**

కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల్లో టోర్నీ విన్నర్‌గా నిలిచిన 51వ డివిజన్ జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన 49వ డివిజన్ జట్టుకు కేటీఆర్ చేతుల మీదుగా నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఇక, డిపార్ట్‌మెంట్ క్రికెట్ విభాగంలో విన్నర్‌గా నిలిచిన జట్టుకు సైతం ట్రోఫీలను అందజేశారు.

# కూలిపోయేందుకు సిద్ధంగా రేవంత్ సర్కార్

## అవినీతి మంత్రిపై చర్యలేవి?
## '10 పర్సెంట్ మంత్రుల' సంగతేంటి?
## ఎస్సీ, బీసీ, ఓసీ ఎవరైనా సరే అవినీతిపరుడిని వెంటనే బర్తరఫ్ చేయాలి?
## రేవంత్ సర్కార్‌పై మోత్కుపల్లి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు, ఆయన మంత్రివర్గంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవస్థలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని, అవమానాన్ని చక్కదిద్దే స్థితిలో



ముఖ్యమంత్రి లేరని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఒక మంత్రికి '10 పర్సెంట్ మంత్రి' అనే పేరు ముద్ర పడిపోయిందని, ఏ మూలకెళ్లి అడిగినా జనం ఆయన పేరే చెబుతున్నారని మోత్కుపల్లి ఆరోపించారు. ఇంత బహిరంగంగా అవినీతి జరుగుతున్నా, సదరు మంత్రిపై చర్యలు తీసుకోవడానికి రేవంత్ రెడ్డి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఎస్సీ, బీసీ, ఓసీ ఎవరైనా సరే అవినీతిపరుడిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి ఒక్కడే కష్టపడితే సరిపోదని అన్నారు. సీఎం వెనుక ఉండి గోతులు తవ్వే 'నల్లికుట్లోళ్లు' ఎవరో రేవంత్‌కు తెలియదా? అని నిలదీశారు. ప్రభుత్వం కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, సొంత పార్టీలోనే కుట్రలు జరుగుతున్నా సీఎం మౌనంగా ఉండటం వెనుక అర్థమేంటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత కూడా, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు సమావేశాలు పెడుతున్నా ఏమీ చేయలేకపోతున్నారని విమర్శించారు. కేవలం ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, ప్రజలు వెంట ఉండాలంటే ముందు అవినీతికి అంతం పలకాలని హితవు పలికారు.

# స్టేట్ ఫేర్ శాఖకు ప్రశంసల పంట




- అరుదైన 'బ్రోంజ్ డిస్క్' పురస్కారం
- పురస్కార గ్రహీతలకు డీజీ అభినందనలు

**హైదరాబాద్,ఏప్రిల్ 16(మనం, ప్రత్యేక ప్రతినిధి) :** తెలంగాణ స్టేట్ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్మెంట్ సిబ్బందికి బ్రోంజ్ డిస్క్, ప్రశంసాపత్రం పురస్కారం దక్కింది. డైరెక్టరేట్ జనరల్ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ అండ్ గార్డ్స్ హోం శాఖ ఈ పురస్కారాన్ని ప్రకటించాయి.ఈ పురస్కారాన్ని దేశవ్యాప్తంగా ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్, హోం గార్డ్స్ , ఇతర భద్రతా సంస్థల సిబ్బందికి అత్యుత్తమ విధి నిర్వహణ, ధైర్యసాహసం, విశిష్ట సేవలకుగాను ప్రదానం చేశారు. దీంతో రాష్ట్ర ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ విభాగ డైరెక్టర్ జనరల్ విక్రం సింగ్ మాన్ పురస్కార గ్రహీతలను అభినందించారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ తెలంగాణ ఫైర్ సర్వీసెస్ నుంచి ఇంత పెద్ద సంఖ్యలో సిబ్బంది ఈ గౌరవాన్ని పొందడం ఇదే మొదటిసారన్నారు. విధి నిర్వహణ, ధైర్యసాహసం, విశిష్ట సేవలకుగాను ప్రదానం చేయబడే ఉన్నత స్థాయి గౌరవమని సిబ్బంది కృషిని కొనియాడారు. ఇది రాష్ట్ర ఫైర్ విభాగ చరిత్రలో ప్రతిష్టాత్మకమైన పురస్కారంగా పరిగణించబడుతుందన్నారు. ఈ గౌరవం సిబ్బందికి మరింత నిబద్ధతతో ప్రజలకు సేవ చేయడానికి, సమాజంలో అగ్ని భద్రతపై అవగాహన పెంపొందించడానికి ప్రేరణగా నిలుస్తుందని ఆయన వివరించారు. పురస్కార గ్రహీతలను వివరాలను పరిశీలిస్తే బి. సుధాకర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్, గౌలిగూడ, హైదరాబాద్, జి. యాదగిరి లీడింగ్ ఫైర్ ఫైటర్, సెక్రటేరియట్, హైదరాబాద్, ఎం.డి. ఘౌస్ పాషా లీడింగ్ ఫైర్ ఫైటర్, గద్వాల్, గడ్డే కృష్ణ ప్రసాద్ లీడింగ్ ఫైర్ ఫైటర్, వైరా, ఖమ్మం, సారా రాజేశ్వర్ ఫైర్ ఫైటర్ టెక్నికల్, హయత్నగర్, రంగారెడ్డి, వగడాని రామ్ బాబు ఫైర్ ఫైటర్ టెక్నికల్, ఖమ్మం , కె. వినోద్ కుమార్ ఫైర్ ఫైటర్ టెక్నికల్, స్పార్కెల్, ఎం. ప్రవితన్ ఫైర్ ఫైటర్ గౌలిగూడ, రాకేష్ కుమార్ ఫైర్ ఫైటర్ హైకోర్టు, వెంకటేశ్వర్లు, ఫైర్ ఫైటర్, హుజూర్ నగర్‌కు చెందిన వారున్నారు.




# సింగర్ అశ్విని రాథోడ్ టీంను అభినందించిన ఎమ్మెల్యే పల్లా

**హైదరాబాద్, ఏప్రిల్ 16(మనంన్యూస్) :** తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ గురించి ప్రజలకు అందించిన సేవలు విజయాన్ని ప్రతి భీంబించేలా సింగర్ అశ్విని రాథోడ్ టీం అద్భుతమైన సాంగ్ను అందిస్తానని ఈ పాట విన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర రెడ్డి మరియు జీవన్ రెడ్డి ఎంతో మెచ్చుకొని అభినందించారు. త్వరలోనే ఈ సాంగ్ను కె సి ఆర్ మరియు కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి అశ్విని రాథోడ్ ను మాజీ మంత్రి కేటీఆర్ మరియు మాజీ సీఎం కెసిఆర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20న జగిత్యాల సభలో ఈ పాట ప్రారంభోత్సవం చూపిస్తామని ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి మరియు జీవన్ రెడ్డి అశ్విని రాథోడ్ టీంకు హామీ ఇవ్వడం జరిగింది కావున రాజేశ్వర్ రెడ్డి జీవన్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్న అశ్విని రాథోడ్ ప్రజలందరూ ఏప్రిల్ 20వ తారీకు ఈ పాట తెలంగాణ సభలో మారుమోగిపోబోతోంది సిద్ధంగా ఉండండి అని సింగర్ అశ్విని రాథోడ్ పిలుపునిచ్చారు.


# తెలంగాణను దేశ విభజనతో పోల్చడం దుర్మార్గం

- ఆ వ్యాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన బీజేపీ,కాంగ్రెస్ ఎంపీలు ఖండించరా?
- బీజేపీ ఎంపీపై బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజనతో పోల్చడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉద్యమనేత, కేసీఆర్ నాయకత్వాన ప్రజలు అహింసా మార్గంలో ఉద్యమించి



తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం యావత్ ప్రపంచానికి తెలిసిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని మర్చిపోయి బీజేపీ ఎంపీ దేశ విభజనతో పోల్చడం దుర్మార్గమన్నారు. దేశ అత్యున్నత చట్టసభలో కనీస అవగాహన లేకుండా మాట్లాడిన ఆయన తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఈ వ్యాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన తెలంగాణకు చెందిన బీజేపీ,కాంగ్రెస్ ఎంపీలు తీవ్రంగా ఖండించాలని కోరారు.



# శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల, ఏప్రిల్ 16,మనం న్యూస్ :** తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.గురువారం ఉదయం వీఐపీ విరామ సమయంలో చాగంటి కోటేశ్వరరావు,ఎల్.వి. సుబ్రహ్మణ్యం,బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా పి.వి. సింధు మాట్లాడుతూ.. రాబోయే అంతర్జాతీయ టోర్నమెంట్లలో తాను విజయం సాధించాలని శ్రీవారిని మొక్కుకున్నట్లు తెలిపారు.

# 'శంషాబాద్'లో విదేశీ కరెన్సీ స్వాధీనం

**హైదరాబాద్,ఏప్రిల్ 16(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీ ఎత్తున విదేశీ కరెన్సీని పట్టుకున్నారు. ఈక్రమంలో గురువారం హాంకాంగ్‌ను నుంచి అక్రమంగా విదేశీ కరెన్సీని తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని రూ. 45 లక్షల విదేశీ కరెన్సీని సీజ్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి హాంకాంగ్ వెళుతున్న ఓ ప్రయాణికుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు అతని లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో అతని వద్ద ఎటువంటి అనుమతులు లేని రూ.45 లక్షల విలువైన విదేశీ కరెన్సీని అధికారులు గుర్తించారు. దీంతో నిందితునిపై విదేశీ కరెన్సీ నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేశారు. దాదాపు రూ. 45 లక్షల విదేశీ కరెన్సీని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు..? దీని వెనుక ఏదైనా హవాలా ముఠా ఉందా? అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు

# మొదటిసారిగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ (ఏప్రిల్ 16-30) అమలు

- మొదటిసారిగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ (ఏప్రిల్ 16-30) అమలు
- ప్రజలకు సులభమైన విధానం ద్వారా నమోదు అవకాశం
- జిల్లా మొత్తం 42 చార్జ్‌లుగా విభజించి సమగ్ర వ్యవస్థ ఏర్పాటు
- 100% ఆన్లైన్ సెన్సస్ విధానం, మొబైల్ యాప్ ద్వారా డేటా సేకరణ
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, ఏప్రిల్ 16, మనం న్యూస్ :** జిల్లాలో జరగబోయే 2026 -2027 సెన్సస్ ఆపరేషన్ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక జిలా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు 2026 -2027 సెన్సస్ కార్యక్రమంపై డీ ఆర్ ఓ నరసింహులు, మీడియా ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 2026-27 సెన్సస్ కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర స్థాయిలో సెన్సస్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహత్తర కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు చార్జ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారన్నారు.



జిల్లాను మొత్తం 42 చార్జ్లుగా విభజించినట్లు, ఇందులో 36 మండలాలు, 5 మున్సిపాలిటీలు మరియు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఒక ప్రత్యేక చార్జ్గా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి చార్జ్ను హౌస్ లిస్టింగ్ బ్లాక్స్గా విభజించి, ప్రతి బ్లాక్కు ఎన్యూమరేటర్లు, వారి పర్యవేక్షణకు సూపర్వైజర్లు నియమించబడినట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుండి ఎన్యూమరేటర్లకు తుది దశ శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈసారి సెన్సస్ ప్రత్యేకతగా 100% ఆన్లైన్ విధానంలో నిర్వహించడం ముఖ్యాంశమని తెలిపారు. ఎన్యూమరేటర్లకు ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా డేటా సేకరణ జరుగుతుందని, దీని వలన సమయం ఆదా కావడంతో పాటు డేటా సేకరణ ఖచ్చితత్వం పెరుగుతుందని చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' విధానాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ విధానం ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ముందుగానే తమ వివరాలను నమోదు చేయాలని కోరారు. మే 1 నుండి హౌస్ లిస్టింగ్ దశ ప్రారంభమవుతుందని, ఈ దశలో ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి గృహాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 2027లో జనాభా లెక్కింపు రెండో దశగా నిర్వహించబడుతుందని చెప్పారు. సెన్సస్ ద్వారా సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని, ఈ డేటాను ఎటువంటి సంక్షేమ పథకాలతో అనుసంధానం చేయరని స్పష్టం చేశారు. సెన్సస్ డేటా ప్రభుత్వానికి విధానాల రూపకల్పనలో మాత్రమే ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా నిజమైన వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని ప్రజలకు సెన్సస్ పై అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, మీడియా సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు.సుమారు 15 సంవత్సరాల తరువాత నిర్వహిస్తున్న ఈ సెన్సస్ను విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అందరి సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

మనం Manam





## చీమలకాలం

ఇంధన రణం.. విశ్వం హాహాకారాలు
ప్రగతి శూన్యం

పెద్దన్న రణం.. చిన్నన్న పద్మవ్యూహం
ఓటమి ఖాయం

పన్నుల మోత.. కలసిరాని నేస్తాలు
ఒంటరి ట్రంపు

ఇరాన్‌కు బలి.. మేకలుతిన్నపులి
చీమలకాలం

పెద్దన్న పేను.. విశ్వం నెత్తిన పుండు
చావు తప్పదు

పెద్దల మాట.. నీల్గుట ఈల్గుటకే
నిత్యసత్యాలు

**- రేడియమ్**
9291527757

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు **manamlekhalu@gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి

- ఎడిటర్

# దక్షిణాదికి రాజకీయ ముప్పు



ఒక దేశం లేదా రాష్ట్రంలో జనాభా మార్పులకు అనుగుణంగా ప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించే ప్రక్రియను 'డీలిమిటేషన్' అంటారు.


రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం, ప్రతి పది ఏళ్లకోసారి జరిగే జనగణన తర్వాత కేంద్ర ప్రభుత్వం 'డీలిమిటేషన్ కమిషన్'ను ఏర్పాటు చేస్తుంది. భారతదేశంలో ఇప్పటివరకు 1952లో, 1963లో, 1973లో, 2002లో మొత్తం 4 సార్లు డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాటయ్యాయి. 1976 నుండి జనాభా నియంత్రణ చర్యల కార ణంగా నియోజకవర్గాల సంఖ్యపై పరిమితి విధించారు. తదుపరి పునర్విభజన 2026 తర్వాత జరిగే అవకాశం ఉంది.

దక్షిణాది రాష్ట్రాలు గత ఐదు దశాబ్దాలుగా జనాభా నియంత్రణలో అద్భుతమైన పురోగతిని సాధించాయి. 1971లో దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24.7% ఉండగా, 2011 నాటికి అది 21% కు తగ్గింది. దీనికి విరుద్ధంగా, ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ మరియు మధ్యప్రదేశ్ జనాభా వాటా 39.4% నుండి 42.4% కి పెరిగింది.

ఈ వ్యత్యాసం కారణంగానే, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా నియంత్రించిన తమకు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే ఆందోళన ఈ రాష్ట్రాల్లో వ్యక్తమవుతోంది. 2011/2027 జనాభా అంచనాల ప్రకారం సీట్ల సంఖ్యను పెంచితే ఉత్తరాది రాష్ట్రాల వాటా పెరిగి దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్ లో 80 నుండి 143 సీట్లకు, బీహార్ లో 40 నుండి 79 సీట్లకు, తమిళనాడులో 39 నుండి 49 సీట్లకు, తెలంగాణలో 17 నుండి 26 సీట్లకు. ఆంధ్రప్రదేశ్‌లో 25 నుండి 38 సీట్లకు పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ దక్షిణాది రాష్ట్రాలలో కూడా సీట్లు పెరిగినట్లు కనిపించిన పెరుగుదల రేటు మాత్రం తక్కువగా ఉంటుంది.

దక్షిణాది వాటా ప్రస్తుతం పార్లమెంటులో సుమారు 24% ఉండగా, పునర్విభజన తర్వాత అది 18-20% కి తగ్గిపోవచ్చు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల నిర్ణయాత్మక శక్తి తగ్గిపోతుంది. ఉత్తరాదిలోని కేవలం రెండు, మూడు పెద్ద రాష్ట్రాలు కలిస్తేనే కేంద్రంలో అధికారాన్ని నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని దక్షిణాది రాష్ట్రాలు వాదిస్తున్నాయి.

డీలిమిటేషన్ ప్రక్రియ రాజకీయ ప్రాతినిధ్యాన్ని మాత్రమే




కాకుండా, నిధుల కేటాయింపును కూడా ప్రభావితం చేస్తుంది. భారత ఆర్థిక సంఘం నిధులను పంచేటప్పుడు జనాభాను ప్రధాన ప్రాతిపదికగా తీసుకుంటుంది. దీనివల్ల జనాభా తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు వచ్చే కేంద్ర వాటా తగ్గుతుంది.

గణాంకాల ప్రకారం, దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి చెల్లిస్తున్న ప్రతి రూపాయి పన్నులో తిరిగి పొందుతున్నది చాలా తక్కువ. కర్ణాటక చెల్లించిన ప్రతి 100 కి తిరిగి వచ్చేది సుమారు15 మాత్రమే.తమిళనాడు కు తిరిగి వచ్చేది సుమారు 29. తెలంగాణ కు43,ఆంధ్ర ప్రదేశ్ కు 47,కేరళ కు 63 మాత్రమే. ఉత్తరప్రదేశ్ చెల్లించిన ప్రతి 100 కి సుమారు273 తిరిగి పొందుతోంది. బీహార్ సుమారు706 తిరిగి పొందుతోంది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెరిగితే, ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయ బలం పెరిగి, భవిష్యత్తులో ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు కూడా వారి వైపునకే ఉంటుందని దక్షిణాది రాష్ట్రాల భయం. అభివృద్ధి చెందిన రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, జనాభా పెంచిన రాష్ట్రాలకు ఎక్కువ నిధులు ఇవ్వడం సమర్థతను సాధించిన రాష్ట్రాలను శిక్షించడమే అని దక్షిణాది రాష్ట్రాలు వాదిస్తున్నాయి.

భారత దేశం విభిన్న భాషలు, సంస్కృతులు కలిగిన రాష్ట్రాల సమాఖ్య. కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజిస్తే, జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకే పార్లమెంటులో మెజారిటీ లభిస్తుంది. దీనివల్ల 'బహుళత్వ ప్రజాస్వామ్యం' కాస్తా 'సంఖ్యాబల ప్రజాస్వామ్యం'గా మారిపోయే ప్రమాదం ఉంది.

దక్షిణాదిరాష్ట్రాలు జాతీయ లక్ష్యాలను (జనాభా నియంత్రణ, విద్య, ఆరోగ్యం) సమర్థవంతంగా అమలు చేసినప్పటికీ, రాజకీయంగా వాటి ప్రాధాన్యత తగ్గడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఒకే ప్రాంతం లేదా కొన్ని రాష్ట్రాలే కేంద్ర నిర్ణయాలను శాసించే పరిస్థితి ఏర్పడితే, తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాల గొంతు పార్లమెంటులో వినిపించదు. ఇది రాష్ట్రాల మధ్య అసమానతలను పెంచి, దేశ సమగ్రతకు సవాలుగా మారుతుంది. అందుకే జనాభాతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలని దక్షిణాది రాష్ట్రాలు కోరుతున్నాయి. డీలిమిటేషన్ వల్ల ఏర్పడే రాజకీయ అసమతుల్యతను నివారించడానికి మూడు రకాల పరిష్కారాలను పరిశీలించవచ్చు :

1. సీట్ల సంఖ్యను పెంచడం (సమాన నిష్పత్తిలో): కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా, అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్లను ఒకే శాతంలో (ఉదాహరణకు 50% లేదా 100%) పెంచడం. దీనివల్ల లోక్‌సభలో సభ్యుల సంఖ్య పెరుగుతుంది, కానీ రాష్ట్రాల మధ్య ఉన్న ప్రస్తుత రాజకీయ బలాబలాలు మారవు.

2. రాజ్యసభ అధికారాల పెంపు: అమెరికాలోని 'సెనెట్' మాదిరిగా, జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికి సమాన సంఖ్యలో రాజ్యసభ సీట్లు కేటాయించడం .చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటానికి రాజ్యసభకు మరిన్ని చట్టపరమైన అధికారాలు ఇవ్వడం ద్వారా సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయవచ్చు.

3. జనాభేతర అంశాలకు ప్రాధాన్యత: నియోజకవర్గాల కేటాయింపులో కేవలం 2011/2027 జనాభాను మాత్రమే కాకుండా, రాష్ట్రాలు సాధించిన సామాజిక అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని దక్షిణాది రాష్ట్రాలు కోరుతున్నాయి. జనాభాను తగ్గించిన రాష్ట్రాలకు బోనస్ సీట్లు ఇవ్వడం,దేశ జీడీపీలో వాటా మరియు పన్నుల చెల్లింపును ప్రాతిపదికగా తీసుకోవడం, అక్షరాస్యత మరియు ఆరోగ్యం లాంటి మానవాభివృద్ధి సూచీలో మెరుగ్గా ఉన్న రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వడం. డీలిమిటేషన్ ప్రక్రియ కేవలం గణాంకాల మార్పు మాత్రమే కాదు, అది భారత సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాల మధ్య ఉన్న సమతుల్యతకు సంబంధించిన అంశం.

జాతీయ లక్ష్యాలైన జనాభా నియంత్రణ, విద్య, ఆరోగ్యంతో పాటు సామాజికాభివృద్ధిలో అద్భుతమైన ప్రతిభ కనబరిచినందుకు దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయ ప్రాముఖ్యత తగ్గడం ఖచ్చితంగా సమర్థవంతంగా పనిచేసిన రాష్ట్రాలను శిక్షించినట్లుగానే భావించాలి. అభివృద్ధి చెందిన రాష్ట్రాల గొంతు పార్లమెంటులో బలహీనపడితే,అది భవిష్యత్తులో ప్రాంతీయ అసమానతలకు,అసంతృప్తికి దారితీస్తుంది. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా, అన్ని రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా ఒక నూతన శాస్త్రీయ ఫార్ములాను రూపొందించాలి. అప్పుడే 'సబ్ కా సాత్ - సబ్ కా వికాస్' అనే నినాదం నిజమైన సమాఖ్య స్ఫూర్తితో సాకారం అవుతుంది. కాగా డీలిమిటేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణను తమిళనాడు ముఖ్యమంత్రి డీఎంకే అధినేత స్టాలిన్ వ్యతిరేకిస్తున్నారు. 1960ల్లో తమిళనాడులో జరిగిన ఉద్యమాన్ని మళ్లీ చూడబోతున్నారంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నేతలు కూడా డీలిమిటేషన్‌లో ఏదో కుట్ర దాగి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**- జుర్రు నారాయణ యాదవ్**
9494019270

# మహిళా బిల్లుపై ఇండియా కూటమి ఎటు?




రాజకీయ పార్టీలన్నీ 106వ రాజ్యాంగ సవరణ బిల్లుకు, ముఖ్యంగా ఆర్టికల్ 334లో మార్పులు చేసి మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మూడొంతుల (33%) రిజర్వేషన్ కల్పించడాన్ని సూత్రప్రాయంగా సమర్థిస్తున్నాయి. మహిళా సాధికారత దిశగా ఇది సరైన అడుగేనని ఏకగ్రీవ అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం 2029 నాటికి మహిళలకు పూర్తి స్థాయి 33% రిజర్వేషన్ అమలు చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది.

ఇదిలా ఉండగా, ఏప్రిల్ 16 నుంచి 18 తేదీల మధ్య జరిగే పార్లమెంట్ సమావేశాల్లో నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ బిల్లు)ను ప్రవేశపెట్టి దానిపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ అంశంపై చర్చ జరగాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలుస్తోంది. అయితే ఈ బిల్లు అమలు ఎంతవరకు మహిళలకు వాస్తవ ప్రయోజనం కలిగిస్తుందనే దానిపై కూడా విస్తృత స్థాయిలో చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దేశం ఎన్నికల వాతావరణంలో ఉంది. ముఖ్యంగా నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికలు జరుగుతున్న ఈ సమయంలో ఈ బిల్లును ప్రవేశపెట్టడం వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో అధికార పార్టీకి అనుకూల పరిస్థితులు లేవన్న అంచనాల మధ్య, మహిళా ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు ఈ బిల్లును ఉపయోగించుకునే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లోక్‌సభ సీట్ల పునర్విభజన (డెలిమిటేషన్) ప్రక్రియ పూర్తికాకముందే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనే తొందరపాటు కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం 2011 జనగణన ఆధారంగా సీట్ల సంఖ్య నిర్ణయించడం జరుగుతుండగా, 2026 జనగణన ఫలితాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. తాజా డేటా ఉండగా పాత గణాంకాలపై ఆధారపడటం సముచితమా అన్న సందేహం వ్యక్తమవుతోంది.

డెలిమిటేషన్ అనేది సాధారణ ప్రక్రియ కాదు.



ఇది రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్యం, సమతుల్యం చేసే కీలక అంశం. సీట్ల పెంపు, రిజర్వేషన్లు కలిపి ఒక సమగ్ర నిర్మాణాత్మక మార్పు అవుతుంది. ఇలాంటి కీలక నిర్ణయాన్ని త్వరితగతిన తీసుకోవడం కంటే విస్తృత చర్చలు, అన్ని వర్గాల అభిప్రాయాలు అవసరం.

ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి. ఇవి 850కి పెంచే ప్రతిపాదన కూడా చర్చలో ఉంది. అయితే దీనికి సంబంధించిన లెక్కలు, విధానాలు స్పష్టంగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జనాభా ప్రాతిపదికన ప్రతినిధిత్వం పెంచాలంటే శాస్త్రీయ విధానం అనుసరించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దిశగా కనిపించడం లేదని నిపుణులు సూచిస్తున్నారు.

ఇంకా, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు ఇప్పటికే ఉన్న రిజర్వేషన్లలో మహిళల ప్రాతినిధ్యం ఎలా అమలు చేస్తారనే అంశంపై కూడా స్పష్టత లేదు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల వల్ల ఆ వర్గాల మహిళలకు కొంతవరకు రాజకీయ అవకాశాలు లభిస్తున్నప్పటికీ, మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి వస్తే ఎస్సీ, ఎస్టీ మహిళల్లో కొంత గుబులు ఏర్పడే అవకాశం ఉందనే చర్చ కూడా ముందుకు వస్తోంది. కారణం ఏమిటంటే-సాధారణ (ఓసీ) వర్గానికి చెందిన మహిళలు ఎక్కువ సంఖ్యలో ప్రాతినిధ్యం పొందే అవకాశముంటే, ఎస్సీ, ఎస్టీ మహిళలకు కుల పరంగా వారికి వర్తించే రిజర్వేషన్లతో పాటు మహిళలకు ఇచ్చే ప్రత్యేక రిజర్వేషన్లలో కూడా వాటా వస్తుందా లేదా అన్న సందేహం వ్యక్తమవుతోంది.

ఇక మహిళా రిజర్వేషన్‌ను దామాషా పద్ధతిలోనే ఎస్సీ, ఎస్టీ, వర్గాల మహిళలకు ఎలా వర్తింపజేస్తారు? ప్రస్తుత రిజర్వేషన్లలోనే మహిళలకు ఉపవిభజన చేస్తారా? లేక వేరుగా వాటాను పెంచే అవకాశముందా? అనే అంశాలు కూడా చర్చకు రావాల్సి ఉంది. కానీ ఈ కీలక విషయాలపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు.

మొత్తంగా చూస్తే, మహిళా రిజర్వేషన్ బిల్లు సూత్రప్రాయంగా స్వాగతించదగినదే అయినప్పటికీ, దాన్ని అమలు చేసే విధానం, సమయం, రాజకీయ నేపథ్యం-అన్నీ కలిపి అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. పూర్తి స్థాయి చర్చలు లేకుండా, వివిధ సామాజిక వర్గాల ఆందోళనలను పరిష్కరించకుండా బిల్లును ముందుకు తీసుకురావడం సరైన విధానం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ ఈ బిల్లును తీసుకురావడం రాజకీయ ప్రయోజనాల కోసమేనన్న విమర్శలు ప్రతిపక్షాలు, మేధావుల నుంచి తీవ్రంగా వినిపిస్తున్నాయి. మహిళల సాధికారత అనే ముఖ్యమైన అంశాన్ని రాజకీయ లాభ నష్టాల కోణంలో చూడటం సరైన పద్ధతి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


**- బి. రామారావు**
9030715343

# ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి

భారతదేశ ఆర్థిక వ్యవస్థను నిర్మించిన పబ్లిక్ సెక్టార్ సంస్థలు (ప్రభుత్వ రంగ సంస్థలు) కేవలం పరిశ్రమలే కాదు-ఇవి కోట్లాది ఉద్యోగుల జీవనాధారం, సామాజిక న్యాయం సాధనకు బలమైన వేదిక అనే విషయాన్ని మనం మరిచిపోవద్దు. స్వాతంత్ర్యం అనంతరం దేశం పేదరికం, నిరుద్యోగం వంటి తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో, 1948 మరియు 1956 పరిశ్రమల విధానాల ద్వారా ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసి, లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది. ఒక దశలో దేశస్థూల దేశీయోత్పత్తిలో 25-30 శాతం వరకు వాటా కలిగిన ఈ సంస్థలు, ప్రస్తుతం 13-14 శాతం వరకు ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇస్తూ, ముఖ్యంగా సుమారు కోట్లాది కుటుంబాలకు స్థిర జీవనాన్నందించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగం బలహీన పడితే, అది కేవలం సంస్థల సమస్య కాదు- సామాజిక సమతుల్యతకు, కార్మిక వర్గ భద్రతకు పెద్ద ముప్పు.

తెలంగాణ రాష్ట్రంలో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, సింగరేణి వంటి సంస్థలు వేలాది ఉద్యోగుల జీవనాధారంగా నిలిచాయి. ముఖ్యంగా సింగరేణి సంస్థ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వేల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తోంది. అదేవిధంగా విద్యుత్ రంగంలోని టీజీ జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లు వంటి ప్రభుత్వ సంస్థలు హక్కులు క్షీణించడం వంటి పరిణామాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. లాభదాయక సంస్థలను కూడా విక్రయించడం వల్ల ప్రభుత్వానికి వచ్చే డివిడెండ్ ఆదాయం తగ్గిపోవడం మాత్రమే కాదు, ఆ సంస్థలపై ప్రజల నియంత్రణ కూడా తగ్గిపోతుంది. ముఖ్యంగా విద్యుత్ వంటి కీలక రంగాల్లో ప్రైవేటీకరణ పెరిగితే, సేవలు లాభాధారంగా మారి సామాన్య ప్రజలపై భారంగా మారే ప్రమాదం ఉంది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించడం ఉద్యోగుల సంక్షేమం కోసమే కాకుండా, సామాజిక న్యాయం కోసం కూడా అత్యవసరం. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం అంటే ఉద్యోగ భద్రతను కాపాడడం, రిజర్వేషన్ విధానాన్ని కొనసాగించడం, ప్రాంతీయ సమతుల




9-10 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి, 50 లక్షలకు పైగా పరోక్ష ఉపాధి కల్పిస్తూ మధ్య తరగతి, కార్మిక వర్గాల స్థిరత్వానికి ఆధారం గా నిలుస్తున్నాయి.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రత్యేకత ఏమిటంటే, ఇవి లాభాలకే పరిమితం కాకుండా సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకువచ్చాయి. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ప్రాంతీయ అసమానతలను తగ్గించడం వంటి కీలక బాధ్యతలను నిర్వహించాయి. ఉద్యోగ భద్రత, పెన్షన్, ఆరోగ్య సదుపాయాలు, నివాస వసతులు వంటి అంశాలు కేవలం సేవలందించే సంస్థలు మాత్రమే కాకుండా, వేలాది ఉద్యోగుల జీవన భద్రతకు ఆధారాలు. ఈ సంస్థల ద్వారా రైతులకు, చిన్న పరిశ్రమలకు అందుతున్న సబ్సిడీ విద్యుత్ సేవలు సామాజిక న్యాయాన్ని ప్రతిబింబిస్తున్నాయి. 1991 తర్వాత డిస్ఇన్వెస్ట్‌మెంట్ విధానం సమతుల్యతను దెబ్బతీస్తోంది. 1991 నుండి 2024 వరకు సుమారు 6.8 లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ వాటాలు విక్రయించబడగా, సుమారు 5 లక్షల ఉద్యోగాలు తగ్గినట్లు అంచనాలు చెబుతున్నాయి. ప్రైవేటీకరణ కారణంగా ఉద్యోగ భద్రత తగ్గడం, కాంట్రాక్టు విధానం పెరగడం, సామాజిక భద్రతా అభివృద్ధిని నిలబెట్టడం. సమర్థవంతమైన నిర్వహణ, పారదర్శకత, సాంకేతిక ఆధునీకరణ ద్వారా ఈ సంస్థలను మరింత బలపరచడం సాధ్యమే కాని, వాటిని విక్రయించడం సమస్యలకు పరిష్కారం కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడటం కేవలం ఆర్థిక నిర్ణయం కాదు- ఇది కార్మికుల హక్కులను, సామాజిక న్యాయాన్ని, దేశ భవిష్యత్తును రక్షించే అత్యవసర బాధ్యతగా భావించాలి. ప్రజల ఆస్తి ప్రజలకే ఉండాలి. ప్రభుత్వ రంగం బలంగా ఉంటే నే సమాజం సమానత్వ దిశగా ముందుకు సాగుతుంది.

**- గువ్వల పవన్ కుమార్**


# నిరంతర పోరాటాల బెంగాల్

భారత రాజకీయ పటంలో పశ్చిమ బెంగాల్ ఒక విలక్షణమైన రాష్ట్రం. ఇక్కడి రాజకీయం కేవలం అధికార మార్పిడికి సంబంధించింది కాదు. అది సంస్కృతి, సిద్ధాంతం మరియు పోరాట పటిమల కలయిక. దేశంలోని ఇతర రాష్ట్రాలలో కుల రాజకీయాలు రాజ్యమేలుతుంటే, బెంగాల్లో మాత్రం దశాబ్దాల పాటు భావజాల ఆధారిత ఓటింగ్ ధోరణి కొనసాగడం విశేషం. 1977 నుండి 2011 వరకు దాదాపు 34 ఏళ్ల పాటు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) నేతృత్వంలోని వామపక్ష ఫ్రంట్ నిరంతరాయంగా పాలన సాగించడం ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టం. జ్యోతిబసు, బుద్ధదేవ్ భట్టాచార్య వంటి ఉద్ధండుల నేతృత్వంలో సాగిన ఈ సుదీర్ఘ పాలనలో భూసంస్కరణలు, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం వంటి విప్లవాత్మక మార్పులు సంభవించినప్పటికీ, అదే పాలన కాలక్రమేణా పారిశ్రామిక స్తబ్దతకు, యువతలో నిరుద్యోగానికి దారితీసింది. ఈ నేపథ్యంలోనే మమతా బెనర్జీ నాయకత్వంలో తృణమూల్ కాంగ్రెస్ ఆవిర్భవించి, బెంగాల్ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసింది.

బెంగాల్ రాజకీయాల్లో 2011 ఒక చారిత్రాత్మక సంవత్సరం. సింగూర్‌లో టాటా మోటార్స్ నానో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరిగిన భూసేకరణ ఉద్యమం, నందిగ్రామ్‌లో పోలీసు కాల్పుల ఘటనలు వామపక్ష కోటను కూల్చివేసేందుకు పునాదులు వేశాయి. 'మా, మాటి, మనుష్' (తల్లి, భూమి, ప్రజలు) అనే భావోద్వేగ నినాదంతో మమతా బెనర్జీ ప్రజల్లోకి వెళ్లారు. సామాన్యుడి గొంతుకగా మారిన ఆమె, పారిశ్రామికీకరణ పేరుతో జరుగుతున్న బలవంతపు భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకించి రైతు పక్షపాతిగా ముద్ర వేసుకున్నారు. దీని ఫలితంగా 2011 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అనూహ్య విజయం సాధించి, మూడు దశాబ్దాల వామపక్ష పాలనకు చరమగీతం పాడింది. అప్పటి వరకు నామమాత్రంగా ఉన్న తృణమూల్, ఒక్కసారిగా ప్రధాన శక్తిగా ఎదిగింది.

అధికారంలోకి వచ్చిన తర్వాత మమతా బెనర్జీ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకునే దిశగా అడుగులు వేశారు. 2016 అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆమెపై అనేక విమర్శలు, శారదా చిట్ ఫండ్ వంటి కుంభకోణాల ఆరోపణలు వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఆమెను కాపాడాయి. ఆ ఎన్నికల్లో తృణమూల్ 294 స్థానాలకు గాను 211 స్థానాలను గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఆ సమయంలో భారతీయ జనతా పార్టీ కేవలం 3 స్థానాలకే పరిమితమైనప్పటికీ, లోలోపల హిందూ ఓట్లను సమీకరించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

2019 లోక్‌సభ ఎన్నికలు బెంగాల్ రాజకీయాల్లో మరో మలుపు. జాతీయ స్థాయిలో మోదీ హవా, బెంగాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో భాజపా పెంచుకున్న కేడర్ బలం కలిసి ఆ పార్టీని 18 లోక్‌సభ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసేలా చేశాయి. ఓటు శాతం పరంగా తృణమూల్ (43%) కు దాదాపు దరిదాపుల్లోకి భాజపా (40%) చేరుకోవడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. 2021 ఎన్నికలు కేవలం బెంగాల్ ఎన్నికలుగా కాకుండా, జాతీయ స్థాయిలో మోదీ-అమిత్ షా ద్వయానికి మరియు మమతా బెనర్జీకి మధ్య జరిగిన అస్తిత్వ పోరాటంగా మారాయి. 'ఖేలా హోబే' (ఆట మొదలైంది) అనే నినాదంతో మమత తన కేడర్‌లో ఉత్సాహం నింపగా, భాజపా తన సర్వశక్తులూ ఒడ్డి ప్రచారం చేసింది. ఫలితంగా తృణమూల్ 213 స్థానాలతో తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుంది. అయితే, భాజపా తన స్థానాలను 3 నుండి 77 కి పెంచుకుని ప్రధాన ప్రతిపక్షంగా అవతరించడం ఆ పార్టీ ఎదుగుదలకు నిదర్శనం.



ప్రస్తుత రాజకీయ స్థితిగతులను విశ్లేషిస్తే, తృణమూల్ కాంగ్రెస్ విజయావకాశాలు ప్రధానంగా మహిళా ఓటర్లపై ఆధారపడి ఉన్నాయి. 'లక్ష్మీ భండార్' (మహిళలకు ఆర్థిక సాయం), 'కన్యాశ్రీ' (బాలికల విద్య), 'సబూజ్ సాథీ' (సైకిళ్ల పంపిణీ) వంటి పథకాలు మమతకు గట్టి ఓటు బ్యాంకును నిర్మించాయి. బెంగాల్ జనాభాలో సుమారు 27 శాతం ఉన్న ముస్లిం ఓటర్లు కూడా అత్యధికంగా తృణమూల్ వైపు మొగ్గు చూపుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా తృణమూల్ తన పట్టును నిలబెట్టుకోవడం దీనికి నిదర్శనం.

భారతీయ జనతా పార్టీ విషయానికి వస్తే, ఆ పార్టీ ప్రధానంగా హిందూ ఓట్ల ఏకీకరణపై దృష్టి పెట్టింది. ఉత్తర బెంగాల్ మరియు మతువా వర్గం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో భాజపాకు బలమైన మద్దతు ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు, జాతీయవాదం మరియు తృణమూల్ సర్కారుపై ఉన్న వ్యతిరేకతను ఓట్లుగా మలుచుకోవాలని ఆ పార్టీ చూస్తోంది. అయితే, రాష్ట్ర స్థాయిలో మమతకు దీటైన నాయకత్వం లేకపోవడం మరియు స్థానిక కేడర్ మధ్య సమన్వయ లోపం ఆ పార్టీకి పెద్ద మైనస్‌గా మారాయి. బెంగాలీ అస్తిత్వం మరియు 'బయటి వ్యక్తులు' అనే భావనను తృణమూల్ బలంగా ప్రచారం చేయడంతో, భాజపా ఒక హిందీ భాషా పార్టీ అనే ముద్రను చెరిపి వేసుకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది.

ఇటీవలి కాలంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలు 'మినూ సే' (కొత్త తరం) నాయకత్వాన్ని తెరపైకి తెచ్చాయి. మహ్మద్ సలీం వంటి సీనియర్ నేతలు పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ముస్లిం ఓట్లు తృణమూల్ వైపు, హిందూ ఓట్లు భాజపా వైపు చీలిపోవడం... వీరు కనీసం 15 నుండి 20 శాతం ఓట్లు సాధించగలిగితే, అది తృణమూల్ కంటే భాజపాకే ఎక్కువ నష్టం కలిగించే అవకాశం ఉంది.

పశ్చిమ బెంగాల్ రాజకీయం ప్రస్తుతం ఒక సంక్లిష్ట దశలో ఉంది. ఇక్కడ 'బెంగాలీ అస్తిత్వం' వర్సెస్ 'జాతీయవాదం', 'సెక్యులరిజం' వర్సెస్ 'ధ్రువీకరణ' మధ్య నిరంతర యుద్ధం సాగుతోంది. ప్రజలు నాయకత్వ స్థిరత్వానికి మరియు సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో తృణమూల్ కాంగ్రెస్ తన అవినీతి మరకలను ఎలా కడుక్కుంటుందో, భాజపా తన 'బెంగాలీ ముఖ చిత్రాన్ని' ఎలా నిర్మించు కుంటుందో చూడాలి. సిద్ధాంతాల నుండి వ్యక్తిగత విమర్శల వరకు, గ్రామ సభల నుండి సుప్రీంకోర్టు వరకు బెంగాల్ రాజకీయం ఎప్పుడూ ఒక రణరంగమే. ఈ పోరులో విజేత ఎవరన్నది ప్రజల చైతన్యం మరియు మారుతున్న రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉంటుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

- డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి
- రోడ్లపై బాధ్యతగా మెలగాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



కరీంనగర్, ఏప్రిల్ 16(మనం బ్యూరో): రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కృషిచేద్దామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం అరైవ్ - అలైవ్ కింద రోడ్ సేఫ్టీ పై అవగాహన సదస్సును రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు ముఖ్య కారణమని పేర్కొన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు, శారీరక పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గడువు దాటిన వాహనాలను రోడ్లపైకి రాకుండా చూడాలని రవాణాశాఖ అధికారులకు సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ మద్యం తాగి వాహనాలు నడపకుండా చూడాలని పోలీస్ అధికారులు సూచించారు. వాహనదారులు బాధ్యతగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్ (ఆస్పత్రికి తీసుకెళ్లే) లోపు చేయాల్సిన ప్రాథమిక చికిత్స పై ప్రజలకు అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. మన పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆర్టీసీ ఆర్ఎం రాజు మాట్లాడుతూ.. మనదేశంలో ఏటా రెండు లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాలని వివరించారు.

### అతివేగం అజాగ్రత్త వలన రోడ్డు ప్రమాదాలు: రవాణా శాఖ ఉప కమిషనర్

పెద్దింటి పురుషోత్తం మాట్లాడుతూ.. అతివేగం, అజాగ్రత్త, నిద్రలేమి, మైనర్లు వాహనాలు నడపడం కారణంగానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ఎదిగిన పిల్లలు కళ్ళముందే చనిపోతే తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదరహిత తెలంగాణకు కృషి చేయాలన్నారు. డిఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీపీఆర్, ప్రథమ చికిత్స పై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

### ప్రమాద బాధితుల కోసం రహవీర్ పథకం

ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రహవీర్ పథకానికి శ్రీకారం చుట్టాయన్నారు.ఆరోగ్యశ్రీ వర్తించే అన్ని ఆసుపత్రుల్లో రహవీర్ కింద రూ. లక్షన్నర వరకు వైద్య సహాయం అందిస్తారని వివరించారు. క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్చిన వారికి రహవీర్ కింద 25 వేల బహుమతి అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులకు రోడ్డు భద్రతా నిబంధనలను విద్యార్థులు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నాటిక ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు, శాఖల అధికారులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యులు సిపిఆర్ చేసే విధానం చేసి చూపించారు.

### డ్రైవర్లకు సన్మానం

రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాలు నడిపిన జిల్లాలోని ఆర్టీసీ, లారీడ్రైవర్లతో పాటు ప్రైవేటు విద్యాసంస్థల డ్రైవర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్డీవో మహేశ్వర్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ గండ్ర శ్రీనివాస్ రెడ్డి డైరెక్టర్ వినోద్ స్థానిక సర్పంచ్ గుజ్జుల శ్వేతా రెడ్డి, రోడ్డు రవాణా శాఖ , వైద్య , ఆర్ అండ్ బి అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

# 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' పట్టణ సభ

- 99 రోజుల ప్రజా పాలన ప్రగతి: సంక్షేమ పథకాల అమలుపై అధికారుల సమీక్ష
- ప్రజా పాలన లక్ష్యం పేదల సంక్షేమమే
- పట్టణ సభలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



వేములవాడ,ఏప్రిల్ 16(మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్లో పట్టణ సభను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మరియు కమిషనర్ సమక్షంలో జరిగిన ఈ సభలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ప్రజా పాలన లక్ష్యం ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలను అందించడమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీ-ప్రైమరీ నుండి ఇంటర్ వరకు అల్పాహార పథకం, ప్రతి కుటుంబానికి ధీమానిచ్చే ఇందిర కుటుంబ జీవిత బీమా, మరియు మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు పొడిగించడం వంటి చర్యలు విద్యా, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు అందేలా ప్రజా పాలన ప్రణాళిక ద్వారా ప్రత్యేక కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో రాజన్న ఆలయ అభివృద్ధికి 150 కోట్లు, రోడ్ల విస్తరణకు 46 కోట్లు, పట్టణ మౌలిక సదుపాయాల కోసం మరో 4.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పట్టణ రూపురేఖలను మారుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ద్వారా పొన్నాల స్వామికి వీల్ చైర్, అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ ప్యూరిఫైర్లను పంపిణీ చేశారు. ఈ సభలో ఆర్డీఓ రాధా భాయ్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, సిఐ, కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిరిసిల్లలోని కలెక్టరేట్ చౌరస్తాలో
# సీట్ బెల్ట్‌పై అవగాహన



- జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 16(మనం ప్రతినిధి ): అరైవ్ అలైవ్ ప్రోగ్రాం లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని కలెక్టరేట్ చౌరస్తాలో సీట్ బెల్ట్ పై జిల్లా రవాణా శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఇట్టి కార్యక్రమం లో జిల్లా పోలీస్ ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాలుగోన్నారు. మోటారు వాహన తనిఖీ అధికారి, పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ వేసుకొని వాహనాన్ని నడపాలని, లేనిచో ప్రమాదాలు జరిగినప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వలన ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావని, తద్వారా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు అదేవిధంగా డ్రైవర్ తో పాటు ఇతర సీటులో కూర్చున్న ప్రయాణికులు కూడా తూచా తప్పకుండా సీట్ బెల్ట్ ను ధరించాలని ఎట్టి పరిస్తుతుల్లో మద్యం తాగి వాహనమ్ నడపవద్దని తెలియజేశారు. అదేవిధంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఉత్తమ పౌరులుగా ఉండాలని తెలియజేశారు. వాహనదారులు అందరితో రహదారి భద్రత ప్రతిజ్ఞను రవాణా శాఖ ఇన్స్పెక్టర్ చేయించారు. సీటు బెల్టు ధరించిన వాహనదారులకు ఔత్సాహికంగా వినూత్న పద్ధతిలో మిఠాయి లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల సహాయక మోటారు వాహనాల తనిఖీ అధికారి పృధ్వీరాజ్ వర్మా పోలీస్, ట్రాఫిక్ పోలీసు ,సిబ్బంది,వాహన దారులు సుమారు 300 మంది వాహనదారులు పాల్గొనడం జరిగింది.

# యువత ప్రాణాలు అమూల్యం

- రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి
- కరీంనగర్లో ఘనంగా 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు
- విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, సీపీఆర్ పై అవగాహన
- రాష్ట్ర అడిషనల్ డీజీపీ ( సిఐడి ఏసీబీ) చారు సిన్హా



కరీంనగర్, ఏప్రిల్ 16(మనం బ్యూరో): ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది యువత ప్రాణాలు కోల్పోవడం అత్యంత ఆందోళనకరమని, రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రాష్ట్ర అడిషనల్ డీజీపీ (సీఐడీ మరియు ఏసీబీ) చారు సిన్హా పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్త రోడ్డు భద్రతా వారోత్సవాలు (ఏప్రిల్ 13 నుండి 18 వరకు) జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పర్యవేక్షణలో స్థానిక అస్త్ర కన్వెన్షన్ హాలు నందు గురువారం 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చారు సిన్హా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు 'డిఫెన్సివ్ డ్రైవింగ్' అత్యంత కీలకమని చెప్పారు. ఒకరి నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు పాటించాల్సిన ప్రధాన అంశాలను ఆమె వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించడం విస్మరించకూడదు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రాణాపాయానికి సంకేతాలు.మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడటం నేరమని హెచ్చరించారు.

### ప్రత్యేక ఆకర్షణగా సీపీఆర్ డెమో కంటి పరీక్షలు

ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం విద్యార్థులకు అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. అలాగే మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.

### ప్రతిజ్ఞ, హెల్మెట్ల పంపిణీ

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరితో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు అడిషనల్ డీజీపీ చేతుల మీదుగా ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, వేణుగోపాల్, శ్రీనివాస్ జి, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, పలువురు ఇన్స్పెక్టర్లు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మీ ఇంటి నుంచే ఇంటి వివరాలు నమోదు చేయండి

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

విజయవాడ,ఏప్రిల్,16,(మనం ప్రతినిధి): దేశంలో మొట్టమొదటి డిజిటల్ జన గణన తొలిదశలో భాగంగా ప్రారంభమైన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్ - ఎస్ఈ)లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఇంటి నుంచే సమాచారాన్ని నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కోరారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్వీయ గణన జరగనున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్ను ప్రారంభించారు. ఈ స్టాల్ ద్వారా ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేష్న అవగాహన కల్పించనున్నారు. కచ్చితమైన డేటాతో పాటు కీలకమైన జనగణనలో విస్తృత ప్రజాభాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు వివరించారు. జ్టిఇటు//ట్చ.చ్ఛిుఱుజౌరి.జీ పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను పొందుపరుచుకోవచ్చన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ వల్ల సమయం ఆదా అవడంతో పాటు కచ్చితమైన డేటా పొందేందుకు వీలుంటుందన్నారు. 34 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిన అనంతరం ప్రివ్యూ చేసుకొని, ఫైనల్గా సబ్మిట్ చేయాలన్నారు. ఆ సమయంలో హెచ్ అక్షరంతో మొదలయ్యే 11 అంకెల విశిష్ట సంఖ్య (ఎస్ఈ ఐడీ) జనరేట్ అవుతుందని.. భవిష్యత్తులో గణాంక సిబ్బంది (ఎన్యూమరేటర్) వచ్చినప్పుడు ఎస్ఈ ఐడీని వారికి చూపించడం ద్వారా డేటా ధ్రువీకరణ పూర్తవుతుందని తెలిపారు. అదే విధంగా ఈ నెల 30 వరకు 15 రోజుల అవుట్రీచ్ క్యాంపయిన్లో భాగంగా ఒక్కోరోజు ఒక్కో వర్గం లక్ష్యంగా స్వీయ గణనపై ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. స్వీయ గణనలో ప్రజలందరూ పాల్గొని జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జేసీ ఇలక్కియ కోరారు.సమావేశంలో విజయవాడ ఆర్డీవో టీవీ సతీష్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరెడ్డి, మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.వెంకట రామయ్య, సీపీవో వై.శ్రీలత, సెన్సస్ మాస్టర్ ట్రైనర్ డా. కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం రాహత్' పథకం వరం

- రూ. 1.50 లక్షల వరకు నగదు రహిత తక్షణ వైద్య సహాయం
- ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యం
- రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి అవసరం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్



(విజయవాడ,మనం బ్యూరో): రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా సమయానికి చికిత్స అందిస్తే గాయపడిన వారి ప్రాణాలను రక్షించడం సాధ్యమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు త్వరితగతిన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆడిటోరియంలో హాల్లో పీఎం రాహత్ (ప్రధాన మంత్రి రోడ్ యాక్సిడెంట్ హాస్పిటలైజేషన్ అండ్ అష్యూర్డ్ ట్రీట్మెంట్ స్కీమ్) పై రాష్ట్ర స్థాయి భాగస్వాముల సంప్రదింపుల సమావేశానికి గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇందుకు పీఎం రాహత్ పథకం క్యాష్ లెస్ సేవలు 1 లక్ష 50 వేల వరకు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఆసుపత్రులు, అంబులెన్స్ సేవలు, పోలీసులు మరియు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తేనే బాధితులకు తక్షణ సహాయం అందుతుందని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని, ప్రతి ఆసుపత్రి దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మంత్రి సూచించారు. ప్రజల్లో కూడా ఈ పథకం పై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల పరిస్థితిపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబానికి ఆదారమైన వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం ఆర్థికంగా దెబ్బతినడమే కాకుండా పిల్లల భవిష్యత్తు కూడా ప్రభావితమవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, రోడ్లపై ఉన్న బ్లాక్ స్పాట్స్, డివైడర్ల మధ్య అకస్మాత్తుగా వాహనాలు రావడం వంటి అంశాలను గుర్తించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు 'గోల్డెన్ అవర్' విధానాన్ని 108 అంబులెన్స్ సేవల ద్వారా సమర్థవంతంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రమాదం జరిగిన మొదటి గంటలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఈ విధానం విజయశాతం గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రమాద బాధితులకు తక్షణ నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు 'పీఎం రాహత్' పథకం అమలులో ఉందని తెలిపారు. ఈ పథకం ద్వారా బాధితులకు ఎటువంటి ముందస్తు చెల్లింపులు లేకుండా చికిత్స అందుతున్నట్లు చెప్పారు. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు 'స్టెమీ' (ఖీఖీఉఖు) కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది ప్రాణాలు రక్షించగలిగామని తెలిపారు. రాష్ట్రంలో అత్యాధునిక వైద్య సదుపాయాల అభివృద్ధి దిశగా 14 క్రిటికల్ కేర్ బ్లాకులను నిర్మించగా, మరిన్ని బ్లాకుల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ను ప్రమాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం, ప్రతి ఒక్కరి ప్రాణాన్ని కాపాడడం మనందరి సామూహిక బాధ్యత అని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ మాట్లాడుతూ... 2025లో రాష్ట్రంలో సుమారు 18,380 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో ఎక్కువగా నేషనల్, స్టేట్ హైవేలు మరియు ప్రధాన రోడ్లపైనే జరిగాయని పేర్కొన్నారు. ప్రమాదాలకు అతివేగం (79%) ప్రధాన కారణమని, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్, మొబైల్ వినియోగం కూడా కారణాలని వివరించారు. సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్య ప్రమాదాలు అధికంగా నమోదవుతున్నాయని చెప్పారు. 'పీఎం రాహత్' పథకం ద్వారా బాధితులకు రూ.1.50 లక్షల వరకు ముందస్తు చెల్లింపులు లేకుండా చికిత్స అందుతున్నదని, 'గోల్డెన్ అవర్'లో అత్యవసర వైద్యం అందించేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ ఆసుపత్రులను అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. ప్రతి 100 కిలోమీటర్లకు ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ... జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే సుమారు 130 బ్లాక్ స్పాట్స్ను గుర్తించి, అందులో 27 కీలక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వచ్చే ఏడాదిలో ప్రమాదాలను 50% తగ్గించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. 'పీఎం రాహత్' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, బాధితులకు తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సామాజిక బాధ్యతగా ప్రమాద బాధితులను ఆసుపత్రులకు తరలించే 'గుడ్ సమారిటన్స్'ను ప్రోత్సహిస్తున్నామని, ప్రతి నెల రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ శాఖల మధ్య సమన్వయం పెంచుతున్నామని వెల్లడించారు. రోడ్డు భద్రతలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ ఎన్. సూర్యచంద్రరావు, జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎస్. వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. రఘునందన్ రావు, వివిధ ఆసుపత్రుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి కృషితో విజయవంతం చేద్దాం





- ఈ నెల 18న పండగలా..
- ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకలు
- మన ఘన వారసత్వ సంపదను భావితరాలకు అందిద్దాం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

(విజయవాడ,మనం బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తుందని, రాష్ట్ర పర్యాటక శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం (గొౌటజూఛీ ఏ్చటజ్టీఱ్జ ్ట్చ) సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ గురువారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి రెవెన్యూ, పర్యాటకం, పోలీసు, వైద్య ఆరోగ్యం, మునిసిపల్, విద్యుత్, అగ్నిమాపక తదితర సమన్వయ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. అనంతరం కొండపల్లిలోని కొండపల్లి బొమ్మల ఎక్స్పీరియన్స్ సెంటర్ ప్రాంతాన్ని సందర్శించారు. కొండపల్లి బొమ్మల మేళాకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమాలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 18వ తేదీ ఉదయం కొండపల్లి ఖిల్లాపైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మినీ మారథాన్, సైక్లింగ్, యోగా సెషన్స్, సంప్రదాయ క్రీడలు వంటివి కూడా వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా కొండపల్లిలో కొండపల్లి బొమ్మలతో మేళా కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని.. ఇది 18వ తేదీ మొదలు మూడు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. వారసత్వ సంస్కృతి, ఆధునిక జెన్ జెడ్, పండగలు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై మార్చి 8న కొండపల్లి బొమ్మల పోటీ నిర్వహించడం జరిగిందని.. ఇందులోని విజేతలకు కొండపల్లి బొమ్మల మేళా కార్యక్రమం సందర్భంగా రూ. లక్ష విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఐఎన్టీఏసీహెచ్) భాగస్వామ్యంతో విజయవాడ నగరంలో హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 18వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం పక్కన ఖాళీ స్థలంలో సంగీత ఝరి మ్యూజికల్ ఈవెంట్తో సంస్కృతీ వారసత్వానికి పట్టంకట్టే కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమాల్లో ఇన్టాక్, రెడ్క్రాస్, వాసవ్య మహిళా మండలి, గాంధీ స్మారకనిధి, కొండపల్లి ఆరట్స్ అండ్ క్రాఫట్స్ సొసైటీ తదితర సంస్థలు కూడా భాగస్వామ్యమవుతున్నట్లు వివరించారు.

# జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

- రూ 1000 కోట్లతో ఆరోగ్యానికి అమలు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయడమే ప్రగతి ప్రణాళిక కార్యాచరణ
- కే హైమావతి, జిల్లా కలెక్టర్



**సిద్దిపేట ఏప్రిల్ 16(మనం ప్రతినిధి):** ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కే హైమావతి పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధుల కేటాయించి పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొమురవెల్లి మండల స్థాయి సభలో గురువారం కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించామని, ఈరోజు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి సభను నిర్వహిస్తున్నామని అన్నారు. మే మాసంలో నియోజకవర్గ స్థాయి మరియు జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రతివారం ఒక డిపార్ట్మెంట్ థీమ్ ను తీసుకొని జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని మొదటివారం ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించామని, తర్వాత హెల్త్ వీక్, ఇప్పుడు అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సురక్షిత ప్రయాణం కోసం వాహనదారులు తప్పకుండా రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రన, రైతు సంక్షేమం, విద్యా కార్యక్రమాలు, క్రీడలు యువజన సంక్షేమం, మహిళా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై నిర్ణీత ప్రణాళిక ప్రకారం 99 రోజులలో నిర్వహిస్తామని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానం మరియు సేంద్రియ వ్యవసాయం చేసి పాటించి అధిక దిగుబడిని సాధించడంతోపాటు భూమి సారం పెరిగేలా చూడాలని అన్నారు. జిల్లాలో కొత్తగా 25 వేల రేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాత రేషన్ కార్డులలో 37 వేల మంది సభ్యులను చేర్చి ప్రతినెల 6580 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో 11241 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా 9954 ఇండ్ల గ్రౌండింగ్ జరిగిందని 204 కోట్ల రూపాయల బిల్లులను చెల్లించడం జరిగిందని కొత్తగా ప్రతి నియోజకవర్గానికి మరొక 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ కోసం 22 కోట్ల 83 లక్షల రూపాయలు సబ్జరీ అందించడం జరిగిందని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు వినియోగించుకున్న లబ్ధిదారులకు 152 కోట్ల రూపాయల విలువైన ఉచిత విద్యుత్ అందించడం జరిగిందనీ, రైతు భరోసా పథకం ద్వారా మూడు లక్షల పదకొండు వేల మంది రైతుల ఖాతాలలో 392 కోట్ల రూపాయలను తాజాగా జమ చేయడం జరిగిందని, 330 కోట్ల రూపాయలు మహిళల ఉచిత బస్సు ప్రయాణం కు చెల్లించడం జరిగిందన్నారు. పేద ప్రజల అభివృద్ధి, రైతుల సంక్షేమ, అభివృద్ధి కోసం 1 వెయ్యి కోట్ల రూపాయలు ఆరు గ్యారెంటీ ల ద్వారా జిల్లాలో ప్రభుత్వం ఖర్చు చేయడం తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని దానిలో భాగంగా మర్కుక్ మండలంలో ఈ విద్యా సంవత్సరం నుండి తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కొండపాక మండల కేంద్రంలో 200 కోట్ల రూపాయలతో 16 ఎకరాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

### అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నదని ఈ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయల జీవిత బీమా ప్రతి కుటుంబానికి లభిస్తుందని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ కాలేజీలలో కూడా ఉచిత మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయనున్నదని అదేవిధంగా ప్రైమరీ స్కూల్స్, హై స్కూల్స్ తో పాటు ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టనున్నదని తెలిపారు. ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ద్వారా రహదారి భద్రత పై మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ద్వారా పౌష్టికాహారం తీసుకోవడంపై ప్రతిజ్ఞ చేయించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం ఎగ్జిబిషన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తాసిల్దార్, ఎంపీడీవో, సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు సర్పంచులు మహిళలు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యలపై జగ్గారెడ్డి నిర్మల సమీక్ష

- సింగూర్ డ్యాం నుండి నేరుగా ఇంటింటికి మాజీ రా నీళ్ళు అందేలా చర్యలు
- 135 కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- 50 సంవత్సరాల వరకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు



**సంగారెడ్డి, ఏప్రిల్ 16 (మనంప్రతినిధి):** సదాశివపేట పట్టణ ప్రజల త్రాగునీటి సమస్యలపై బుధవారం నాడు సదాశివపేట పట్టణంలోని టీపీసీసీ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మున్సిపల్ అధికారులు మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సదాశివపేట పట్టణంలోని ప్రతి ఇంటింటికి రోజుకు గంటనాలతో పాటు మంచినీళ్లు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు సింగూరు డ్యామ్ నుండి నేరుగా ఇంటింటికి మాజీరా నీళ్లు అందేలా ఇంతకు వెల్, ఫిల్టర్ బెడ్, ట్యాంకులు, కొత్త పైపుల నిర్మాణం చేయాలని సూచించారు. సదాశివపేటకు ప్రతిరోజు గంటన్నర నీళ్లు ఇవ్వాలంటే 135 కోట్లు ఖర్చు అవుతుందని దానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు జగ్గారెడ్డికి సూచించారు. 60 వేల జనాభాకు ప్రతిరోజు ఇరవై ఒక్క లక్షల గ్యాలన్ల మంచినీళ్లు అవసరం కాగా కొత్తగా నిర్మించే వాటర్ స్కీమ్లో 52 లక్షల గ్యాలరీ నీళ్లు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. 50 సంవత్సరాల వరకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుచూపుతో ఈ స్కీము ఉండాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు.

ఈ నెల 17వ తేదీన వాటర్ ప్రాజెక్ట్ సంబంధించి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొని త్రాగునీటి సమస్యపై చర్చించాలని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల కౌన్సిలర్లు అభిప్రాయాలు వారి వార్డుల్లో సమస్యలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు విలువ 135 కోట్ల అంచనా వేసినప్పటికీ ప్రజాభిప్రాయం ఆధారంగా విలువ పెరిగిన ఇబ్బంది లేదని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు ఎన్నికల లో ఇచ్చిన వాగ్దానాల మేరకే అత్యవసరమైనందున ముందుగా త్రాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు ఆ తర్వాత పేదలకు ప్లాట్లు వార్డులకు సంబంధించి ఎనిమిది కోట్ల చొప్పున అభివృద్ధి పనుల్లో గురించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుందామని జగ్గారెడ్డి అన్న వాటర్ స్కీంకు ఆమోదం రాగానే టెండర్లు పిలిచి రెండేళ్లలో పనిలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

# ప్రజాపాలనతో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సమావేశం
- ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయడమే ప్రధాన లక్ష్యం
- గ్రామ స్థాయి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనంప్రతినిధి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సదాశివనగర్ మండలంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని, ఇది అధిక ఆదాయం అందించే పంటగా మారే అవకాశముందని పేర్కొన్నారు. సర్పంచ్లు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపుపై సమావేశంలో చర్చించారు. త్వరలో మండలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం అందనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎన్వీ గిరి, డీఆర్డీఓ సురేందర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చెయ్యాలి
- మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా మండల సభ
- ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం కావడం సాధ్యం కాదని స్పష్టం
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 16 (మనం బ్యూరో):** నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమం భాగంగా మండల స్థాయి సభలను నిర్వహిస్తూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతున్నామని ఆయన చెప్పారు. గురువారం వంగూరు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన మండల సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు, అవసరాల ఆధారంగానే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రూపుదిద్దుకుంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ......, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరిట 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్యం, మౌలిక వసతులు, గ్రామీణ అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. మండల సభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వేదికలుగా మారుతున్నాయన్నారు. ఆయా శాఖల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, రాయితీ గ్యాస్, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. అలాగే మహిళల సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార అవకాశాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యా రంగంలో కూడా ప్రభుత్వం కొత్త కార్యక్రమాలను ప్రవేశ పెడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే పథకాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరలో గృహ ప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామస్థులు తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజలు అభివృద్ధి పనులకు సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రకళ, గ్రామ సర్పంచ్ యాదయ్య, ఎంపిడిఓ, తహసిల్దార్ , స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి
- అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**సంగారెడ్డి, ఏప్రిల్ 16 మనంప్రతినిధిః** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కంది మండలంలోని రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్పుక్కులు, సన్నబియ్యం పంపిణీ, వైద్య సేవలు తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ వంటి నూతన పథకాలపై అవగాహన కల్పించారు. కొందరు లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలను వెల్లడిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా, టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి కుటుంబానికి చేరేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులకు రైతు భరోసాతో పాటు వ్యవసాయ యంత్రాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, మార్చి 6 నుంచి ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదన్నారు. ఇప్పటికే శానిటేషన్, ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించామని, ఏప్రిల్ 2న గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ వారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో పోలీస్ శాఖతో కలిసి రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడటం సర్పంచుల బాధ్యత అని పేర్కొన్నారు.జిల్లాలో సివిల్ సప్లై స్ ద్వారా మూడు నెలల రేషన్ పంపిణీ జరుగుతోందని, ఇప్పటికే 80 శాతం ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాబోయే రబీ సీజన్లో కొనుగోలు కేంద్రాలను పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, అందుకు సర్పంచులు, ఎస్ హెచ్ జి మహిళలు సహకరించాలని కోరారు.ఈ జీఎస్ కింద చేపట్టిన పాఠశాలల్లో మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్, గ్రామపంచాయతీ, అంగన్వాడి కొత్త భవనాల పనులు వచ్చే రెండు నెలల్లో పూర్తి చేసేలా ఆయా సర్పంచులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐసి జిఎం తుల్జా నాయక్ , ఎంపీడీవో శ్రీనివాస్ , తహసిల్దార్ రవికుమార్ ,ఎంపీఓ మహేందర్ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళలు, రైతులు, మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వంగూరులో తెలంగాణ మోడల్ స్కూల్
# నిర్మాణ పనుల పరిశీలన

- ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు ఒకే చోట విద్యాబ్యాసం
- నాణ్యత, గడువు పాటిస్తూ మోడల్ స్కూల్ నిర్మాణం పూర్తి చేయాలి
- నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 16 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ (మోడల్) స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను ఒకే చోట అందించే విధంగా ఆధునిక సదుపాయాలతో తెలంగాణ మోడల్ స్కూల్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సమగ్ర విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డైనింగ్ హాల్, కిచెన్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, విశాలమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, బాత్రూములు, ఆట స్థలం వంటి అన్ని ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. పాఠశాల భవనం నిర్మాణం వేగవంతంగా కొనసాగుతున్నప్పటికీ, పనుల్లో నాణ్యతకు ఎలాంటి లోపం రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పాఠశాల భవనం బలంగా, సురక్షితంగా ఉండేలా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అలాగే తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు సమగ్రంగా ఏర్పాటు చేయాలన్నారు. పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడైనా ఆలస్యం గమనించినట్లయితే తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఇక పాఠశాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం లభిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా ప్రమాణాలు మరింత పెరుగుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న




- ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 16 మనం న్యూస్:** అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని గజ్వేల్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అగ్ని మాపకు వారోత్సవాల్లో భాగంగా గురువారం నాడు స్థానిక పీవీ నరసింహారావు బ్లడ్ బ్యాంకులో తమ సిబ్బందితో కలిసి రక్తదానాన్ని చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం ఆకలి తీరుస్తుంది విద్యాదానం జీవితాన్నిస్తుంది కానీ ఒక రక్తదానం మాత్రం నిండు ప్రాణాలు నిలబెడుతుందని ఆయన అన్నారు. దానం చేసిన ప్రతి రక్తం చుక్క ఎవరిదో ఒక ప్రాణాన్ని నిలబెడుతుంది, ఎంతో టెక్నాలజీ అభివృద్ధి చెందిన రక్తాన్ని మాత్రం తయారు చేయడం వీలు కాదని దానం మాత్రమే చేయగలుగుతాం అన్నారు. ముఖ్యంగా యువకులు రక్తదానానికి ముందు వరుసలో ఉండాలని వారు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని యువకులకు పిలుపునిచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల వయసుగల వారు ఎవరైనా సరే రక్త దానం చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అనిల్ కుమార్, శివకుమార్, ప్రభాకర్ గౌడ్, సతీష్ కుమార్ రెడ్డి, జనార్దన్, నాగభూషణం, స్వామి, వెంకటేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో కలెక్టరేట్లో జాబ్ మేళ

- నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో అవకాశాలు
- జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రజిని కిరణ్

**కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనంప్రతినిధి ):** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 18న శనివారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్లోని మొదటి అంతస్తు, గది నెం.121లో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రజిని కిరణ్ తెలిపారు. ఈ మేళలో గూగుల్ పేకు సంబంధించిన ఉద్యోగాలు అందుబాటులో ఉండగా, ఇంటర్/డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.18,000తో పాటు ఇన్సెంటివ్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. బైక్ తప్పనిసరి కాగా, పురుషులకు మాత్రమే ఈ అవకాశాలు అందుబాటులో ఉంటాయి. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ల రెండు సెట్లు, ఆధార్ కార్డు ప్రతులతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9704412792, 6305743423 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

# ప్రతి పంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చర్యలు చేపట్టాలి
- వేసవి దృష్ట్యా వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలి
- రక్షిత నీటి సరఫరా నిరంతరం జరగాలి
- విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి
- అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 16(మనంప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూలూరుపాడు రైతు వేదికలో గురువారం మండల స్థాయి సభను నిర్వహించారు. ఈ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించగా, అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో రహదారుల భద్రత అర్రైవ్ అ లైవ్, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, మిషన్ భగీరథ, ఇరిగేషన్, మహిళ సంఘాలు వంటి వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను అధికారులు సభలో తెలియజేశారు. అనంతరం సర్పంచులు తమ గ్రామాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో సమస్యలను గుర్తించి పరిష్కరించే ప్రక్రియ వేగవంతమవుతోందన్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించడం, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు విధులు సమర్థంగా నిర్వహిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తుగా బుకింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నిర్దేశిత మెనూను కచ్చితంగా పాటించేలా పాఠశాలల్లో పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యను మధ్యలో ఆపివేసిన (డ్రాప్‌అవుట్) విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్చే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని, వేసవి తీవ్రత దృష్ట్యా ప్రధాన కూడళ్లలో, కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలకు సేవలు అందించేలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చేయూత వంటి సంక్షేమ పథకాల అమలులో అర్హులైన వారికి మాత్రమే లబ్ధి చేకూరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని అన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ వ్యవస్థ కీలకమని, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా వ్యవహరించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం మోడల్ గ్రామపంచాయతీలను ఎంపిక చేస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామాన్ని మోడల్గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. రహదారి భద్రతపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వినూత్న ఆలోచనలతో ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా అనంతారం గ్రామంలో భూగర్భ జలాల్లో అధిక ఫ్లోరైడ్ సమస్య కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, గ్రామానికి సురక్షితమైన మంచినీటి సరఫరా కల్పించే దిశగా మిషన్ భగీరథ అధికారులను తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి , అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

# నాటి మావోయిస్టులే నేటి జవాన్లు

## ఆపరేషన్ కగార్‌లో డిఆర్జి బలగాల కీలకపాత్ర

## అనేక ఎన్ కౌంటర్లు డిఆర్జితోనే

## సాయుధ పోరాటం నిర్మూలనతో ఇక ప్రజా సేవలపై దృష్టి

## అడవులలో ఆదివాసీలకు అనేక సేవలు





**చర్ల, ఏప్రిల్ 16 (మనం న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అపరేషన్ కగార్ లో ఛత్తీస్ఘడ్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డులు కీలకపాత్ర పోషించారని చెప్పవచ్చు. గతంలో సల్వాజుడుం, మావోయిస్టులుగా పనిచేసిన వారితో పాటు స్థానిక యువతను డిఆర్జి లోకి తీసుకున్నారు. మాజీ మావోయిస్టులు, సల్వాజుడుం నుండి వచ్చిన వారు కావడంతో వీరికి దండకారణ్యం, అంబూజ్మడ్ అడవులు, మావోయిస్టు స్థావరాలు అడుగడుగునా తెలుసు. కేంద్ర బలగాలకు వీరు గైడ్ గా వ్యవహరించి మావోయిస్టు వేటలో ముందుండి నడిపించినట్లు తెలుస్తోంది.

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం 2008 లో కాంకేర్, నారాయణ్ పూర్ జిల్లాలో మొట్టమొదటి డిఆర్జి యూనిట్‌ను ప్రారంబించింది. ఈ జిల్లాలో మావోయిస్టుల ఏరివేతలో డిఆర్జి కీలకపాత్ర పోషించడంతో 2013లో బీజపూర్, బస్తర్ జిల్లాలకు విస్తరించారు. ఆ తర్వాత 2014 లో సుక్మా, కొండెగావ్, 2015 లో దంతెవాడ జిల్లాలకు విస్తరించి స్థానిక పరిజ్ఞానంతో మావోయిస్టులను సమర్థ వంతంగా ఎదుర్కొన్నారు. మావోయిస్టుల నెట్ వర్క్ ను లక్ష్యంగా చేసుకొని డిఆర్జి వివిధ ఆపరేషన్లలో కీలకంగా వ్యవహరించింది. 2015 లో స్వతంత్రంగా వ్యవహరించి ఛత్తీస్ఘడ్ సరిహద్దున ఉన్న రాష్ట్రాల బలగాలు, పారామిలిటరీ బలగాలతో కలసి 644 ఆపరేషన్స్ నిర్వహించింది. ఫలితంగా 46 మంది మావోయిస్టులు మృతిచెందారు. 2018లో డిఆర్జి నిర్వహించిన 144 ఆపరేషన్ల ఫలితంగా తమవైపు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా 25 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టింది. అత్యంత సమస్యాత్మక జిల్లాలయిన సుక్మాలో 482 మంది, బీజపూర్ జిల్లాలో 312 మంది డి ఆర్ జి సిబ్బంది తమ సేవలను అందచేసి అక్కడ గల సిఆర్పిఎఫ్ బలగాలతో సమన్వయం చేసుకొని రెండు జిల్లాలలో జరిగిన ఎన్ కౌంటర్లలో పదుల సంఖ్యలో మావోయిస్టు లను మట్టుబెట్టింది. ఇదే క్రమంలో మావోయిస్టుల దాడిలో అనేక మంది జవాన్లు మృతి చెందిన సంఘటనలు సైతం ఉన్నాయి. 2023 ఏప్రిల్ 26న దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు జరిపిన ఐఈడి దాడిలో 10 మంది సిబ్బందితో పాటు ఒక వాహన డ్రైవర్ మృతిచెందాడు. అనంతరం 2023 సెప్టెంబరులో జరిగిన ఎదురుకాల్పులలో డిఆర్జి, సిఆర్పిఎఫ్ బలగాల సంయుక్త ఆపరేషన్ లో 9 మంది మావోయిస్టులు మృతిచెందారు. 2023 లో డిఆర్జి స్పెషల్ టాస్క్ ఫోర్స్ జవాన్లు సంయుక్తంగా అంబూజ్మడ్ అడవులలో ఆపరేషన్ నిర్వహించి 28 మంది మావోయిస్టులకు హతమార్చారు. 2025 జనవరి 6 వ తేదీన మావోయిస్టులు అమర్చిన భారీ మందుపాతర పేలి 8 మంది డిఆర్జి జవాన్లతో పాటు ఒక డ్రైవర్ మృతిచెందాడు. 2025 మే 21 న అంబూజ్మడ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో డిఆర్జి కి చెందిన నాలుగు యూనిట్లు మావోయిస్టు జాతీయ ప్రదాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ తో పాటు 27 మంది కీలక మావోయిస్టులను ఎన్ కౌంటర్ చేసి ఆపరేషన్ కగార్ విజయంలో కీలక ముందడుగు వేసారు. అనంతరం జరిగిన పలు ఆపరేషన్ లలో సిఆర్పిఎఫ్, ఇతర పారామిలిటరీ బలగాలతో కలసి శత్రుశిభిరాలను గుర్తించి అనేక ఎన్ కౌంటర్ల ద్వారా మావోయిస్టు నిర్మూలనలో కీలకపాత్ర పోషించింది. ఆపరేషన్ కగార్ ముగియడం, ప్రస్తుతం దండకారణ్యం, అంబూజ్మడ్ అడవులలో మావోయిస్టులు లేకపోవడంతో డిఆర్జి బలగాలు ప్రజా సేవలపై దృష్టి సారించింది. అడవులలోని మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడి గిరిజనులకు సేవలనందిస్తోంది. తమ వెంట తీసుకువెల్లిన మెడికల్ కిట్ల ద్వారా ఆదివాసీలకు వైద్య సేవలను అందిస్తూ వారికి సేవలను అందచేస్తూ మన్ననలను పొందుతోంది.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి పకడ్బందీ చర్యలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ అమలుపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్



**ఖమ్మం, ఏప్రిల్ 16(మనం బ్యూరో) :** ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ అమలు పై రెవెన్యూ, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ భూ సమస్యలకు పరిష్కారం కోసం రెవెన్యూ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలో ప్రవేశపెట్టిందని అన్నారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద భూములు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ లు అందించే దిశగా ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ రూపొందించామని అన్నారు.

రైతులు ఇంటి వద్ద నుంచి కూడా స్లాట్ బుకింగ్ చేసుకునేలా పోర్టల్ తయారు చేశామని, రైతులు లాగిన్ కాగానే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు చెల్లించిన తర్వాత గ్రామంలోని లైసెన్స్ సర్వేయర్ లాగిన్ కు వెళ్తాయని, రెండు రోజుల్లో ఆ రైతు భూమికి సరిహద్దు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసి ఏడు రోజుల లోపు సర్వే పూర్తి చేస్తారని, ఈ వివరాలను సర్వేయర్ సిస్టంలో నమోదు చేశాక దరఖాస్తుదారుడైన రైతు సర్వే మ్యాప్ నకు యూనిక్, భూధార్ నెంబర్లు కేటాయిస్తారని భూభారతి పోర్టల్ లో కూడా వివరాలు నిక్షిప్తమవుతాయని అన్నారు. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ జనరేట్ చేసి పోర్టల్ లో అప్లోడ్ చేస్తారని ఈ ప్రక్రియలు దరఖాస్తు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్ మొబైల్ నెంబర్ కు మెసేజ్ వస్తాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ముందుగా కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూ భారతి కింద ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కారించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దారు సైదులు, కలెక్టరేట్ భూ భారతి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 16 (మనంప్రతినిధి):** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ తహసీల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని మండలాల వారీగా సమగ్రంగా పరిశీలించారు. స్లాబ్ స్థాయికి చేరిన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, మార్కింగ్ చేసినవి, ఇంకా మార్కింగ్ చేయని ఇళ్ల వివరాలను ఒక్కొక్కటిగా అడిగి తెలుసుకున్నారు. మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడైనా ఆలస్యం జరుగుతున్నట్లయితే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచిస్తూ, లబ్ధిదారులతో నిరంతర సమన్వయం కొనసాగించాలని తెలిపారు. నిర్మాణ సామగ్రి సరఫరా, ముఖ్యంగా ఇసుక రవాణా సక్రమంగా జరుగుతున్నదా అనే విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా ఇసుక కొరత లేదా రవాణా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చూపించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు తమ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ దశలు, పూర్తి స్థాయి వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. ప్రతి ఇల్లు ఏ దశలో ఉందో నిరంతరం పర్యవేక్షిస్తూ నివేదికలు సమర్పించాలని తెలిపారు. దీనితో పాటు పారిశుద్ధ కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వార్డుల వారీగా పారిశుద్ధ పనులు, చెత్త సేకరణ, డంపింగ్ వివరాలు వంటి అంశాలపై సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుద్ధ కార్మికుల పనితీరును పర్యవేక్షిస్తూ పట్టణాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సమయానికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం విజయవంతం



**దమ్మపేట, ఏప్రిల్ 16(మనం న్యూస్):** దమ్మపేట మండలంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల స్థాయి సమావేశం విజయవంతమైంది .ఈ సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షిస్తూ, ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలని అధికారులు సూచించారు.ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్య రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని మండల అభివృద్ధి అధికారి రవీంద్ర రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటల ఉత్పత్తి పెంపు కోసం ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని తెలిపారు. సాగునీటి వనరుల సమర్థ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతు సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేస్తున్నామని ఏవో చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ షఫిక్ అహ్మద్ తెలిపారు. గర్భిణీ స్త్రీలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని, గ్రామస్థాయిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దమ్మపేట మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నట్లు హౌసింగ్ ఏఈ రాము తెలిపారు . ఇప్పటికే నిర్మాణం పూర్తికి చేరుకున్న ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు తమ తమ నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. చివరి దశలో ఉన్న ఇళ్లలో మిగిలిన పనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఎంపీడీఓ ఆదేశించారు. లబ్ధిదారులు కూడా నిర్మాణ పనుల్లో చురుకుగా పాల్గొని తమ ఇళ్లను త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ప్రయోజనాలు అందరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ,ఆయా పంచాయితీ సర్పంచులు, ఉప సర్పంచులు, అంగన్వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, ఎంఈఓ జగపతయ్య , సీఐ నాగరాజు , ఎస్సు సాయి కిషోర్ రెడ్డి గారు, మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి , ఏవో చంద్ర శేఖర్ రెడ్డి , పీఆర్ జుమ్కిలాల్ , సీడీపీఓ హేమ సత్య , ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణ సాగర్ , పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీళ్లు లేక ఎండుతున్న వరి పంటలు

## కెనాల్ నీరు ఆగడంతో రైతుల్లో ఆందోళన



**కొణిజర్ల, ఏప్రిల్ 16 (మనం న్యూస్):** పొలాల్లో నీళ్లు లేక వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. ఖమ్మం జిల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలో పెద్దమునగాల మేజర్ కాలువ కింద దాదాపు 500 నుంచి 1000 ఎకరాల వరకు ఆయకట్టు ఉండగా, పంటలు పూర్తిగా చేతికి వచ్చే దశలో ఉన్న సమయంలోనే సాగునీటి సరఫరా అకస్మాత్తుగా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర నష్టాల భయంతో ఆందోళన చెందుతున్నారు. రైతుల తెలిపిన వివరాల ప్రకారం.. ఈ సీజన్లో ఒక్కో ఎకరానికి రూ.30,000 నుంచి రూ.35,000 వరకు భారీగా పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం వరి పంట గింజలు నిండే కీలక దశలో ఉంది. ఈ దశలో ఒక్క తడి నీరు అందితేనే పంట పూర్తిగా చేతికి వచ్చే అవకాశం ఉందని, లేకపోతే మొత్తం పంట ఎండిపోయి పెట్టుబడే కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వారు చెబుతున్నారు. గత నెల 28వ తేదీ వరకు కాలువలో నీరు వచ్చినప్పటికీ, అప్పటి నుంచి పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం పంటలకే కాకుండా పశువులు తాగేందుకు కూడా సరిపడా నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, అలాగే పై అధికారులకు వినతి తెలిపినప్పటికీ ఎలాంటి పరిష్కారం కనిపించలేదని రైతులు పేర్కొన్నారు.

రైతు కవిడ బాలకోటి మాట్లాడుతూ పంట పూర్తిగా చేతికి వచ్చే దశలో ఉండగా నీళ్లు ఆపేయడం చాలా బాధాకరం. ఇప్పుడైనా ఒక తడి వదిలితే మా పంట కాపాడుతుంది అని అన్నారు. రైతు దాసరి రాంబాబు మాట్లాడుతూ ఒక్కో ఎకరానికి 30 నుంచి 35 వేల వరకు ఖర్చు పెట్టాం. నీళ్లు రాకపోతే మా పెట్టుబడి మొత్తం నష్టపోతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కవిడ చిన్న క్రిష్ణ మాట్లాడుతూ, పంట ఇప్పుడు గింజలు నిండే దశలో ఉంది. ఈ సమయంలో నీళ్లు లేకపోతే పంట పూర్తిగా ఎండిపోతుంది అని అన్నారు. ఇంకా రైతులు మాట్లాడుతూ, మా బాధలను అర్థం చేసుకొని కనీసం ఒకసారి నీరు వదిలితే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంది. లేకపోతే పంటలు ఎండిపోయి భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, బోనకల్ బ్రాంచ్ కెనాల్ ద్వారా తక్షణమే సాగునీరు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కనీసం ఒక తడి అయినా అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఈ విషయంపై నీటిపారుదల శాఖ డి.ఈ. గౌతమి శిల్పను ఫోన్ ద్వారా సంప్రదించగా, ఆమె మాట్లాడుతూ, ఏప్రిల్ నెల షెడ్యూల్ ప్రకారం కాలువకు ఏప్రిల్ 7వ తేదీ వరకు నీటిని విడుదల చేశామన్నారు. రైతుల అభ్యర్థన మేరకు ఆ గడువును ఏప్రిల్ 14వ తేదీ వరకు పొడిగించడం జరిగింది. ప్రస్తుతం పాలేరు జలాశయంలో తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపడా నీరు ఉన్నది. ఈ విషయాన్ని రైతులకు కూడా ఇప్పటికే తెలియజేశాం అని పేర్కొన్నారు.

# నిర్ణీత గడువు లోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి
- జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్, కూసుమంచి వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ఖమ్మం, ఏప్రిల్ 16(మనం బ్యూరో):** పాలేరు నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా నియమిత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం పాలేరు నియోజకవర్గం పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ముందుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మండల స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం కూసుమంచి మండల కేంద్రంలో 5 ఎకరాల విస్తీర్ణంలో 45 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 108 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవన నిర్మాణాల పనుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. పనులను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ₹జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. అదే విధంగా కూసుమంచిలో నిర్మిస్తున్న 100 పడకల ఏరియా ఆసుపత్రి పూర్తి కావడంతో పరిసర ప్రాంతాల ప్రజలకు తక్షణ, మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రజలకు ఉపయోగపడే ఈ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి అయితే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని, అందుకుగాను సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకతతో, బాధ్యతతో పనులు నిర్వహించడం ద్వారా జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్ గౌడ్, పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఆహారంతో ఆరోగ్యం



- లీ ఫౌండేషన్ అద్వర్యంలో ఉచిత మోగా వైద్య శిబిరం
- ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలి

**పెందుర్తి,ఏప్రిల్,16,(మనం న్యూస్):** ఆరోగ్యాన్ని కాపాడుకున్నేందుకు ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని,ప్రధానంగా పోషకాలతో కూడిన అహారాన్ని తీసుకోవడం ద్వారా శరీర ఆరోగ్యాన్ని మెరుగు పర్చుకోవచ్చని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి పేర్కొన్నారు. తీసుకున్నేందుకు విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం, నరవలోని బెహరా నర్సింగ్ ఇన్స్టిట్యూట్ సహకారంతో లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 250 మంది నర్సింగ్ విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం ప్రధానంగా విద్యార్థులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు వీటిల్లో ముఖ్యంగా ఆంత్రోపోమెట్రిక్ పరీక్షలు (ఎత్తు, బరువు కొలతలు) హిమోగ్లోబిన్ పరీక్ష (రక్తహీనత గుర్తింపు) బాడీ కాంపోజిషన్ విశ్లేషణ పోషకాహార సంప్రదింపులు పరీక్షల అనంతరం, న్యూట్రిషనిస్ట్ నివేదికలను సమీక్షించి, రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని ఎలా పెంచుకోవాలి మరియు శరీర ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుచుకోవాలి అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా లీ ఫౌండేషన్,లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి హాజరయ్యాడు ఈ సందర్బంగా అమె మాట్లాడుతూ వేసవిలో ద్రవ పదార్ధాలు అధిక మొత్తంలో తీసుకోవాలని,నాణ్యమైన పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కో ఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, న్యూట్రిషనిస్ట్ మాధురి, మరియు క్రాంతి పాల్గొన్నారు. అలాగే బెహరా నర్సింగ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ బెహరా విజయ చైతన్య , ప్రిన్సిపాల్స్ ఎన్. వరలక్ష్మి, డాక్టర్ ఎ. ఇందుమతి, మరియు జి.ఎన్.ఎం ప్రతినిధులు భాగ్యలత, పావని, లీ ఫార్మా టీమ్ సభ్యులు ఈ శిబిరంలో పాల్గొన్నారు.సమిష్టి కృషితో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది.

# ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్ల పంపిణీ



**విజయవాడ సెంట్రల్ ఏప్రిల్ 16( మనం న్యూస్):** వేసవిలో తీవ్ర ఎండల దృష్ట్యా ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఉపశమనం పొందేందుకు హ్యాట్స్, వాటర్ బాటిల్స్, కూలింగ్ కళ్ల అద్దాలు, నెక్ బ్యాండ్ (చల్లగా గాలి రావడానికి) మరియు బ్యాగులతో కూడిన సమ్మర్ కిట్లను. పోలీసు కమిషనర్ కార్యలయం నందు ఎస్.వి.రాజ శేఖర బాబు చేతులు మీదుగా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అందజేశారు ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.విజయవాడ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేవిధంగా పలు చర్యలు తీసుకోవడం జరిగింది, అస్త్రం యాప్ ద్వారా మంచి ఫలితాలు సాధించాం, లక్ష్యాలకు అనుగుణంగా సిబ్బంది బాగా పని చేస్తున్నారు, అస్త్రం ఏ.ఐ టూల్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ పై పెద్ద యజ్ఞం చేశాం, చిన్న చిన్న ఏ.ఐ.టూల్స్ లను ఉపయోగించుకుని మన పోలీసు కమిషనరేట్ పరిధిలో చాలా మార్పులు తెచ్చాం, నేడు బెంగుళూరు లో కూడా అస్త్రం టూల్ ను వినియోగిస్తున్నారు, గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గించాం, వెస్ట్ బైపాస్ వల్ల ట్రాఫిక్ తగ్గినా, వాహనాల వేగం పెరిగింది, ఇంకా చాలా వరకు ఈ ప్రమాదాల శాతం తగ్గించాలి, అందుకు ప్రజల సహకారం కూడా చాలా అవసరం, మేము హెల్మెట్ ల పై ప్రజల్లో అవగాహన కల్పించాం, ఈ అవగాహన వలన ఇప్పుడు 85 శాతం మంది హెల్మెట్ లు వాడుతున్నారు, అదేవిధంగా హెల్మెట్ క్లిప్ లు కూడా తప్పనిసరిగా పెట్టుకోవాలని కోరుతున్నాం, కోయంబత్తూరు లో 99 శాతం మంది హెల్మెట్ లు వాడుతున్నారు, మన కమిషనరేట్ లో కూడా ఇదే విధంగా అందరూ హెల్మెట్ వాడాలి, వాహనధారులు తమ పెండింగ్ చలానాలను వాట్సప్, అస్త్రం ద్వారా ప్రజలు చెల్లించవచ్చు, 17 ప్రాంతాలలో కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్ లు ఏర్పాటు చేశాం మరో 36 ప్రాంతాలలో ఏర్పాటు చేయుటకు సన్నాహాలు జరుగుతున్నాయి, 2026 సంవత్సరం లో కొత్త విధానాల ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చూస్తాం, చాలా ప్రాంతాల్లో పార్కింగ్ కోసం సెల్లార్స్ ఉన్నా... వాహనాలు రోడ్ల మీదే పెడుతున్నారు, నగరంలోని 187 సెల్లార్లను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చాం, త్వరలోనే వీటి పై ఆకస్మిక తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధిస్తాం, క్షేత్ర స్థాయిలో సామాన్య ప్రజలకు కనిపించేది ట్రాఫిక్ పోలీసులే, ఎండల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు కు రక్షణ గా నిలిచే కిట్ లు అంధజేయడానికి ముందుకు వచ్చి సహకారం అందించిన దాతలకు మా పోలీసు తరపున ధన్యవాదాలు తెలిపారు.ట్రాఫిక్ సిబ్బంది ప్రజలకు నిరంతరం సేవలందించడంతో పాటు తమ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వేసవి కాలంలో డీహైడ్రేషన్కు గురికాకుండా తరచూ మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, గ్లూకోజ్ తీసుకోవాలని సూచించారు. అలాగే, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద వాహనదారులు ఎండలో ఇబ్బంది పడకుండా గ్రీన్ కలర్ షేడ్ నెట్లను ఏర్పాటు చేయించిన ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం, ఐపీఎస్ ని అభినందించారు.

అనంతరం విధులలో విశేష ప్రతిభ కనపరిచిన అధికారులకు మరియు సిబ్బందిని ప్రశంసా పత్రాలతో అభినధించారు. సమ్మర్ కిట్లను అంధించడానికి సహకరించిన ధాతలు ఆస్టర్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతా రామమోహనరావుని మరియు మా ఆరట్స్ ప్రొప్రైటర్ సి హెచ్ రవి కుమార్ (చంటి) ను దుశ్శాలువా, మేమేంటోతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డి.సి.పి.లు షిరీన్ బేగం ,సూర్యచంద్ర రావు , ట్రాఫిక్ ఏ.సి.పి. , ఇన్స్పెక్టర్ ఆస్టర్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతా రామమోహనరావు, మరియు మా ఆరట్స్ ప్రొప్రైటర్ శ్రీ సి హెచ్ రవి కుమార్ (చంటి) మరియు ట్రాఫిక్ ఎస్.ఐ.లు సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం దేశ ప్రగతికి నవశకం

## నారీ శక్తి వందన్ అధినియం మహిళా సాధికారతలో నూతనాధ్యాయం

## చారిత్రక ఘట్టానికి సాక్షిగా ఢిల్లీకి నందిగామ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య



**నందిగామ, ఏప్రిల్ 16, (మనం న్యూస్):** భారత రాజకీయ చరిత్రలో మైలురాయిగా నిలిచిన మహిళా రిజర్వేషన్ బిల్లు 'నారీ శక్తి వందన్ అధినియం' అమలు ప్రక్రియను వేగవంతం చేసే దిశగా పార్లమెంటులో జరుగుతున్న కీలక చర్చలకు సంఘీభావం తెలిపేందుకు నందిగామ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఈరోజు ఢిల్లీ పయనమయ్యారు. దశాబ్దాల మహిళా కల సాకారమవుతున్న ఈ అద్భుత క్షణాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచేందుకు, రాష్ట్ర మహిళా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ఈ పర్యటన చేపట్టారు. 2029 ఎన్నికల నాటికి ఈ చారిత్రక చట్టం క్షేత్రస్థాయిలో అమలు కావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం తన సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందని ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

**యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా...**

మన భారతీయ ధర్మం ప్రకారం ఎక్కడ మహిళలు గౌరవింపబడతారో, అక్కడ దేవతలు కొలువై ఉంటారు. నేడు ఈ బిల్లు ద్వారా ఆ దేవతా స్వరూపాలైన మహిళలకు వారి రాజ్యాంగబద్ధమైన హక్కు లభిస్తోందని సౌమ్య తెలిపారు. మహిళలు శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక రంగాల్లో ఎంతగా ఎదిగినా, వారి జీవితాల్లో సమూల మార్పు రావాలంటే చట్టసభల్లో నిర్ణయాధికారం అవసరమని, దేశ ప్రజల భవిష్యత్తును మార్చే చోట మహిళలకు సముచిత ప్రాతినిధ్యం రావడం శుభసూచకమని ఆమె అభిప్రాయపడ్డారు.

**ప్రధాని మోదీ దృఢ సంకల్పం దశాబ్దాల కల సాకారం..**

మూడు దశాబ్దాలుగా చట్టసభల గడప వద్దే ఆగిపోయిన ఈ బిల్లుకు నేడు మోక్షం లభిస్తుందంటే దానికి ప్రధాన కారణం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిరుపమానమైన కృషి మరియు రాజకీయ నిబద్ధతేనని, ఈ చారిత్రక సాహసం చేసిన ప్రధానికి మహిళా లోకం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

**కూటమి ప్రభుత్వ స్ఫూర్తి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చొరవ:**

మహిళా సాధికారతకు అంకితమైన ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఈ బిల్లు అమలుకు విశేషంగా కృషి చేస్తోంది. నాడు స్వర్గీయ ఎన్టీఆర్ దేశంలోనే మొదటగా ఆస్తిలో సమాన హక్కు కల్పించి చారిత్రక విప్లవానికి నాంది పలికారు. ఆ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, చంద్రబాబు నాయుడు మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేసి దేశానికే స్ఫూర్తిగా నిలిచారు. అదే క్రమంలో ఈనాడు ఆయన కేవలం మద్దతు ఇవ్వడంతో సరిపెట్టుకోకుండా, దేశవ్యాప్త అమలు కోసం అన్ని రాజకీయ పార్టీల నేతలను సమన్వయం చేస్తూ జాతీయ స్థాయిలో చైతన్యం తీసుకురావడం మహిళల పట్ల ఆయనకున్న విశేష నిబద్ధతకు నిదర్శనం. దీనికి తోడు, ప్రతి ఆడబిడ్డను 'వీర మహిళ'గా తీర్చిదిద్దాలనే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయం నేడు మహిళా లోకానికి గొప్ప భరోసా ఇస్తోందని తెలిపారు.

# జీఎస్డీపీ లక్ష్యాలపై సూక్ష్మస్థాయి ప్రణాళికలు

- ఉత్పాదకత పెంచటంపై అన్నిశాఖలూ దృష్టి
- సాస్కి, పూర్వోదయ పథకాల ద్వారా అభివృద్ధి ప్రాజెక్టులు
- ఆర్థిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి, ఏప్రిల్ 16,(మనం ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా మైక్రో, మాక్రో స్థాయిలో ప్రణాళికలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా పూర్తి స్థాయి ఉత్పాదకతను చేరుకోవాలని ఆర్థికశాఖకు సూచించారు. 15 శాతం మేర వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్రస్థాయి వరకూ ఈ ప్రణాళికల్ని సమర్ధంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఆర్థిక శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నీరు, విద్యుత్ లాంటి వనరుల్ని వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేరకు అందిస్తున్నామని.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉత్పాదకత పెంపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఉన్నా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని.. అలాగే గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ప్రజలపై ఎలాంటి భారం లేకుండా ఆదాయార్జన శాఖలు రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి అయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ఎలాంటి నిధుల కొరతా లేదని కేంద్ర సహకారంతో వాటిని పూర్తి చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పూర్వోదయ, సాస్కి లాంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం కావాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సంక్షేమ క్యాలెండర్ కు అనుగుణంగానే పథకాలను అమలు చేస్తామని సీఎం అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు.

పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత పాలకులు నిర్దయగా మూసివేశారని.. ఎన్ని ఇబ్బందులు ఉన్నా అన్నార్తుల కడుపు నింపేలా రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో భోజనం పెడుతున్నామని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్ధ్యంతో పాటు సులభతరమైన విధానాల ద్వారా పెట్టుబడులు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# స్వీయ గణన చేసుకున్నా... మీరు చేసుకోవచ్చు

## జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ



**గుంటూరు, ఏప్రిల్ 16,(మనం న్యూస్ ప్రతినిధి):** జిల్లాలో స్వీయ గణన ప్రారంభం అయింది. జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ గురువారం, మొదటి రోజున స్వయంగా స్వీయ గణన చేసుకుని స్ఫూర్తిగా నిలిచారు. జిల్లాలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, పలువురు అధికారులు సైతం స్వీయ గణన చేసుకుని జన గణనకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు స్వీయ గణన అందుబాటులో ఉంటుందని జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునేందుకు వీలుగా 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న తొలి జనాభా గణనగా ప్రత్యేకత సంతరించుకుందన్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 2027 జనాభా గణన (Census&2027) రెండు దశల్లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మొదటి దశగా ఇండ్ల జాబితా మరియు గృహ గణన (House Listing Housing Census) నిర్వహిస్తారని చెప్పారు. ఇందులో ప్రతి ఇంటి వివరాలు, గృహ పరిస్థితులపై సమాచారం సేకరించడం జరుగుతుందని అన్నారు.

రెండవ దశలో జనాభా గణన చేపట్టడం జరుగుతుందని అన్నారు. మొదటి దశకు సంబంధించి అవసరమైన అన్ని ప్రాథమిక ఏర్పాట్లు ప్రారంభమయ్యాయన్నారు. ఫీల్ స్థాయిలో డేటా సేకరణ విధానం, మొబైల్ యాప్ వినియోగం, పరిధుల గుర్తింపు, ల్యాండ్మార్కుల గుర్తింపు, డేటా భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. స్వీయ గణన ప్రక్రియ పూర్తిగా స్వచ్ఛందమైనదని, ఎటువంటి నిర్బంధం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. దేశాభివృద్ధిలో కీలకమైన ఈ జాతీయ కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని, డిజిటల్ పద్ధతిలో తమ వివరాలను నమోదు చేసుకుని జనగణనను విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి విజ్ఞప్తి చేశారు.

# టిడిపి సీనియర్ల జాబితాలో మంత్రి నిమ్మలకు గుర్తింపు

- పోలిట్ బ్యూరోలో చోటుపట్ల తేదేపా శ్రేణుల్లో హార్షం



**పాలకొల్లు, ఏప్రిల్ 16,మనం ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక కమిటీ టిడిపి, సీనియర్లు మరియు మేధావి వర్గం కమిటీ అయిన పోలిట్ బ్యూరో లో రాష్ట్ర జలవనర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కు మొట్టమొదటిసారిగా చోటుదక్కడంతో మంత్రి నిమ్మలకు రాష్ట్ర టీడీపీ పార్టీ లో ప్రత్యేక గుర్తింపు లభించినట్లు అయింది. ప్రస్తుతం సీనియర్లు జ్యోతుల నెహ్రూ, పితాని సత్యనారాయణ, మహమ్మద్ షరీఫ్, కొళ్ళు రవీంద్ర, వర్ల రామయ్య తదితరులు ఉన్నారు. గతంలో కాపు సామాజిక వర్గం నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మాజీ మంత్రి, ఎర్ర నారాయణస్వామి పోలిట్ బ్యూరో సభ్యునిగా ఉండేవారని అంతటి, సీనియర్ మేధావి వర్గంలో మళ్లీ కాపు సామాజిక వర్గంలో మంత్రి నిమ్మలకు చోటు దక్కిందని పలువురు అంటున్నారు. మంత్రి నిమ్మలకు పాలిట్ బ్యూరో సభ్యునిగా కమిటీలో నియామకం పట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజా సేవే పరమావధిగా అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు సేవ చేసుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ నిత్యం పార్టీ కోసం, ప్రజల కోసం చిత్తశుద్ధితో శ్రమిస్తున్న మంత్రి నిమ్మల కష్టానికి గుర్తింపుగానే పోలెట్ బ్యూరో సభ్యుని గా చోటు తగ్గిందని మరి కొందరు పార్టీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నారు. మంత్రి నిమ్మలకు పాలిటి బ్యూరో సభ్యునిగా చోటు దక్కడం పట్ల నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు

- నరసాపురం డీఎస్పీ ఎం. సుధాకర్



**పాలకొల్లు, ఏప్రిల్ 16,మనం ప్రతినిధి:** సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవు.అని నరసాపురం డీఎస్పీ ఎం. సుధాకర్ హెచ్చరించారు. ఈ నెల 13వ తేదీన నరసాపురం మండలం, సీతారాంపురం సౌత్ గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజీ వద్ద జరిగిన ర్యాలీని ఉద్దేశించి, కొందరు వ్యక్తులు ఇన్స్టాగ్రామ్లో అభ్యంతరకరమైన పోస్టులు మరియు వ్యాఖ్యలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. వర్గాల మధ్య వైషమ్యాలు పెంచే విధంగా ఉన్న ఈ చర్యలను తీవ్రంగా పరిగణిస్తూ, మొగల్తూరు పోలీస్ స్టేషన్లో Cr No. 70/2026 U/s 196(1)(a), R/w 3(5) BNS తో పాటు, SC, ST (POA) Act-2015 మరియు ఐఖీ అచ్టి-2000 లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పషం చేశారు.

అయితే, ఈ సున్నితమైన అంశాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాలలో వాస్తవాలను వక్రీకరిస్తూ, తప్పుడు సమాచారాన్ని మరియు అసత్య వార్తలను కావాలనే ప్రచారం చేస్తున్నట్లు గమనించాము. ఇటువంటి తప్పుడు ప్రచారాలు సమాజంలో అశాంతికి దారితీసే అవకాశం ఉన్నందున, సోషల్ మీడియా వినియోగదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము. ఎవరైనా ఈ ఘటనకు సంబంధించి నిర్ధారణ లేని వార్తలను షేర్ చేసినా, గ్రూపులలో ఫార్వర్డ్ చేసినా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టినా, వారిపై ఐటీ చట్టం మరియు కొత్త శిక్షా స్మృతి నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసు వారికి సహకరించి, సమాజంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని ఈ సందర్భంగా డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# నాలెడ్జ్ డే సందర్భంగా విద్యార్థినికి రు.48 వేల ఆర్థిక సహాయం



**పాలకొల్లు, ఏప్రిల్ 16,మనం ప్రతినిధి:** విద్యకు తోడుగా నిలిచిన జై భీమ్ యువసేన ఫౌండేషన్ (నాలెడ్జ్ డే) సందర్భంగా విద్య ప్రాధాన్యతను మరొక్కసారి గుర్తు చేస్తూ, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక హృదయాన్ని కదిలించే సేవా కార్యక్రమం చోటుచేసుకుంది. జై భీమ్ యువసేన ఫౌండేషన్, గమళ్ళపేట ఆధ్వర్యంలో, యలమంచిలి లంక గ్రామానికి చెందిన చెవ్వేటి ప్రణీత అనే బీఎస్సీ నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి రూ.48,000 ఆర్థిక సహాయం అందించారు.ప్రణీత కుటుంబ పరిస్థితులు అత్యంత విషమంగా ఉన్నాయి. ఆమె తండ్రి మూగ మరియు చెవిటి సమస్యలతో బాధపడుతూ, ఇటీవల తన భార్యను కోల్పోయాడు. ఈ నేపథ్యంలో, తన కుమార్తె విద్యను కొనసాగించడానికి అవసరమైన హాస్టల్ మరియు కాలేజీ ఫీజులు చెల్లించడం ఆయనకు భారంగా మారింది.

ఈ క్లిష్ట పరిస్థితిని గుర్తించిన ఫౌండేషన్, మానవతా దృక్పథంతో ముందుకు వచ్చింది. ,మొత్తం రూ.48 వేల రూపాయలను సమకూర్చడం విశేషం. ఈ సహాయం ద్వారా ప్రణీత తన చదువును నిరాటంకంగా కొనసాగించగలదని ఆశాభావం వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, గెడ్డం సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ, విద్య ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, సమాజాన్ని కూడా మార్చగల శక్తి. ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఏ విద్యార్థి చదువు ఆగకూడదు. అందుకే మేము ఈ సహాయం అందించాము అని తెలిపారు.

గౌరవ అధ్యక్షులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాయపూడి భవాని ప్రసాద్ మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం చేస్తే, ఎన్నో ప్రణీతల భవిష్యత్తు వెలుగొందుతుంది. ఇది ఒక చిన్న సహాయం అయినప్పటికీ, ఒక పెద్ద మార్పుకు నాంది అవుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మరియు సామాజిక సేవకులు పాల్గొన్నారు. రిటైర్డ్ ఇన్కమ్ టాక్స్ ఇన్స్పెక్టర్ తరపట్ల మదన్ మోహన్ రావు, వెటర్నరీ డాక్టర్ విష్ణు బాలాజీ, శిరగారపల్లి ఎంపీపీ స్కూల్ హెడ్మాస్టర్ విప్పర్తి రవిచంద్ర, ఎల్ఐసి ఏజెంట్ జల్లి నరసింహ మూర్తి, 104 డేటా ఆపరేటర్ వడ్డీ సురేష్ బాబు, డ్రైవర్ గంగులూరి సతీష్, ఎలక్ట్రికల్ ప్లంబింగ్ కాంట్రాక్టర్ బద్దే రవిచంద్ర నాని, విజయ ల్యాబ్ టెక్నీషియన్ శ్రీమతి సుమలత, చిలకపాటి స్వప్న తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యకు తోడుగా నిలబడితేనే సమాజం ముందుకు సాగుతుంది అనే సందేశాన్ని జై భీమ్ యువసేన ఫౌండేషన్ బలంగా చాటిచెప్పింది. ఒక విద్యార్థి చదువు ఆగకుండా నిలబెట్టడం అంటే, ఒక కుటుంబానికి ఆశ, ఒక సమాజానికి వెలుగు అందించినట్లే.అని పలువురు అంటున్నారు.

# ఫ్లిప్కార్ట్తో మహిళా విష్ మాస్టర్లు భాగం

**విజయవాడ:** భారతదేశవ్యాప్తంగా, ఫ్లిప్కార్ట్ వంటి ప్లాట్ఫారమ్లు నేతృత్వంలో ఈ-కామర్స్ పెరుగుదల కేవలం వినియోగాన్ని పెంచడమే కాకుండా, మార్కెట్ప్లేస్ ఆవిష్కరణలు మరియు విస్తృతశ్రేణి సరఫరా చైన్ పరిధి ద్వారా లెక్కలేనంత మంది విక్రయదారులకు జాతీయ మార్కెట్లను చేరుకోవడానికి వీలు కల్పించింది. ఇది ముఖ్యంగా సాంప్రదాయకంగా మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న రంగాలలో కొత్త ఉపాధి మార్గాలను తెరిచింది. ఉదాహరణకు, ఫ్లిప్కార్ట్ లాజిస్టిక్స్ మరియు లాస్ట్ మైల్ డెలివరీలో ఇప్పుడు మహిళలు ఆత్మవిశ్వాసంతో, ఒక లక్ష్యంతో అడుగుపెట్టడాన్ని ఎక్కువగా చూస్తున్నాము. ఫ్లిప్కార్ట్ వద్ద, మహిళలు విష్మాస్టర్ నెట్వర్క్లో ఒక ముఖ్యమైన భాగంగా ఉన్నారు. ప్రతిరోజూ లక్షలాది ప్యాకేజీలు ఫ్లిప్కార్ట్ కస్టమర్లకు చేరేలా వీరు చూసుకుంటున్నారు. ఇది మా కార్యాచరణ లోతు, స్థిరత్వం మరియు దీర్ఘకాలిక సామర్థ్యానికి నిదర్శనం. ప్రతి డెలివరీ వెనుక స్థిరత్వం, ఆశయం మరియు మెరుగైన జీవితాన్ని నిర్మించుకోవాలనే కోరికతో కూడిన ఒక వ్యక్తిగత కథ ఉంటుంది. బిల్కిష్ అన్సారి, నాగురు మాధవి మరియు షాహిదా పి వంటి మహిళలకు, విష్మాస్టర్గా మారడం కేవలం వృత్తిపరమైన ఎదుగుదలను తీసుకురావడమే కాకుండా, ఆర్థిక స్థిరత్వం ద్వారా వారి కుటుంబాల భవిష్యత్తును కూడా మార్చివేసింది. అవకాశాల లభ్యత క్షేత్రస్థాయిలో ఎంతటి అర్థవంతమైన మార్పును తీసుకురాగలదో వారి అనుభవాలు వివరిస్తాయి. జోధ్పూర్ కు చెందిన బిల్కిష్ అన్సారీ, తిరుపతిలో, మాధవి నాగురు కొచ్చిలో నిబద్ధతతో షాహిదా సాధించిన ప్రగతి ఇలా పలువురు మహిళలు ఫ్లిప్కార్ట్ విష్ మాస్టర్లుగా రాణిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

## సంక్షోభం కొనసాగితే
# విమానాలు రద్దే!..
### ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ



పారిస్, ఏప్రిల్ 16 : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు చేస్తున్న యుద్ధం కారణంగా అనేక దేశాలు ఇంధన కొరత ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) కీలక వ్యాఖ్యలు చేసింది. ఐరోపా వద్ద జెట్ ఫ్యుయల్ మరో ఆరు వారాలకు సరిపడా మాత్రమే ఉందని తెలిపింది. చమురు సంక్షోభం ఇలాగే కొనసాగితే.. విమాన సర్వీసులు రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించింది. హర్మూజ్ జలసంధి మార్గంలో ఇంధనం, గ్యాస్‌తోపాటు కీలక సరఫరా వ్యవస్థలకు ఆటంకం ఏర్పడటం వల్ల ఎన్నడూ చూడని ఇంధన సంక్షోభం ఏర్పడిందని ఐఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాతిహ్ బిరోల్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయన్నారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణానికి అంత ఎక్కువ నష్టం వాటిల్లుతుందన్నారు. దీని ప్రభావం వల్ల పెట్రోల్, గ్యాస్, విద్యుత్ ధరలు పెరుగుతాయన్నారు.

## అమెరికాలో మాస్టర్స్‌కు
# హెచ్-1బీలో పెద్దపీట?




వాషింగ్టన్, ఏప్రిల్ 16 : అమెరికాలో విదేశీ ఉద్యోగుల నియామక ప్రక్రియను కఠినతరం చేయాలని ప్రతిపాదించిన ట్రంప్ సర్కారు దానిపై ప్రజాభిప్రాయం తెలుసుకుంటోంది. హెచ్-1బీ వీసాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, తమ కార్మికుల వేతనాలను కాపాడటానికి 'అమెరికా కార్మిక శాఖ (డీఓఎల్)' మార్చి 27న సరికొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జూన్ 30లోపు దాఖలయ్యే పిటిషన్లపై దీని ప్రభావం పడదని భావిస్తున్నారు. వీటిపై ప్రజాభిప్రాయాన్ని తెలిపేందుకు 60 రోజుల గడువునిచ్చింది. మార్పులు ప్రధానంగా వేతనాలు, అర్హతలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం హెచ్-1బీ వీసాపై ఉన్నవారు గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి చట్టబద్ధంగా అనుమతి ఉంది. ట్రంప్ ప్రభుత్వం దీనిని మార్చాలని భావిస్తోంది. హెచ్-1బీ అనేది కేవలం తాత్కాలిక అవసరాల కోసం ఇచ్చే వీసా అని, దీనిని శాశ్వత నివాసం పొందేందుకు వాడకూడదని ఈ ప్రతిపాదన స్పష్టం చేస్తోంది. అమెరికాలోని యూనివర్సిటీల్లో మాస్టర్స్ లేదా అంతకంటే ఎక్కువ చదువుకున్న విద్యార్థులకు వీసా కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఉంటుంది. విదేశీయులను నియమించుకునే ముందు, ఆ ఉద్యోగానికి తగిన అమెరికా అభ్యర్థి దొరకలేదని కంపెనీలు నిరూపించుకోవాలి. కంపెనీలు తక్కువ జీతానికి విదేశీయులను తీసుకోకుండా ఉండేందుకు, కనీస వేతనాన్ని 30% మేర పెంచాలని ప్రతిపాదించింది.

## డీలిమిటేషన్ బిల్లు..
# కాపీని తగలబెట్టిన స్టాలిన్



చెన్నై, ఏప్రిల్ 16 : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుపై ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. నేడు లోక్‌సభలో దీన్ని ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బిల్లు కాపీని తగలబెట్టారు. ఈ క్రమంలో దీన్ని 'బ్లాక్ బిల్'గా అభివర్ణించారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా స్టాలిన్ గురువారం నామక్కల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా నల్ల దుస్తులు ధరించి తన నిరసనను తెలిపారు. నల్ల జెండాను ఎగరవేసి.. బిల్లు కాపీని తగలబెట్టారు. అనంతరం 'కలిసి పోరాడదాం.. గెలుద్దాం' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోను స్టాలిన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రతిఘటన జ్వాలలు తమిళనాడు అంతా వ్యాపించాలని, ఇవి బీజేపీ అహంకారాన్ని అణచివేయాలంటూ ఆయన పోస్టులో రాసుకొచ్చారు. 1960లో తమిళనాడులో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం గురించి ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'గతంలో తమిళనాడులో హిందీకి వ్యతిరేకంగా చేపట్టిన ప్రతిఘటన జ్వాల ఢిల్లీని దహించివేసింది. ఢిల్లీ దిగొచ్చిన తర్వాతే పరిస్థితి శాంతించింది. ఈ బ్లాక్ బిల్లు (డీలిమిటేషన్ను ఉద్దేశిస్తూ) సొంతగడ్డ పైనే తమిళులను శరణార్థులుగా మార్చాలని చూస్తుంది. నేడు ఈ బిల్లు బీజేపీఅహంకారాన్ని అణచివేస్తాయి' అని స్టాలిన్ అన్నారు.

## లష్కరే కోఫౌండర్
# ఆమిర్ హమ్జాపై కాల్పులు



లాహోర్, ఏప్రిల్ 16 : లష్కరే తోయిబా సహ వ్యవస్థాకుడు ఆమిర్ హమ్జాపై గుర్తుతెలియని సాయుధులు కాల్పులు జరిపారు. పాకిస్థాన్ నగరం లాహోర్‌లోని ఓ న్యూస్ ఛానల్ ఆఫీస్ బయట ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కొన్ని నెలల క్రితం కూడా హమ్జాపై కాల్పులు జరిగాయి. ఆ తర్వాత పాక్ ప్రభుత్వం అతడికి భద్రత పెంచినట్లు వార్తలు వచ్చాయి. అఫ్ఘనిస్థాన్‌లో తొలుత సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా పోరాడిన హమ్జా ఆ తర్వాత హఫీజ్ సయీద్ తదితరులతో కలిసి లష్కరేను ఏర్పాటుచేశారు. భారత్‌లో జరిగిన ఉగ్ర కార్యకలాపాల్లో అతడి పాత్రపై ఆరోపణలు ఉన్నాయి. హఫీజ్ సయీద్, ఆమిర్ హమ్జాలను ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ప్రపంచ ఉగ్రవాదులుగా ప్రకటించింది. లష్కరేకు నిధులు అందే మార్గాలపై పాక్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంతో కొంతకాలం ఆ గ్రూప్‌నకు దూరం జరిగాడు. తర్వాత జైషే మన్ఖాపా అనే సంస్థను స్థాపించి, లష్కరే కోసం నిధులు సేకరించడం మొదలుపెట్టాడు. అలా వచ్చిన డబ్బును జమ్మూకశ్మీర్ వంటి ప్రాంతాల్లో ఉగ్ర కార్యకలాపాలకు ఉయోగించారన్న ఆరోపణలు ఉన్నాయి.


## 500 మందిని ట్రాప్ చేసి...
# రూ.కోట్లు దోచుకొని!



ఢిల్లీ, ఏప్రిల్ 16 : డాక్టర్, లాయర్, సినీ ప్రొడ్యూసర్, మోడల్, బిజినెస్‌మెన్.. ఒక్కటేమిటి.. అమ్మాయిలను మభ్యపెట్టేందుకు దాదాపు అన్ని రంగాల్లో నిపుణుడిగా అవతారాలు ఎత్తాడు. బాధితులను ట్రాప్ చేసేందుకు సోషల్ మీడియా లేదా డేటింగ్ యాప్‌లలో తప్పుడు ప్రొఫైళ్లు సృష్టించడం, కట్టుకథలు చెప్పడం, పెళ్లి చేసుకుంటానని నమ్మించడం.. ఒక్కో అమ్మాయికి ఒక్కో కహానీ చెప్పేవాడు. ఇలా పదులు కాదు.. ఏకంగా వందల సంఖ్యలో మహిళలను నమ్మించి అందినకాడికి దండుకున్నాడు. ఢిల్లీ పోలీసుల నిఘాతో ఎట్టకేలకు చిక్కిన ఈ కేటుగాడు.. దాదాపు రూ.2కోట్లకుపైగా దోచుకున్నట్లు అంచనా. డేటింగ్, మ్యాట్రిమోనియల్ సైట్లను లక్ష్యంగా చేసుకొని మహిళలపై రొమాంటిక్ మోసాలు, హనీ ట్రాపింగ్, ఆన్‌లైన్ బ్లాక్మెయిలింగ్‌లకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై ఆనంద్ కుమార్ అనే (35) యువకుడిని ఢిల్లీ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. దర్యాప్తు చేపట్టిన అధికారులకు ఊహించని విషయాలు తెలిశాయి. అమాయకపు అమ్మాయిలే లక్ష్యంగా ఆన్‌లైన్‌లో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి.. తానో ప్రొఫెషనల్‌గా పరిచయం చేసుకునేవాడు. రొమాంటిక్‌గా మాట్లాడుతూ.. వారితో సాన్నిహిత్యం పెంచుకునేవాడు.

వారిలో నమ్మకం కలిగిన తర్వాత ఏదో ఒక కారణం (అత్యవసర వైద్యం అవసరమైందని, వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, కుటుంబం ఇబ్బందుల్లో ఉందని) చెప్పేవాడు. కొందర్ని పెళ్లి చేసుకుంటానని, మరికొందరికి మోడలింగ్‌లో అవకాశాలు కల్పిస్తానని.. ఇలా అనేక కట్టుకథలు చెప్పి వారి నుంచి నగదు కాజేసేవాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగానే.. వారితో కమ్యూనికేషన్ కట్ చేసేవాడు. కేవలం డబ్బులే కాకుండా.. ఇతడితో గతంలో షేర్ చేసుకున్న ప్రైవేటు కంటెంట్‌ను చూపించి బెదిరింపులకు పాల్పడేవాడు. ఈ వ్యవస్థీకృత నెట్‌వర్క్ కోసం అనేక మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు వాడేవాడు. దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా నిందితుడు ఎంతో జాగ్రతగా ఈ వ్యవహారాన్ని నడిపించినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్లో అదుపులోకి తీసుకున్నామని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు ఆయా రాష్ట్రాలకు చెందిన 500 మందికిపైగా మహిళలను మోసగించి.. రూ.2కోట్లు దోచుకున్నట్లు గుర్తించామన్నారు. నిందితుడిపై ఢిల్లీ, గాజియాబాద్‌లలో ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు.

## సౌదీ ఇచ్చింది.. యూఏఈ
# చెల్లించమంటోంది
### పాక్ ప్రధాని ఆందోళన



ఇస్లామాబాద్, ఏప్రిల్ 16 : పాకిస్థాన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సౌదీ అరేబియా నుంచి 2 బిలియన్ డాలర్లు వచ్చాయన్న ఆనందం కన్నా.. యూఏఈకి ఈ నెలలో అప్పు తిరిగి తీర్చాలన్న ఆలోచన దానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. దీంతో పాకిస్థాన్ ప్రధాని ఆందోళనలో పడిపోయిరు. పాక్ ప్రస్తుతం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దాని విదేశీ మారక నిల్వలు కూడా క్షీణిస్తున్నాయి. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు 3 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేసేందుకు సౌదీ ముందుకొచ్చింది. అందులోభాగంగా సౌదీ ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి ఆ దేశానికి తాజాగా 2 బిలియన్ డాలర్లు అందాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ తాజాగా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. మరోవైపు.. పశ్చిమాసియా సంక్షోభంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న పాకిస్థాన్‌కు యూఏఈ షాకిచ్చింది. గతంలో ఇచ్చిన 3.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.32 వేల కోట్లు) రుణాన్ని తిరిగి చెల్లించాలని కోరింది. ఇప్పటి వరకు యూఏఈ వద్ద తాము అప్పుగా తీసుకొన్న డబ్బు తిరిగి చెల్లిస్తామని పాక్ వెల్లడించింది. మార్చి 27 నాటికి పాక్ వద్ద 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. తాజాగా సౌదీ నుంచి వచ్చిన ఆర్థిక సాయంతో ఈ నెలాఖరులోగా యూఏఈకి చెల్లించాల్సిన మొత్తాన్ని దాయాది దేశం తిరిగి చెల్లించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నారు. బుధవారం క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌ను కలిసి పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు.

## పెళ్లికి సవర బంగారం, రైతులకు రుణ మాఫీ..
### టీవీకే అధినేత విజయ్ మ్యానిఫెస్టో



చెన్నై , ఏప్రిల్ 16 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టీవీకే అధినేత, నటుడు విజయ్ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే.. 60ఏళ్ల లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం, పేద అమ్మాయిల వివాహాలకు సవర (ఎనిమిది గ్రాముల బంగారం), నాణ్యమైన పట్టు చీర కానుకగా ఇస్తామని హామీ ఇచ్చారు. స్వయం సహాయక బృందాలకు రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో డ్రాప్‌ఔట్లను నిర్మూలించేందుకు విద్యార్థుల తల్లులకు ఏడాదికి రూ.15000 ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రైతులపైనా విజయ్ వరాల హామీలు కురిపించారు. ఐదు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న రైతుల వ్యవసాయ రుణాల మాఫీ.. ఐదు ఎకరాల కన్నా ఎక్కువ ఉన్నవారికి 50శాతం మాఫీ.. కనీస మద్దతు ధర వరికి క్వింటాలుకు రూ.3500, చెరకుకు రూ.4500.. కుటుంబానికి ఏడాదికి ఆరు ఉచితంగా సిలిండర్లు..ఏఐ మంత్రిత్వశాఖ, ఏఐ యూనివర్సిటీ, ఏఐ సిటీ ఏర్పాటు.. పట్టభద్రులైన నిరుద్యోగులకు నెలకు రూ.4వేల ఆర్థిక సాయం.. కొత్తగా ఐదు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు..వృద్ధులు, దివ్యాంగులకు రూ.3వేల పింఛను.. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు..కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్య బీమా వంటి తదితర హామీలను ప్రకటించారు.

## ఆకాశ విమానాన్ని..
# ఢీకొన్న స్పైస్‌జెట్



ఢిల్లీ, ఏప్రిల్ 16 : దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్టులో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. రన్‌వేపై ఆగి ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని స్పైస్‌జెట్ విమానం పక్కనుంచి ఢీకొట్టింది. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు ఆకాశ ఎయిర్ విమానం రన్‌వేపై ఉంది. అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ విమానం.. ఆకాశ విమానాన్ని పక్కనుంచి తాకుతూ వెళ్లింది. ఈ ప్రమాదంలో స్పైస్‌జెట్ కుడివైపు రెక్క భాగం ధ్వంసమవ్వగా.. ఆకాశ ఎయిర్ విమానం ఎడమవైపు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రమాదంపై ఆకాశ ఎయిర్ అధికార ప్రతినిధి స్పందించారు. ''ఈ ఘటనతో ప్రయాణికులు, సిబ్బందిని వెంటనే విమానం నుంచి కిందకు దింపాం. వారి భద్రత మా ప్రథమ ప్రాధాన్యం. ప్రయాణికులను హైదరాబాద్ పంపించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం'' అని వెల్లడించారు. అటు స్పైస్‌జెట్ కూడా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎయిర్పోర్టు అధికారులు వెల్లడించారు.

# పంజాబ్లో ఉగ్ర కుట్ర భగ్నం..
## పాక్తో సంబంధం ఉన్న వ్యక్తి అరెస్టు



చండీగఢ్, ఏప్రిల్ 16 : పంజాబ్ పోలీసులు తాజాగా ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్న ఓ నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి 4 గ్రనేడ్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

అమృత్ సర్, మొహాలీలో స్టేట్ స్పెషల్ సెల్‌తో కలిసి కౌంటర్ వింగ్ ఆఫ్ పంజాబ్ పోలీసులు జాయింట్ ఆపరేషన్‌ను నిర్వహించారు. నిందితుడి వద్ద నుంచి 4 గ్రనేడ్లతో పాటు రెండు విదేశీ తుపాకులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పాక్ హ్యాండ్లర్లతో సంబంధం ఉన్న నిందితుడు వారి ఆదేశాల మేరకు ఉగ్ర కుట్రకు ప్రణాళిక రచిస్తున్నట్టు దర్యాప్తులో తేలింది. ఇటీవల చండీగఢ్‌లో జరిగిన గ్రనేడ్ దాడికి, ఈ నిందితుడికి సంబంధం ఉన్నట్టు గుర్తించామని పోలీసులు తెలిపారు. అమృతసర్‌లోని స్టేట్ స్పెషల్ ఆపరేషన్ సెల్లో కేసు నమోదైంది. నిందితుడికి ఇంకెవరితో అయినా సంబంధాలు ఉన్నాయా? అని గుర్తించేందుకు తదుపరి విచారణ చేపట్టినట్టు పోలీసులు పేర్కొన్నారు.

# ఇరాన్ చమురుపై మళ్లీ ఆంక్షలు
## పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేసిన ఇరాన్




వాషింగ్టన్, ఏప్రిల్ 16 : పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఈ క్రమంలో ఇరాన్ చమురుపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ.. అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. టెహ్రాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఆంక్షలను ప్రకటించారు. ఇరాన్, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా సడలించిన సంగతి తెలిసిందే. ఈ సడలింపును పొడిగించేది లేదని తాజాగా బెసెంట్ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే ఇరాన్ చమురు ఎగుమతులతో సంబంధాలు ఉన్న అనేకమంది వ్యక్తులు, చమురు సంస్థలు, నౌకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రెజరీ శాఖకు చెందిన విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం ప్రకటించింది. ఆంక్షలకు గురైన సంస్థలు.. ఇరాన్ మాజీ సుప్రీం నేత అయతుల్లా అలీఖమేనీ రాజకీయ సలహాదారుడి కుమారుడు మహమ్మద్ హుస్సేన్ షమ్ఖానీ నేతృత్వంలోనివని తెలిపింది. ఫిబ్రవరిలో అమెరికా- ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అలీ ఖమేనీ సలహాదారుడు ప్రాణాలు కోల్పోయారు. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకల రాకపోకలను అమెరికా దిగ్బంధిస్తోన్న సంగతి తెలిసిందే. ఇది ఇరాన్‌పై ఆర్థికంగా తీవ్ర ఒత్తిడి కలిగించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ దేశ చమురుపై మరిన్ని ఆంక్షలు విధించడం గమనార్హం. ఇక, ఇరాన్ ఆర్థిక లావాదేవీలకు చైనా బ్యాంకులు సహకరించినట్లు తెలిస్తే వాటిపై ఆంక్షలు విధించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బెసెంట్ హెచ్చరించారు.

### పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేసిన ఇరాన్

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అన్ని పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఇరాన్‌కు చెందిన జాతీయ పెట్రోకెమికల్ కంపెనీ పేర్కొంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు, శత్రు దాడుల వల్ల కలిగిన నష్టాల నేపథ్యంలో దేశీయ పరిశ్రమలకు, వినియోగదారులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఎగుమతి అయి.. ఇంకా విదేశాలకు చేరని సరకును కూడా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా కంపెనీలకు సూచించింది.

## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య
# కాల్పుల విరమణ ఒప్పందం
### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్, ఏప్రిల్ 16: ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ వెల్లడించారు. శాంతిని నెలకొల్పడంలో భాగంగా 10 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు చెప్పారు. ఈ శాంతి చర్చల కోసం ఇజ్రాయెల్, లెబనాన్లతో కలిసి పనిచేసే బాధ్యతను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలకు అప్పగించానని అన్నారు.

అయితే, ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల ప్రతినిధులు 34ఏళ్ల తర్వాత వాషింగ్టన్లో తొలిసారి భేటీ అయ్యారని డొనాల్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ క్రమంలో లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులతో మాట్లాడానని ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది యుద్ధాలు ఆపడం తనకు దక్కిన గౌరవమని.. ఇది పదోది కాబోతోందంటూ ట్రంప్ స్వయంగా ప్రకటించుకోవడం గమనార్హం.

# మహిళా ఉద్యోగులే టార్గెట్..
## టీసీఎస్ నాసిక్ కేసులో కొత్త విషయం



నాసిక్, ఏప్రిల్ 16 : టీసీఎస్ నాసిక్ క్యాంపస్ వ్యవహారంలో ఒక్కో విషయం వెలుగులోకి వస్తోంది. లైంగిక వేధింపులు, మత మార్పిడులకు యత్నాలు, పని ప్రదేశంలో దుష్ప్రవర్తన వంటి ఆరోపణలపై తొమ్మిది ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. మహిళా ఉద్యోగులే లక్ష్యంగా వ్యవస్థీకృత ముఠాగా ఏర్పడి ఏడుగురు పురుష ఉద్యోగులు పనిచేసినట్లు నాసిక్ పోలీసులు వెల్లడించారు. అలాగే ఈ కేసులో ఇద్దరు మహిళలు కూడా నిందితులుగా ఉన్నారు. అందులో ఒకరు పరారీలో ఉండగా హెచ్‌ఆర్ హెడ్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ హెచ్‌ఆర్ ఉద్యోగినుల నోరు మూయించేందుకు యత్నించేవారని నాసిక్ కమిషనర్ సందీప్ కార్నిక్ వెల్లడించారు. బాధితులు ఫిర్యాదు చేయకుండా, చేస్తే ఇలాంటి పరిస్థితులు ఎదురుకావొచ్చంటూ నిందితుల పక్షం నిలిచేవారని పేర్కొన్నారు. మొత్తం 9 మంది నిందితుల్లో కొందరు టీమ్ లీడర్ల స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారని, తమ సహోద్యోగులను వేధించేందుకు ఆ హోదాను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయని తెలిపారు.

అలాగే మతపరంగా తనను ఇబ్బందిపెట్టారని, తన భార్య గురించి అభ్యంతరకరంగా మాట్లాడారంటూ ఓ పురుష ఉద్యోగి జాతీయ మీడియాతో మాట్లాడుతూ వాపోయారు. అతడు చేసిన ఫిర్యాదుతో కలిపే తొమ్మిది ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. నిందితులకు అతివాద భావజాల గ్రూపులతో సంబంధాలు ఉన్నాయంటూ ఊహాగానాలు వస్తున్నాయి. వాటిపై కమిషనర్ స్పందిస్తూ.. దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఆధారాలు లభించిన తర్వాత ఈ కేసు ఓ కొలిక్కి వస్తుందని చెప్పారు.

నాసిక్ క్యాంపస్‌లో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి తన సహోద్యోగిపై ఫిర్యాదు చేశారు. పెళ్లి పేరుతో తనను మోసగించినట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేసే క్రమంలో మరో ఏడుగురు మహిళలు ముందుకొచ్చి తమపై జరిగిన వేధింపుల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2022 ఫిబ్రవరి నుంచి 2026 మధ్య పని ప్రదేశంలో వీరు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సదరు మహిళా ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ ఘటనను టీసీఎస్ తీవ్రంగా పరిగణించింది. నాసిక్ బీపీవో సంస్థ లో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఇంటినుంచే పని చేయాలని గురువారం ఉద్యోగులకు సూచించింది.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

- మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక మండల సభ
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్




**సూర్యాపేట, ఏప్రిల్ 16 (మనం ప్రతినిధి):** ప్రజల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మునగాల మండల కేంద్రంలోని రైతు వేదిక లో ఏర్పాటు చేసిన మండల సభలో జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలను అధికారులు గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామ సభలలో ప్రజా సమస్యలపై అందరూ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమం అందరికి చేరడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గ్రామ, మండల వ్యవస్థ బలోపేతం అయ్యి వేగవంతంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు.సమస్య లేని గ్రామాలు ఉండవని, సమస్యను గుర్తించి సత్వరమే సమస్యకు పరిష్కారం ఏ విధంగా జరుగుతుందో ఆలోచన చేసి వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన అందరికి చేరాలని, చాలా మందికి ప్రభుత్వ పథకాలపై అవగాహన లేదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.200కోట్లతో యాంగ్ ఇండియా స్కూళ్లను నిర్మిస్తుందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్ వివరించారు.మహాలక్ష్మి, గృహ జ్యోతి రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను మండల ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం - ఇంటర్మీడియట్, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వివిధ పథకాల లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై తల్లిదండ్రులు ఆజాగ్రత్తగా ఉండడం వల్ల చాలా మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. రోడ్డు నియమాల గురించి రోడ్లపై పాటించాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులు ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేయాలని హెల్మెట్ వాడడం సిట్ బెల్ట్ ధరించడం గురించి వివరించాలని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదు అనే విషయం గురించి తల్లిదండ్రులకు లేఖల ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరిస్తామని సీట్ బెల్ట్ పెట్టుకుంటామని మద్యం తాగి వాహనాలు నడపమని తల్లిదండ్రుల నుండి పిల్లలు ప్రామిస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి.శిరీష, తహసిల్దార్ సరిత ఎంపీడీవో రమేష్ సర్పంచ్ ప్రమీల ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

# మట్టయ్య మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

- సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు

**పెన్ పహాడ్, ఏప్రిల్ 16 (మనం న్యూస్):** గ్రామపంచాయతీ కార్మికుడు ఒగ్గు మట్టయ్య మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు గురువారం మండల కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు ఒగ్గు మట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మట్టయ్య దిశ దినకర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలు వేస్తూ మాట్లాడుతూ మట్టయ్య పెన్ పహాడ్ గ్రామపంచాయతీలో సుమారు 20 సంవత్సరాల నుండి పనిచేస్తూ కార్మికుల సమస్యల పైన సిఐటియు పిలుపులో భాగాగా అనేకమైన పోరాటాల్లో పాల్గొని వారని తెలిపారు కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనికి తగ్గిన వేతనం ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయని సాలిచాలని వేతనాలతో కుటుంబ భారం మీద పడి కార్మిక వర్గం ఆందోళనకు గురవుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వాలు కార్మికులకు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కనీస వేతనాలు, ఆరోగ్య భీమా అందే విధంగా పనిచేయాలని వారికి ఉద్యోగ భద్రత ఇన్సూరెన్స్ సౌకర్యం మృతిచెందిన వారి స్థానంలో కుటుంబానికి ఉద్యోగం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అనంతరం మట్టయ్య కుటుంబానికి గ్రామపంచాయతీ కార్మికుల తరపున రూ.12 వేలు,కింట బియ్యం ఆర్థిక సాయం అందించడం జరిగింది ఈ



కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగకృష్ణ, గ్రామపంచాయతీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీనివాసు, నకరికంటి నరసయ్య, సత్యం, సిలువేరు సైదులు,రేణుక, ఎల్లమ్మ,వీరస్వామి, వెంకన్న, రమేష్,నాగరాజు, దూదియా, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల సభ ఏర్పాటు



**కోదాడ, ఏప్రిల్ 16(మనం న్యూస్):** 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కోదాడ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతుఋణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను మండల ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం. ఈ నేపథ్యంలో వివిధ పథకాల లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల తమ సమస్యలు పరిష్కారమవుతున్నాయని సంతోషాన్ని పంచుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా అడిగి తెలుసు కున్నారు. అనంతరం మండల ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని... ప్రతీ గడపకి అందించేందుకు.. జిల్లా యంత్రంగం కృషి చేస్తుందన్నారు. మండల సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ వాజిద్ అలీ, ఎంపీడీవో హుస్సేన్, ఏఈ హౌసింగ్ జేఎస్ఎన్ మూర్తి, ఎంపిఓ రాంబాబు, ఏవో రజని, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల సమావేశం

**తిరుమలగిరి, ఏప్రిల్ 16 (మనం న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలపై మండల స్థాయి సమావేశం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ బి.లాజర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. నియోజక స్థాయి ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య , మండల ప్రత్యేక అధికారి తుంగతుర్తి వ్యవసాయ డైరెక్టర్ ఎల్.రమేష్ సార్, తిరుమలగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ శ్రీమతి ఎల్సోజు చామంతి నరేష్, తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్, ఎస్ఐ జి.వెంకట్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశంలో ప్రవేశ పెట్టారు. ఈ సమావేశంలో తాటిపాముల సర్పంచ్ బోయపెల్లి కిషన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, కరెంటు సమస్యలు, త్రాగునీరు, గ్రామంలో ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ కోసం జరుగుతున్న ప్రచారాలను నివారించాలచెప్పారు.గుండెపురి సర్పంచ్ కొమ్ము సోమన్నమాట్లాడుతూ కరెంట్ సమస్యలు ఉందని చెప్పారు. కోక్య నాయక్ తండ సర్పంచ్ ప్రేమకుమార్, చింతలకుంట తండ సర్పంచ్ సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్ల పై వారి సమస్యను సభ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి శాంతయ్య, వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రావు, ఆరోగ్య అధికారి డాక్టర్ వందన , హౌసింగ్ ఏఈ మౌనిక, మిషన్ భగీరథ డిఈ జూన్ ఫైడ్, ఏఈ మహేష్, ఎలక్ట్రిసిటీ ఏఈ గిరిబాబు, ఏపీఎం లక్ష్మి అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# చర్చి నిర్మాణ పనులు పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**చింతలపాలెం, ఏప్రిల్ 16 (మనం న్యూస్):** మండల పరిధిలోని చింతిరియాల ఆర్ అండ్ ఆర్ సెంటర్లో నిర్మిస్తున్న నూతన చర్చి పనులను జాయింట్ కలెక్టర్ కె సీతారామరావు ఈరోజు స్వయంగా పరిశీలించారు. చర్చి నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల మంజూరు కోసం దరఖాస్తు చేయగా వాటి ఆమోద ప్రక్రియలో భాగంగా ఈ పరిశీలన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు పురోగతి నాణ్యత పై కాంట్రాక్టులకు తగిన సూచనలు సలహాలు చేశారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తో పాటు చింతలపాలెం తాసిల్దార్ రామకృష్ణారెడ్డి, ఆర్ ఐ ఆత్రేయ, రెవెన్యూ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని శవం లభ్యం



**ములుగు, ఏప్రిల్ 16(మనంన్యూస్):** ములుగు మండలం కొత్తూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. గ్రామ శివారులో విజయలక్ష్మి క్రషర్ సమీపంలో పక్కన గల మట్టి రోడ్డు పైన ఒక గుర్తు తెలియని ఒక మగ శవం పడి ఉన్నదని అట్టి చనిపోయిన వ్యక్తి గత నాలుగు రోజులుగా కొత్తూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ కనిపించాడని అదే గ్రామానికి చెందిన నకిర్త రమేష్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు పరిచి పరిశోధన ప్రారంభించినట్లు తెలిపారు. గుర్తుపట్టుటకు ఆనవాళ్లు ఆకుపచ్చ రంగు షర్టు లైట్ బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు అందదా ఎత్తు 5'5'' వయసు అందదా వయసు 25 నుండి 35 సంవత్సరాల మధ్యలో కలిగి ఉంటాడు. ఇట్టి శవం గురించి ఎవరికైనా ఏమైనా సమాచారం అందితే ములుగు ఎస్ఐ 8712667338, పీస్ ములుగు: 8712667461లను సంప్రదించాలన్నారు.

# కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా వైద్యాధికారి డా. రజిత

**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 16(మనం ప్రతినిధి):** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అమలవుతున్న కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలను వైద్య అధికారులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మాతృ మరణాలు శిశు మరణాలను తగ్గించడానికి వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు: గర్భిణీ స్త్రీల వివరాలను సకాలంలో నమోదు చేసి, హై-రిస్క్ (ప్రమాదకర లక్షణాలు) ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక చికిత్స అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలని సూచించారు. 0-5 ఏళ్ల పిల్లలకు నిర్ణీత సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు, పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించాలన్నారు 15 ఏళ్లు నిండిన బాలికలందరికీ హెచ్.పి.వి టీకా అందించడం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. రక్తపోటు మధుమేహం పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.



**వడదెబ్బపై అప్రమత్తత**

రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రజిత సూచించారు. ఉదయం 10 గంటల లోపు లేదా సాయంత్రం 4 గంటల తర్వాతే పనులు చేసుకోవాలని కోరారు.అధికంగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని, వడదెబ్బ నివారణకు గాను ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ నాగేంద్రబాబు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సంపత్, డాక్టర్ రామకృష్ణ, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన



**కోదాడ, ఏప్రిల్ 16(మనం న్యూస్):** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక సిరి అపార్ట్మెంట్ నందు గ్యాస్ ఎల్పీజీ, గ్యాస్ ఫైర్ అయినప్పుడు ఏ విధంగా ఆర్పాలి అపార్ట్మెంట్ వాసులకు అగ్నిమాపక అధికారి డాక్టర్ కే బాబు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వంటగదిలో వంట గ్యాస్ లీక్ అయినప్పుడు దానిని ఎలా సేవ్ చేయాలి అనేది మహిళలు ముఖ్యంగా నేర్చుకోవాలని ఆయన అన్నారు. వంట గదిలో వంట చేస్తున్నప్పుడు గ్యాస్ లీకైతే వాసనను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది లీడింగ్ ఫైర్ ఫైటర్ ఎం శ్రీనివాసరావు గారు జి శ్రీనివాసరావు, ఫైర్ ఫైటర్ రవి, శ్రీనివాసు, మహిళలు, అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- హాజరైన అధికారులు, నాయకులు

**ములుగు,ఏప్రిల్ 16మనం ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యాచరణలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మండల సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి, డిపిఓ వెంకయ్య హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పాల్గొని ప్రజలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రస్తుత పథకాలు భవిష్యత్తులో ప్రవేశపెట్టబోయే నూతన పథకాలపై గ్రామస్థులకు సమగ్రంగా అవగాహన కల్పించడం జరిగిందని మండల ప్రత్యేక అధికారి వెంకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భద్రు, ఎంఆర్ఓ రవీందర్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఉమ్మడి సోమయ్య, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి ఎనయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వల్లేపల్లి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళికతో సమగ్ర మార్పు తీసుకురావాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- గ్రామ, మండల స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలు విజయవంతంగా అమలు
- స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేసి సమస్యల పరిష్కారం వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి
- సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలి
- కూసుమంచి మండల స్థాయి ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

**కూసుమంచి, ఏప్రిల్ 16(మనం బ్యూరో):** జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యచరణతో గ్రామాలలో సమగ్ర మార్పు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని విజయరామ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మండల స్థాయి ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6 నుండి ప్రతిష్టాత్మకంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలోని ప్రతి అంశాన్ని ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏప్రిల్ 2న గ్రామ స్థాయి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని, అదే విధంగా మండల కేంద్రాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఇటీవల గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్సాహంతో ఉన్నారని,



వారిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉన్న సమస్యలను స్థానిక నాయకత్వంతోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేసిందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి పరిష్కరించాలని, ముఖ్యంగా శానిటేషన్, వీధి దీపాల నిర్వహణ, మల్టీ పర్పస్ వర్కర్లకు సమయానికి వేతనాల చెల్లింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయగా, ఖమ్మం జిల్లాకు సుమారు 16 వేల 500 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో 2800 ఇళ్లు పూర్తయ్యాయని, 8200 ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తయ్యాయని, తొందరలోనే సుమారు 10 వేల ఇళ్లు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతాయని చెప్పారు. కూసుమంచి మండలంలో 690 ఇళ్లు మంజూరు కాగా, ఇంకా ప్రారంభం కాని 43 ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించేలా సర్పంచులు, స్థానిక నాయకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. కూసుమంచి మండలంలో కొత్త జూనియర్ కాలేజీ, 100 పడకల ఆసుపత్రి నిర్మాణాలకు పునాది పడిందని, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అదే విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు, 500 గ్యాస్ సిలిండర్, వడ్డీ లేని రుణాలు, క్వింటాల్కు 500 బోనస్, కల్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూసుమంచి మండలాన్ని ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమేష్, కూసుమంచి మండల ఇన్చార్జి ఎంపీడీవో రాజారావు, తహసీల్దార్ సైదులు, అగ్రికల్చర్ ఆఫీసర్ వాణి, హెచ్ ఓ అపర్ణ, ఎంఈఓ వీరస్వామి, ఐసిడిఎస్ ఉమా, వైద్యాధికారి డాక్టర్ సాయి, వెటర్నరీ డాక్టర్ నీలకంఠం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వజ్రమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన మాజీ వైస్ ఎంపీపీ



**నాగారం,ఏప్రిల్ 16,మనం న్యూస్:** నాగారం మండల కేంద్రానికి చెందిన సిద్దుల వజ్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని బిఆర్ఎస్ మాజీ వైస్ ఎంపీపీ గుంటకండ్ల మాణిమల మృతురాలి మనువడు శ్రీను కు 5000 రూ ఆర్థిక సహాయం చేశారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని చెప్పి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వంగూరి అంజి, చిప్పలపల్లి సోమయ్య,కూరం మణి వెంకన్న, సత్తయ్య, లింగమల్లు తదితరులు పాల్గొన్నారు.

# సమర్ధవంతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు

- **ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం**
- **దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాలు**
- **జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



**ములుగు, ఏప్రిల్ 16, మనం ప్రతినిధి:** ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని , పదవ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తుందని, దివ్యాంగుల విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు 99 రోజుల 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా, గురువారం మల్లంపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన 'మండల సభ' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు, పథకాల ప్రయోజనాల గురించి లబ్ధిదారులు స్వయంగా వారి మాటలలోనే అందరికీ తెలియజేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం విద్య, సామాజిక భద్రత, మహిళల ఆర్థిక అభివృద్ధి వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని నూతన సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతుందని స్పష్టం చేశారు. గతంలో కేవలం హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకే మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేవారని, ఇప్పుడు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు, ఉదయం పూట అల్పాహారం కూడా అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. దివ్యాంగులకు చేయూతను అందించాలనే లక్ష్యంతో ఇంటర్మీడియట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు, వారి సౌకర్యార్థం మోటరైజ్డ్ వాహనాలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' అనే నూతన పథకాన్ని ప్రవేశపెడుతుందని వెల్లడించారు. రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఇతర పంటల సాగు వైపు దృష్టి సారించాలని, దీనివల్ల ఎరువుల వినియోగం తగ్గి భూసారం పెరుగుతుందని వివరించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, రైతులు కూడా దీనిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా ఎకరానికి 40 వేల రూపాయల సబ్సిడీ అందిస్తుందని, ఒక్కసారి సాగు చేస్తే మొదటి దిగుబడి నుంచి 30 సంవత్సరాల వరకు స్థిరంగా, నికరంగా ఆదాయం వస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్య ఖాళీ స్థలంలో అంతర పంటలుగా పప్పు దినుసులను కూడా సేద్యం చేసుకోవచ్చని, దానికి కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని వివరించారు. ఇంచర్ల గ్రామ శివారులో ఎర్రి గట్టమ్మ వద్ద పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ దశలో ఉందని, దీని ద్వారా 300 మందికి ఉపాధి అవకాశాలు కలగడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సేద్యం చేసిన రైతులు స్థానికంగానే తమ పంటను విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. నూతన పథకాల ద్వారా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. మల్లంపల్లి మండలంలో నూతన మార్కెట్ యార్డ్, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం మరియు పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి ఆర్ డి ఓ కృపాకర్ , ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి , ఎంపీఓ, తాసిల్దార్, మండల స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణానికి కంటిచూపు ప్రమాణం



**ములుగు,ఏప్రిల్ 15మనం ప్రతినిధి :** సురక్షిత ప్రయాణానికి కంటి చూపు ప్రధానమని యస్ఐ టి.వి.ఆర్.సూరి, మంగపేట సెకండ్ యస్ఐ శ్రీకాంత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నిర్వహిస్తున్న అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో భాగంగా మంగపేట పోలీసుల ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్ డ్రైవర్లు, ఇతర వాహనదారులకు కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగపేట యస్ఐ టి.వి.ఆర్.సూరి, మంగపేట సెకండ్ యస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతీ పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక పరిణామాలకు దారి తీస్తుందని, కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి కూడా రోడ్డు భద్రతలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. కంటి చూపు సరిగా లేకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందుకే ఇలాంటి కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించడం ఎంతో అవసరమని తెలిపారు. డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని నిరంతరం పరీక్షించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమని,ముఖ్యంగా వాహనదారులు ప్రతి 6 నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారు కచ్చితంగా కళ్లజోళ్లు ఉపయోగించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. పోలీస్ శాఖ, ఆరోగ్యశాఖ సూచనలను పాటిస్తూ రోడ్డు భద్రతకు సహకరించాలని అరైవ్ - అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో సురక్షిత ప్రయాణంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అఖిల, తరుణ్, వైద్య సిబ్బంది, మంగపేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు .

## రాష్ట్ర సదస్సుకు భారీగా తరలి రావాలి



**మహాదేవపూర్, ఏప్రిల్ 16 (మనం న్యూస్):** ఈనెల 18వ తేదీ మర్రి చెన్నారెడ్డి భవన్ లో నిర్వహించబడే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు మహాదేవపూర్ మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్. గురువారం రోజు తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కై రాష్ట్ర రాజధానిలో, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఉద్యమకారుల హక్కులను సాధించుకొనుటకు, ప్రభుత్వం ఇచ్చిన మాటను అమలు పరచుటకు, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు కొరకు రాష్ట్రంలోని నలుమూలల నుండి ఉద్యమకారులు ఈ సదస్సుకు హాజరవుతున్న క్రమంలో మహాదేవపూర్ మండలం తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మరియు భూపాలపల్లి జిల్లా కు సంబంధించిన తెలంగాణ ఉద్యమకారులు, అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యమకారుల గలాన్ని భుక్తకంఠంతో వినిపించి, తమ హక్కులను సాధించుకొనుటకు, వేలాది సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొన్నారు, మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## మూడు సంవత్సరాలుగా లేని సుందరీ కరణ ఇప్పుడు ఎందుకు

- **రాజకీయాల కోసం అంబేద్కర్ పేరులు వాడుకుంటే సహించేది లేదు**
- **జాతీయ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు**



**మహాదేవపూర్, భూపాలపల్లి, ఏప్రిల్ 16 (మనం న్యూస్) :** అంబేద్కర్ భావజాలలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే సహించేది లేదని, అన్నారం క్రాస్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినప్పటి నుండి ఏనాడు కూడా పట్టించుకోని అంబేద్కర్ వాదులు, ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంబేద్కర్ పేరును రాజకీయంగా లబ్ధి పొందుటకు వారి జయంతి రోజు సుందరీకరణ పేరుతో కార్యక్రమాలను నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు జాతీయ అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు మెరుగు లక్ష్మణ్. గురువారం రోజు ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షునిగా ఒక ప్రకటన జారీ చేస్తూ,ఎన్నికల్లోలబ్ధిపొందుట కొరకే, అకస్మాత్తుగా సుందరీకరణ గుర్తుకొచ్చిందని, గతంలో మంథని నియోజకవర్గంలోని కాటారం మండల కేంద్రంలో బాబాసాహెబ్ విగ్రహాన్ని ఆవిష్కరణకు ముందే కొందరు అంబేద్కర్ వాదులు అంటూ విగ్రహం పై ఉన్న ముస్కుని తొలగించి గందరగోళ పరిస్థితిని సృష్టించిన సంఘటన ను లక్ష్మణ్ గుర్తు చేశారు. అంబేద్కర్ పేరుతో, రాజకీయ లబ్ధి కోసం అంబేద్కర్ వాదులమని, చెప్పుకుంటూ అంబేద్కర్ భావజాలాలకు విరుద్ధంగా, రాజకీయ లబ్ధి కోసం చేసిప్రయత్నాలనుదళితసంఘాలు ముక్తకంఠంతో అడ్డుకోవడం జరుగుతుందని తన ప్రకటనలో స్పష్టం చేశారు. సుందరీకరణ పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే లా వివరిస్తూ, దురదృష్టకరమైనటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత అధికారులకు ఉందని అన్నారు లక్ష్మణ్. కుల మతాలకు అతీతంగా దళిత సంఘాలతో పాటు ఇతర వర్గాలతో కలిసి, ఏప్రిల్ 14 మంగళవారం రోజు అత్యంత వైభవంగా ఐక్యతతో అంబేద్కర్ జయంతిని నిర్వహించుకోవడం జరిగిందని పేర్కొంటూ, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా వివరించే ఎవరైనా ఇలాంటి శక్తులకైనా మేము ఏకతాటిపై నిలిచిఅడ్డుకుంటామని అన్నారు.



## చర్ప భోజరావు కృషితోనే ఏటూరునాగారంకు బస్సు డిపో మంజూరు

- **టీడీపీ ములుగు నియోజకవర్గం ఇంచార్జ్ దారావత్ దేవ నాయక్ వెల్లడి**

**ములుగ, ఏప్రిల్ 16 మనంన్యూస్:** మాజీ ఎమ్మెల్యే ములుగు టైగర్ దివంగత నాయకుడు చర్ప భోజరావు కృషి తోనే 1996 లోనే ఏటూరునాగారం కు బస్సు డిపో మంజూరు చేసి నిర్మించారు అని కానీ అప్పుడు ఉన్న పరిస్థితి వల్ల వరంగల్ 2 బస్సు డిపో అని హన్మకొండ లో బస్సు డిపో ని నడిపించారు అని ములుగు నియోజకవర్గం లో బస్సు చూడని అనేక మారుమూల గ్రామాలకు కూడా బస్సు రవాణా సౌకర్యాలు కల్పించిన ప్రజలు మర్చిపోని గొప్ప నాయకుడు చర్ప భోజరావు అని ఆ తర్వాత ఎమ్మెల్యే గా అయినా వాళ్ళు చర్ప భోజరావు కు మంచి పేరు వస్తుంది అని బస్సు డిపో విషయం పట్టించుకోలేదు అని ఫోటో లకే పరిమితం అవుతున్నారు అని విమర్శలు సందించారు రాష్ట్రము లో బస్సు డిపో కూడా లేని జిల్లా గా ములుగు ఉంది అని ఇది నిజం గా సిగ్గు పడాల్సిన అని దేవా నాయక్ అన్నారు

## జాగ్రత్తలు తీసుకుందాం ప్రమాదాల భారినుండి రక్షించుకుందాం

- **ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాల్సిందే**
- **తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి పిలుపు**
- **జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకిలతో కలిసి హెల్మెట్ల పంపిణీ**
- **హెల్మెట్లు ఇస్తామని పిలిచి ఇవ్వలేదంటున్న ద్విచక్ర వాహనదారులు**



**బాలానగర్,ఏప్రిల్ 16( మనం న్యూస్):** ద్విచక్ర వాహనదారులతోపాటు నాలుగు చక్రాలను నడిపించే ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను, పోలీసు శాఖ జారీ చేసే జాగ్రత్తలను పాటించి తెలంగాణ రాష్ట్ర బీజేపీ శివధర్ రెడ్డి సూచించారు. గురువారం ఈమెరకు మహబూబ్నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని పెదయ్యపల్లి చౌరస్తాలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి జిల్లా ఎస్పీ జానకి తదితరులతో కలిసి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఎవరు కూడా రాంగ్ రూట్లో వెహికల్ ని తీసుకువెళ్లదని సూచించారు. వ్యతిరేక మార్గంలో ప్రయాణించి తన రూట్లో వచ్చే వ్యక్తి ఢీకొంటే రాంగ్ రూట్లో ప్రయాణించిన వ్యక్తిదే తప్పు అవుతుందని, ఆ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వాహనదారుడు మాత్రమే కాకుండా వెనకాల కూర్చున్న ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

**హెల్మెట్లు ఇస్తామని పిలిచారు.. ఇవ్వలేదంటున్న ద్విచక్ర వాహనదారులు**

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితో పాటు రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకి తదితరులు విచ్చేస్తున్న నేపథ్యంలో పలువురు ద్విచక్ర వాహనదారులను వివిధ గ్రామాల నుంచి పిలిపించారని పలువురు పేర్కొన్నారు. తమకు హెల్మెట్లను అందజేస్తామని చెప్పి తీరా బైక్ లను తీసుకొని రోడ్డు మీదకు వచ్చాక తమకు హెల్మెట్లు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందుకన్నా హెల్మెట్లు అందజేసిన ఉంటే చాలా బాగుండేదని వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## జాగృతి కళాశాల విద్యార్థులకు అభినందనలు వెల్లువ

- **రాష్ట్రస్థాయి ర్యాంకర్లను అభినందించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి**
- **చిన్నారెడ్డికి శాలువా కప్పి సన్మానించిన ప్రిన్సిపాల్ వినోద్.**

**వనపర్తి ఏప్రిల్ 16 (మనం ప్రతినిధి):** వనపర్తిలో ర్యాంకుల పంట పండిస్తున్న జాగృతి జూనియర్ కళాశాల విద్యార్థులకు పలువురి నుంచి అభినందనలు వెల్లువ కొనసాగుతోంది. రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు, ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన ఉజ్మా హజారా, అనుష్ట అనే విద్యార్థినిలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గురువారం కళాశాలకు చేరుకొని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. కార్పొరేట్ స్థాయిలో జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం వనపర్తికే గర్వకారణమని కొనియాడారు. ఆ తర్వాత ప్రిన్సిపాల్ వినోద్ తో పాటు అధ్యాపక బృందాన్ని అభినందించి కళాశాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల తరపున ప్రిన్సిపాల్ వినోద్ చిన్నారెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మాజీ డిసిసి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు చరణ్, భాస్కర్, బాబా పాల్గొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్ల కొరకు దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్స్ ప్రారంభం



- **ప్రిన్సిపల్ జన్ను విజయ్ కుమార్**

**మహాదేవపూర్ ఏప్రిల్ 18 (మనం న్యూస్):** మహాదేవపూర్ మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహాదేవపూర్ లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను దోస్త్ ద్వారా అడ్మిషన్లుప్రారంభమైనవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న , బీఏ, బీకాం.సిఎ, బీఎస్సీ బీ జెడ్ సి, బీఎస్సీ ఎంపీసీఎస్ లలో సీట్లు అందుబాటులో ఉన్నాయని డిగ్రీ కళాశాల పరిధిలో గల మహాదేవపూర్,పంకన,కాటారం ,మహాముత్తారం, మలహర్ రావు మండలాలకు సంబంధించిన విద్యార్థులు దోస్తు అడ్మిషన్లు ఆన్లైన్ ద్వారా పొందవచ్చునని, అదేవిధంగా కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధనా తరగతులు నిర్వహించబడుననీ, లైబ్రరీ సౌకర్యం కలదని అలాగే కళాశాలకు విశాలమైన ఆటస్థలం ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన అందించబడుతుందని ,డిగ్రీ ఆన్లైన్ అడ్మిషన్స్ నిర్వహణ కొరకు దోస్తు కోఆర్డినేటర్ వేముల రమేష్ ను సంప్రదించాలని, అడ్మిషన్లలో సమస్యలు నివారణకు దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్,డిగ్రీ కళాశాల మహాదేవ పూర్ నందుపరిష్కరించుకోవాలని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.


## పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు



**మంగపేట,ఏప్రిల్16, మనం ప్రతినిధి :** రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నిర్వహిస్తున్న అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో భాగంగా మంగపేట పోలీసుల ఆధ్వర్యంలో మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్ డ్రైవర్లు, ఇతర వాహనదారులకు కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగపేట యస్ఐ టి.వి.ఆర్.సూరి, మంగపేట సెకండ్ యస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతీ పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక పరిణామాలకు దారి తీస్తుందని, కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి కూడా రోడ్డు భద్రతలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. కంటి చూపు సరిగా లేకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందుకే ఇలాంటి కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించడం ఎంతో అవసరమని తెలిపారు. డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని నిరంతరం పరీక్షించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమని,ముఖ్యంగా వాహనదారులు ప్రతి 6 నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారు కచ్చితంగా కళ్లజోళ్లు ఉపయోగించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. పోలీస్ శాఖ, ఆరోగ్యశాఖ సూచనలను పాటిస్తూ రోడ్డు భద్రతకు సహకరించాలని అరైవ్ - అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో సురక్షిత ప్రయాణంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అఖిల, తరుణ్, వైద్య సిబ్బంది, మంగపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక





**మహాదేవపూర్ ఏప్రిల్ 16 మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా మండల స్థాయి గ్రామ సభ నిర్వహించడం జరిగింది.ఇట్టి మండల స్థాయి సమావేశమునకు ముఖ్యఅతిథిగాజయశంకర్ భూపాలపల్లి జిల్లాఅదనపు కలెక్టర్ విజయలక్ష్మి హాజరైనారు, గ్రామసభలో ప్రజలకు మరియు లబ్ధిదారంలకంప్రభంత్వంప్రతిష్టాత్మక ఆరుగ్యార0టీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. అంతేకాకుండా స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కార వార్గవఖలకైచర్చించడంజరిగింది. వివిధశాఖలఅధికారులు తమ యొక్క శాఖల ప్రభుత్వపథకాల వివరాలను తెలియజేయడం జరిగినదిరైతు భరోసా,ఇ0దిరమ్మ ఇల్లు మరియు ఇతర పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల యొక్క సంఖ్యను కూడా ప్రకటించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో నేతన్న భరోసా పథకం కింద మహాదేవపూర్ మండలంలోని 148 మంది చేనేత కార్మికుల లబ్ధిదారులకు నెలకు 2000 చొప్పున మూడు మాసములకు 372000/- ఆర్థిక సహాయం,అంతేకాకుండా17 లక్షల రూపాయలను చేనేత కార్మికులకు రుణమాఫీ కింద ఆర్థిక సహాయం మొత్తంగా 20 లక్షల 72 వేల రూపాయలకు చెక్కును చేనేత కార్మికుల స0ఘమునకు భూపాలపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మిచేతుల మీదుగా అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మహాదేవపూర్ మండల ప్రత్యేక అధికారి కిరణ్ ఎంపీడీవో రవీంద్రనాథ్, డిప్యూటీ తహసిల్దార్ యూసుఫ్, భూపాలపల్లిజిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటరాజుబాపు మహాదేవపూర్ సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్,మాజీ ఎంపీపీ రాణిబాయిరామారావు, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు,గ్రామైక్య సంఘాలు, వివిధ పథకాల లబ్ధిదారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తోపాటు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




Sports మనం Cinema






# ఐపీఎల్ చరిత్రలో అరుదైన దృశ్యం..

ఐపీఎల్ 2026 సీజన్ లో ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య మ్యాచ్ లో అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. టాస్ గెలిచిన పంజాబ్ ముంబైని బ్యాటింగ్ కు ఆహ్వానించింది. ఈ మ్యాచ్ కు రోహిత్ శర్మ దూరం కావడంతో అతడి స్థానంలో క్వింటన్ డికాక్ జట్టులోకి వచ్చాడు. డికాక్ తో కలిసి రియాల్ రికెల్ టన్ ముంబై ఇన్నింగ్స్ ను ఆరంభించాడు.

గమనించాల్సిన అంశం ఏంటంటే ఈ ఇద్దరు సౌతాఫ్రికాకు చెందిన వారే కావడం విశేషం. ఐపీఎల్ లో ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతుంటాయి. ముంబై ఇండియన్స్ తరఫున ఇద్దరు సౌతాఫ్రికా బ్యాటర్లు ఓపెనింగ్ చేయడం ఐపీఎల్ లో ఇదే తొలిసారి. ఇక ఇన్నింగ్స్ రెండో ఓవర్ మార్కో యాన్సెన్ వేశాడు. ఈ సమయంలో స్ట్రైకింగ్ లో, నాన్ స్ట్రైకింగ్ ఎండ్ తో పాటు బౌలర్ కూడా సౌతాఫ్రికాకు చెందిన వారే ఉండడం మరో గమనించదగ్గ అంశం.





# ఐపీఎల్‌లో సెంచరీ కొట్టిన అర్షదీప్

ఐపీఎల్ లో పంజాబ్ కింగ్స్ బౌలర్ అర్షదీప్ సింగ్ సెంచరీ నమోదు చేశాడు. అయితే అర్ష దీప్ సెంచరీ నమోదు చేసింది బ్యాటింగ్ లో అనుకుంటే పొరపాటే. ఎందుకంటే బౌలింగ్ లో అర్ష దీప్ ఈ ఫీట్ ను సాధించాడు. ఐపీఎల్ 2026 సీజన్లో ముంబై ఇండియన్స్ తో మ్యాచ్ లో ఓపెనర్ రికెల్ టన్ ను ఔట్ చేయడం ద్వారా అర్ష దీప్ ఐపీఎల్ లో వంద వికెట్ల మార్క్ ను చేరుకున్నాడు.

ఐపీఎల్ లో వంద వికెట్లు సాధించి ఐదో లెఫ్టార్మ్ పేసర్ గా, నాలుగో భారత బౌలర్ గా నిలిచాడు. ఇంతకముందు ట్రెంట్ బౌల్ట్ (144 వికెట్లు), ఉనాద్కట్ (114 వికెట్లు), ఆశిష్ నెహ్రా (106 వికెట్లు), జహీర్ ఖాన్ (102 వికెట్లు) ముందున్నారు. ఇక పవర్ ప్లేలో అర్ష దీప్ వికెట్ తీసుకోవడం 11 ఇన్నింగ్స్ ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం.



# హైదరాబాద్‌లో అడుగుపెట్టిన ధోని!

ఐపీఎల్ 2026 సీజన్ లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఆరంభంలో తడబడినప్పటికీ వరుసగా రెండు విజయాలు నమోదు చేసిన సీఎస్ కే గాడిన పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్హెచ్), సీఎస్కే మధ్య ఉప్పల్ వేదికగా మ్యాచ్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్ లో ధోని బరిలోకి దిగుతాడా లేదా అనేది స్పష్టత రాలేదు. కానీ ధోని మాత్రం జట్టుతో కలిసి హైదరాబాద్ చేరుకున్నాడు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అంతకముందు చెన్నై నుంచి హైదరాబాద్ కు బయల్దేరిన సీఎస్కే జట్టు ఫొటోలు, ధోని వీడియోనూ చెన్నై సూపర్ కింగ్స్ ప్రత్యేకంగా పంచుకుంది. 'మేము వస్తున్నాం, హైదరాబాద్' అని తెలుగులో క్యాప్షన్ జత చేసింది.

# అది దీపిక సంపాదించుకున్న స్థాయి... ఆమెకు ఆ హక్కు ఉంది..: కంగన

ఇండస్ట్రీలో వర్కింగ్ అవర్స్ పై అనేక మంది నటీనటులు తమ స్పందన తెలియజేసిన సంగతి తెలిసిందే. ఈ చర్చ ఇంకా కొనసాగుతూనే ఉంది. పని గంటల విషయంలో అభిప్రాయ భేదాలు రావడంతో అగ్ర కథానాయిక దీపిక పదుకొణె భారీ ప్రాజెక్ట్ లు సైతం వదులుకున్నారు. తాజాగా ఈ విషయమై నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ స్పందించారు. దీపికకు మద్దతుగా నిలబడ్డారు. 8 గంటలు మాత్రమే పనిచేస్తానని దీపిక చెప్పడం సబబేన్నారు. ఎంతో కష్టపడి ఆమె ఈ స్థాయికి వచ్చారని, నటించే విషయంలో తనకంటూ నిర్ణయం తీసుకునే హక్కు ఉందన్నారు. పైగా ఇప్పుడామె ఓ బిడ్డకు తల్లి కూడా అని ఎంపీ కంగనా రనౌత్ అన్నారు.

''వర్కింగ్ అవర్స్ విషయంలో వివాదం సృష్టించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బాలీవుడ్ లో ప్రస్తుతం దీపిక పదుకొణె స్థానం ఆమె ఎంతో కష్టపడి సంపాదించుకున్నది. పైగా ఇప్పుడామె ఓ బిడ్డకు తల్లి. అగ్ర కథానాయిక. ఒకవేళ ఆమె 8 గంటలు మాత్రమే పని చేస్తానని అంటే కచ్చితంగా ఆ నిర్ణయం తీసుకున్న హక్కు తనకి ఉంది. గతంలో నేను దీపికను కలిసినప్పుడు తాను ఇంతియాజ్ అలీ సినిమా కోసం 12 గంటల పాటు పనిచేస్తున్నట్లు చెప్పింది. అప్పుడు నేను కేవలం 10 గంటలు మాత్రమే పనిచేస్తానని చెప్పా. అప్పట్లో మేము సినిమా కోసం ఎన్ని గంటలైనా పనిచేసేవాళ్లం. చాలా ఉత్సుకతతో ఉండేవాళ్లం. ఏదైనా చేయడానికి రెడీ అనే వాళ్లం. అందుకే మేము సక్సెస్ అయ్యాం''

''కొత్తగా ఇండస్ట్రీకి వచ్చిన సమయంలో ఎవరికైనా వారి స్థానం, పాత్ర మారిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడు దీపిక స్థానం ప్రత్యేకం. పైగా ఆమె ఓ బిడ్డకు తల్లి. కుటుంబం తర్వాతే ఏమైనా. ఎంతో కష్టపడి ఆమె ఈ స్థాయికి చేరుకుంది. ఎవరైనా కచ్చితంగా తనతో పనిచేయాలనుకుంటే ఆ 8 గంటలు పనిచేయడానికి ఇష్టపడే పిలుస్తారు. అలా ఎందుకు చేయకూడదు. ప్రస్తుతం ఎక్కువమంది సంతాన సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. వివాహ బంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు ఏం చేస్తారు? వాపై ఒత్తిడి పెరుగుతూ వస్తోంది. ఇటు కుటుంబం అటు పిల్లలతో పని రెట్టింపు అవుతోంది. ఇప్పుడు పేర్లు చెప్పాల్సిన పనిలేదు. చాలా మంది





నటులు ఏళ్ల నుంచి 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నారు. వారాంతాల్లో వారు షూటింగ్ లకు రారు'' అని కంగనా చెప్పుకొచ్చారు. 'స్పిరిట్', 'కల్కి 2' నుంచి వైదొలిగిన తర్వాత దీపికా పదుకొణె పని గంటలపై స్పందించారు. తనకు ఆరోగ్యమే ముఖ్యమని అన్నారు. నిద్ర, పోషకాహారం, వ్యాయామం... వీటికి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలన్నారు.



# సల్మాన్, వంశీ పైడిపల్లి ప్రాజెక్ట్ పై క్రేజీ అప్డేట్!

రీసెంట్ గా అనౌన్స్ అయ్యిన క్రేజీ కాంబినేషన్ చిత్రాల్లో బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ హీరోగా మన టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కలయికలో అనౌన్స్ చేసిన సినిమా కూడా ఒకటని చెప్పాలి. అనౌన్సమెంట్ తో మంచి బజ్ ని సొంతం చేసుకున్న ఈ సినిమాపై ఇప్పుడు క్రేజీ అప్డేట్ తెలుస్తుంది. దీని ప్రకారం ఈ సినిమా తాలూకా షూట్ ఎప్పుడు నుంచి మొదలు కానుంది? ఇతర కొన్ని వివరాలు తెలుస్తున్నాయి.

మేకర్స్ ఈ సినిమా తాలూకా మొదటి షెడ్యూల్ ని ఈ ఏప్రిల్ 18 నుంచి మే 4 వరకు చేయనున్నారట. ఇందుకోసం ఓ ఇంటి సెట్ ని కూడా వేసారట. అలానే ఈ షెడ్యూల్ లోనే ఒక వింటేజ్ సాంగ్ ని సల్మాన్ తో వంశీ పైడిపల్లి ప్లాన్ చేశారట. సో ఈ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ని కూడా వంశీ తనదైన శైలిలో తీసుకెళ్లనున్నారని చెప్పవచ్చు. ఇక ఈ సినిమాలో నయనతార హీరోయిన్ గా నటిస్తుండగా దిల్ రాజు నిర్మాణం వహిస్తున్నారు.

# తమన్నా పిటిషన్.. కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు

'పవర్ సోప్స్' కంపెనీపై నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్ ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి నటి తగిన సాక్ష్యాలు చూపలేకపోవడంతో పిటిషన్ ను న్యాయస్థానం తోసిపుచ్చింది. బ్రాండ్ ప్రమోషన్స్ కు సంబంధించి తమన్నా, పవర్ సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది. 2009 అక్టోబరు వరకూ తమన్నా ఫొటోలతో పవర్ సోప్స్ ప్రచారం చేసుకోవడం అగ్రిమెంట్. అయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010- 2011 మధ్య సదరు సంస్థ తన ఇమేజ్ లను అనధికారికంగా వినియోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకుగానూ సంస్థ నుంచి రూ.కోటి నష్టపరిహారం డిమాండ్ చేస్తూ.. ఆ కంపెనీ తన ఫొటోలు వాడకుండా చేయాలంటూ తమన్నా ఇటీవల కోర్టును ఆశ్రయించారు. ఏకసభ్య ధర్మాసనం తీర్పును సవాలు చేస్తూ మరో పిటిషన్ వేశారు. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ పిటిషన్ ను ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది.



# 'లెనిన్' మాస్ నెంబర్ అదిరిపోయింది!

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'లెనిన్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి డైరెక్ట్ చేస్తున్న ఈ రూరల్ యాక్షన్ డ్రామాలో అఖిల్ తనదైన మాస్ గెటప్ లో కనిపిస్తూ ప్రేక్షకుల్లో సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాడు. ఇక ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్ గా నటిస్తుండటంతో వీరి కాంబో ఎలా ఉండబోతుందా అనే ఆసక్తి నెలకొంది.

తాజాగా ఈ చిత్రం నుంచి రెండో సింగిల్ సాంగ్ గా 'ఎట్టా ఎట్టా' అనే మాస్ నెంబర్ను రిలీజ్ చేశారు. అఖిల్, భాగ్యశ్రీ తమ కెమిస్ట్రీతో పాటు చక్కటి డ్యాన్స్ స్టెప్పులతో అభిమానులకు అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. భాస్కరభట్ల లిరిక్స్ కు థమన్ క్యాచీ ట్యూన్స్ తోడవడంతో ఈ పాట మాస్ ఆడియన్స్ తో పాటు కామన్ ఆడియన్స్ ను కూడా ఇంప్రెస్ చేస్తుంది. ఇక ఈ సినిమాను నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ సినిమాను జూన్ 26, 2026న రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.




# జూన్‌లో పెద్ది



రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' విడుదల మరోసారి వాయిదా పడింది. జూన్ లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు నిర్మాణ సంస్థ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. నిర్మాణానంతర పనుల కోసం అదనంగా మరింత సమయం కేటాయించడం కోసమే ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు అందులో వెల్లడించింది. మొదట మార్చిలోనే రావాల్సిన ఈ సినిమాని, ఏప్రిల్ 30కి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రేక్షకులకు అత్యుత్తమమైన థియేట్రికల్ అనుభవాన్ని అందించనున్నామని, సినిమా రూపుదిద్దుకుంటున్న విధానంపై తామంతా గొప్ప సంతృప్తితో ఉన్నామని 'పెద్ది' బృందం తెలిపింది. ప్రత్యేకగీతం మినహా, ఇప్పటికే టాకీ భాగం చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీపైన స్పష్టత రానుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నారు. శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. సంగీతం: ఎ.ఆర్.రెహమాన్.

# ధనుష్‌తో సారా అర్జున్?

త్వరలో 'కర' సినిమాతో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతున్నారు ధనుష్. పలు భాషలలో వరుస సినిమాలతో బిజీగా గడుపుతున్న ఈయన ఖాతాలో దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు తెరకెక్కిస్తున్న ఓ సినిమా ఉన్న సంగతి తెలిసిందే. 'డీ 56' (వర్కింగ్ టైటిల్)గా పట్టాలెక్కబోతున్న ఈ చిత్రంలో ధనుష్ తో అందాల తార రుక్మిణీ వసంత్ జోడీ కట్టనున్నట్లు కొన్నిరోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇప్పుడామె స్థానంలో బాలీవుడ్ యువ కథానాయిక సారా అర్జున్ ను తీసుకున్నట్లు సమాచారం. ''పలు ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల రుక్మిణి ఈ చిత్రాన్ని అంగీకరించలేకపోయింది. ఇప్పుడా పాత్ర కోసం 'ధురంధర్'తో మంచి క్రేజ్ సంపాదించుకున్న సారాను ఎంపిక చేసే పనిలో పడింది చిత్రబృందం. ఒకవేళ అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. ఆమె మొదటి తమిళ చిత్రమిదే కానుంద''ని తమిళ సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరి రుక్మిణి, సారా.. ఈ ఇద్దరిలో ధనుష్ సరసన నటించేదెవరు? అనే విషయంపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.